


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఖమ్మం | 12-09-2026శనివారం | సంపుటి : 13 | సంచిక : 289 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on



# 'భు-భారతి' విశ్లేషణ

### వివాదాస్పద ప్రైవేట్ భూమి 3.06 లక్షల ఎకరాలే: సీఎం రేవంత్


**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం) :** రాష్ట్రంలో కోటి ఎకరాల ప్రైవేట్ భూములను 22A నిషేధిత జాబితాలో పెట్టారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. నిజానికి వివాదాస్పదంగా ఉన్న ప్రైవేట్ భూముల విస్తీర్ణం కేవలం 3.06 లక్షల ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. అసెంబ్లీలో 22A ఆస్తులపై జరగనున్న చర్చకు ముందు గురువారం రాత్రి నిర్వహించిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (CLP) సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తి గణాంకాలతో కూడిన వివరాలను ఎమ్మెల్యేల ముందు ఉంచారు. ప్రతిపక్షాల అవాస్తవాలను సభ వేదికగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

భూముల లెక్క ఇదీ: 1.01 కోటి ఎకరాలు శాశ్వతంగా నిషేధిత జాబితాలోనే! రాష్ట్రంలోని 'భుభారతి' ల్యాండ్ పోర్టల్‌లో నమోదు చేసిన మొత్తం 2.5 కోట్ల ఎకరాల భూమిలో.. ఎప్పటికీ రిజిస్ట్రేషన్‌కు వీలులేని దాదాపు 1.01 కోటి ఎకరాల భూములు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ 1.01 కోటి ఎకరాల భూములు చట్టప్రకారం ఎప్పటికీ 22A పరిధిలోనే ఉంటాయని స్పష్టం చేశారు. వీటిని మినహాయిస్తే, రెవెన్యూ రికార్డులతో సరిచూస్తున్న అసలైన ప్రైవేట్ భూముల వివాదం కేవలం 3.06 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితమని వెల్లడించారు. అమ్మకానికి వీలులేని ప్రభుత్వ భూములను, ప్రైవేట్ భూముల సమస్యగా చిత్రీకరిస్తూ బిఆర్ఎస్, బిజెపిలు రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయని సీఎం మండిపడ్డారు.

**ప్రజాభిప్రాయం బిఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఉంది**

అసెంబ్లీ గేట్ వద్ద జరిగిన గొడవలు, ఎర్రవల్లి నివాసం వద్ద చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ.. అంతర్గత సర్వేల ప్రకారం ప్రజల్లో బిఆర్ఎస్ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు.

# గ్లోబల్ సవాళ్లు
# ట్రంప్ విధానాల కలకలం



### బ్రిక్స్ సదస్సులో 11 దేశాల నేతల భేటీ
### దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (ఏఎంఎస్) :** అతిథ్య దేశమైన భారత్‌తో పాటు చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, యూఏఈ, ఇరాన్‌లతో కూడిన 11 బ్రిక్స్ (BRICS) కూటమి దేశాల అగ్రనేతలు, ఆహ్వానిత దేశంగా సౌదీ అరేబియా ప్రతినిధులు అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించేందుకు సిద్ధమయ్యారు. అయితే, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహాత్మక, ఆర్థిక విధానాలు ప్రపంచ దేశాలపై చూపుతున్న ప్రభావమే ఈ సదస్సులో ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది.

**టారిఫ్‌ల భయం.. అస్థిరతలో గ్లోబల్ మార్కెట్లు**

ఇరాన్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, అలాగే ఇటు ప్రత్యర్థి దేశాలతో పాటు అటు మిత్రదేశాలపైనా విచక్షణ రహితంగా సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తామంటూ వైట్‌హౌస్ ఇచ్చే హెచ్చరికలు ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా అస్థిరపరిచాయి. గ్లోబల్ ఎకానమీ భవిష్యత్తు ఎటు వైపు వెళ్తుందో ఊహించలేని అనిశ్చితి వైపు నెట్టివేశాయి. ఇటువంటి సంక్లిష్ట ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలోనే బ్రిక్స్ అగ్రనేతలు ఒకే వేదికపైకి వచ్చారు.

**అమెరికాకు వ్యతిరేకంగా కఠిన ప్రకటన కష్టమే!**

ప్రస్తుత పరిస్థితుల్లో ట్రంప్ విధానాలను, వారి (జియోపాలిటిక్స్) నిర్ణయాలను నేరుగా ఎండగడుతూగానీ, లేదా అమెరికాను తట్టుకునేందుకు ఒక ఉమ్మడి వ్యూహాన్ని ప్రకటిస్తూగానీ బ్రిక్స్ కూటమి ఏకగ్రీవ తీర్మానం చేసే అవకాశం చాలా తక్కువగా కనిపిస్తోంది. వాషింగ్టన్ (అమెరికా) సవాళ్లను ఎంతవరకు ప్రతిఘటించాలనే విషయంలో బ్రిక్స్ సభ్యదేశాల మధ్య తీవ్రమైన అభిప్రాయ భేదాలు ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.

భారత్, చైనాల వ్యూహాత్మక వైఖరిరష్యా, ఇరాన్‌లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా బ్రిక్స్ వేదికగా స్పష్టమైన, కఠినమైన వైఖరిని తీసుకోవాలని పట్టుబట్టే అవకాశం ఉన్నప్పటికీ.. కూటమిలోని భౌగోళిక రాజకీయ వాస్తవాలు దానికి అడ్డంకిగా మారాయి.భారత్ వైఖరి: అమెరికాతో కీలకమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని (Trade Deal) ఆఖరి దశకు తీసుకెళ్లిన భారత్, వైట్‌హౌస్‌కు ఆగ్రహం తెప్పించే ఎలాంటి సంయుక్త ప్రకటనలకూ మొగ్గు చూపదు.చైనా వ్యూహం: అలాగే, అమెరికాను లక్ష్యంగా చేసుకోవడానికి తమ కూటమి అయిన 'బ్రిక్స్'ను వాడుకుంటోందనే ముద్ర పడటం చైనాకు కూడా ఇష్టం లేకపోవచ్చు.సభ్య దేశాల భిన్న ధృక్పథాలు, సొంత ప్రయోజనాల దృష్ట్యా ఈ సదస్సులో అమెరికా విధానాలపై ఎలాంటి ఉమ్మడి ప్రకటన వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# 'క్రిమినల్ రియల్ ఎస్టేట్ ప్రభుత్వం': కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం) :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సెక్షన్ 22(A) ప్రొహిబిటెడ్ (నిషేధిత) భూముల జాబితాను ఆసరాగా చేసుకుని భారీ భూ అక్రమాలకు పాల్పడుతోందని, రాష్ట్రంలో "క్రిమినల్ రియల్ ఎస్టేట్ దందా" నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భూములను రక్షించాల్సిన ప్రభుత్వ పెద్దలే ఆక్రమణదారులుగా మారారని ఆయన ఆరోపించారు. శుక్రవారం 'భుభారతి' పోర్టల్ లోని 22(A) ప్రొహిబిటెడ్ జాబితా వల్ల నష్టపోయిన బాధితులతో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ వ్యవహారం రాష్ట్రంలోనే అతిపెద్ద కుంభకోణంగా మారుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న ఈ అరాచకాలను త్వరలోనే కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**సమాంతర రెవెన్యూ వ్యవస్థ.. 30 శాతం కమిషన్ల దందా!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తమ బంధువులు, అనుచరులకు లబ్ధి చేకూర్చేందుకు అధికారిక వ్యవస్థకు తోడుగా ఒక "సమాంతర రెవెన్యూ పరిపాలన" నడుపుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. అపారదర్శకంగా సాగుతున్న ఈ నెట్‌వర్క్ ద్వారా భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తమ భూముల పేర్లను తొలగించాలంటే 30 శాతం కమిషన్ ఇవ్వాలని బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో స్థిరాస్తి రంగంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా తుడిచిపెట్టేసిందని విమర్శించారు. సుమారు 1.16 కోట్ల ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చారని, తమకు భూములు అమ్మడానికి నిరాకరించిన యజమానులను సెక్షన్ 22(A) పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు.

**వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లే ఉంది!**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రేవంత్ రెడ్డిని సీఎం చేయడం అంటే.. గంధపు చెక్కల దొంగ వీరప్పన్‌ను తీసుకెళ్లి అటవీ శాఖ మంత్రిని చేసినట్లే ఉంది" అని ఎద్దేవా చేశారు. గతంలో ఆర్‌టీఐ (RTI) సమాచారాన్ని ఆసరాగా చేసుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడిన వ్యక్తి, ఇప్పుడు సీఎం పీఠంపై కూర్చొని మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని తన రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ముఖ్యమంత్రితో చేతులు కలిపి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వీరిద్దరూ 'జాయింట్ వెంచర్ భాగస్వామ్యం' నడుపుతూ, విదేశీ కంపెనీలకు తక్కువ ధరకే భూములు ఇస్తామని హామీలు ఇస్తున్నారన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ పరిసరాల్లోని భూ యజమానుల నుంచి అధికార బలాన్ని ఉపయోగించి భూములను లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు.



**విదేశీ పెట్టుబడిదారులకు లేఖలు రాస్తాం!**

ప్రజల నుంచి భూములను గుంజుకుని రేవంత్ రెడ్డి, పొంగులేటి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూర్చేందుకే ముందస్తు ప్రణాళికతో 'భుభారతి' పోర్టల్‌ను తీసుకొచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు.

"మాజీ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా నాకు అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ పెద్దల కుటుంబాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్న విదేశీ కంపెనీలు, పెట్టుబడిదారులకు త్వరలోనే లేఖలు రాస్తాను. ఇక్కడ జరుగుతున్న అక్రమాలు, నేరాల గురించి వారికి వివరించి అప్రమత్తం చేస్తాను" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ప్రతి ప్రాజెక్ట్ వెనుక రియల్ ఎస్టేట్ స్వార్థమే! రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ప్రాజెక్టు వెనుక రియల్ ఎస్టేట్ స్వార్థ ప్రయోజనాలే దాగి ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ పరిసర భూములు, లగచర్ల, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఫ్యూచర్ సిటీ, కొంగరకలాన్ ప్రాంతాల్లో జరుగుతున్న భూ లావాదేవీలే ఇందుకు నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టే ప్రతి పథకం వెనుక డబ్బు సంపాదించే కుంభకోణం ఉందే తప్ప, సంక్షేమం, అభివృద్ధి మూలనపడ్డాయని విమర్శించారు.

# ఇంతే కదా...!




# ఉగ్రవాదం ప్రపంచానికే ముప్పు

### 2014 నాటి న్యూయార్క్ జ్ఞాపకాలను పంచుకున్న ప్రధాని
### బాధితులకు ప్రధాని మోదీ భావోద్వేగ నివాళి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11 (ఏఎంఎస్) :** అమెరికాలో సంచలనం సృష్టించిన 9/11 భయానక ఉగ్ర దాడులు జరిగి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, ఆ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. ఉగ్రవాదం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా లెక్కలేనన్ని అమాయక ప్రాణాలు బలికావడంపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సీమాంతర ఉగ్రవాద ముప్పుతో భారతదేశం కూడా దశాబ్దాలుగా సుదీర్ఘ పోరాటం చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**మారుతున్న ఉగ్ర రూపురేఖలు.. అంతర్జాతీయ సహకారం అత్యవసరం**

ఉగ్రవాదం రూపం మార్చుకుంటూ కొత్త సవాళ్లను విసురుతోందని, ఈ వినాశకర మహమ్మారిని రూపుమాపేందుకు ప్రపంచ దేశాలు చేసే ప్రతి ప్రయత్నానికి భారత్ ఎల్లప్పుడూ నిలకడగా మద్దతు ఇస్తుందని ప్రధాని తమ సోషల్ మీడియా ద్వారా స్పష్టం చేశారు.2014 నాటి జ్ఞాపకాలను పంచుకున్న ప్రధానితమ సందేశంతో పాటు, 2014లో తాను అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో న్యూయార్క్‌లోని '9/11 మెమోరియల్ మ్యూజియాన్ని' సందర్శించినప్పటి అరుదైన దృశ్యాలను, ఫోటోలను ప్రధాని మోదీ పంచుకున్నారు.

# విద్యావ్యవస్థలో నవ శకం

- ఏఐ సాంకేతికతతో 'ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' – మంత్రి శ్రీధర్ బాబు
- పాఠశాలల నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు సంచలన మార్పులు
- ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం
- పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సిలబస్ మార్పులు
- డ్రగ్స్ రహిత తెలంగాణయే లక్ష్యం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం) :** తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శాసనసభలో విద్యారంగ సంస్కరణలపై సాగిన చర్చలో ఆయన మాట్లాడారు. కేవలం చదువు మాత్రమే కాకుండా విద్యార్థుల శారీరక ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**ఏ ఒక్క విద్యార్థీ ఆకలితో ఉండకూడదు**

పాఠశాలకు వచ్చే ఏ ఒక్క విద్యార్థీ ఖాళీ కడుపుతో తరగతి గదిలో కూర్చోకూడదనేది ప్రభుత్వ సంకల్పమని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు వెల్లడించారు.

**దేశంలోనే మునుపెన్నడూ లేని విధంగా ఏఐ బడి**



నూతన సాంకేతికతకు అద్దం పడుతూ దేశంలోనే తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) సాంకేతికతతో కూడిన 'ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'ను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. మారుతున్న కాలానికి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా వాతావరణాన్ని ఈ బడుల ద్వారా కల్పించనున్నట్లు వివరించారు.

**పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కొత్త పాఠ్యాంశాలు**

ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే దిశగా ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ కోర్సుల సిలబస్‌లో విస్తృత మార్పులు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత పరిశ్రమల (ఇండస్ట్రీ) అవసరాలకు తగినట్లుగా నైపుణ్యాలను పెంపొందించే పాఠ్యాంశాలను చేర్చినట్లు వివరించారు. దీనికి తోడు యువతలో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచి, నేరుగా ఉద్యోగాలు సాధించేలా 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణయే ధ్యేయంరాష్ట్రాన్ని మత్తు పదార్థాల రహితంగా (డ్రగ్స్ ఫ్రీ) మార్చేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుతూ, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. విద్య, పౌష్టికాహారం, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి సమ్మేళనంగా రాష్ట్రంలో సమగ్ర విద్యా విధానం అమలవుతోందని ముగించారు.



# రూ.8,000 కోట్లతో ఆధునీకరణకు శ్రీకారం

### పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం) :** రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తేల్చి చెప్పారు. పాలిటెక్నిక్ విద్యా సంస్థలను, ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. అవన్నీ కేవలం దుష్ప్రచారమేనని కొట్టిపారేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఐటీఐలకు రూపాయి నిధులు కూడా కేటాయించలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పనిచేస్తోందని స్పష్టం చేశారు.

రూ.8 వేల కోట్లతో పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణ

విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు గాను రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను రూ.8,000 కోట్లతో అప్‌గ్రేడ్ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా పాలిటెక్నిక్ రంగానికి సరికొత్త రూపురేఖలు వస్తాయన్నారు.

పాత కోర్సులు తొలగించం..కొత్తవి తీసుకొస్తాం పాలిటెక్నిక్ విద్య, నూతన కోర్సుల ప్రవేశంపై విద్యార్థులు, లెక్చరర్లలో ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. కొత్త కోర్సులు వస్తే తమ ఉద్యోగ భద్రతకు ఏమవుతుందోనని కొందరు అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారని, అయితే ప్రస్తుతం ఉన్న ఏ ఒక్క కోర్సునూ రద్దు చేయబోమని భరోసా ఇచ్చారు. పాత కోర్సులతో పాటు పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా మాత్రమే కొత్త కోర్సులను జోడిస్తామని స్పష్టం చేశారు.

ఫీజుల పెంపు ఉండదు.. జీఓ 97 సవరణకు సిద్ధంవిద్యార్థులు, అధ్యాపకులు ఎలాంటి ఆందోళనలకూ గురికావాల్సిన అవసరం లేదని మంత్రి సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ 97లో అవసరమైతే మార్పులు చేర్పులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అంతేకాకుండా, విద్యార్థులపై ఎలాంటి దనపు ఆర్థిక భారం పడకుండా, ఫీజుల పెంపు ఉండదని స్పష్టమైన హామీ ఇచ్చారు.

> **పాత కోర్సులు రద్దు కావు..**
> **కొత్త కోర్సులూ వస్తాయి**

# ఆర్మీ డిపోలో దోపిడీకి ముగింపు

### భార్య ప్రశ్నలతో దొరికిపోయిన మాజీ హవల్దార్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం) :** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసును తెలంగాణ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసు వివరాలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక మీడియా సమావేశంలో వెల్లడించారు.ఆర్మీ డిపోలోనే భారీ చోరీగత నెల (ఆగస్టు 31న) మద్రాస్ రెజిమెంట్‌లోని 'బెల్ ఆఫ్ ఆర్మ్స్' (ఆయుధాగారం) నుంచి పలు పిస్టళ్లు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్లు మాయమయ్యాయి. మొత్తం 12 రకాల ఆయుధాలు చోరీకి గురైనట్లు బ్రిగేడియర్ ఇచ్చిన ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.సందేహాస్పద కదలికలు.. చెమటలు పట్టిన ముఖందర్యాప్తులో భాగంగా ఆయుధాగారంలోకి ప్రవేశం ఉన్న ప్రతి ఒక్కరినీ పోలీసులు క్షుణ్ణంగా విచారించారు.తొలుత ఆర్మ్స్ కోట్ ఇన్‌ఛార్జ్ వినోద్‌కుమార్, అమ్యునేషన్స్ కోర్టు ఇన్‌ఛార్జ్ బల్లి మధులను ప్రశ్నించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనంతరం అక్కడ హవల్దార్లుగా పనిచేసిన ప్రకాశం జిల్లాకు చెందిన టీపీఎస్ రావుతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లేశ్ (అలియాస్ రాజు)పై దృష్టి సారించారు.పోలీసులు విచారణకు పిలిచినప్పుడు మల్లేశ్ రాకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడని డీజీపీ తెలిపారు.



వుదయం





## ముగిసిన లక్ష్మమ్మ జాతర మహోత్సవాలు

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)**

లోకపల్లి లక్ష్మమ్మ జాతర మహోత్సవాలు శ్రావణ ఆఖరి శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొని ఘనంగా ముగించారు. శ్రావణమాసం ప్రారంభం నుండి ప్రతి శుక్రవారం ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం అమావాస్య కావడంతో ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాద తీర్థ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమానికి ఏక్లాస్ పూర్ సర్పంచ్ నర్సింలు గౌడ్, నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండ శ్వేతా సత్యా యాదవ్, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు రవికుమార్ గౌడ్ లతోపాటు తదితరులు హాజరు అయ్యారు.

## అటవీ అమరవీరుల దినోత్సవం



- **పట్టణంలో ర్యాలీ**

**అచ్చంపేట, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**

అటవీ సంరక్షణ, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అటవీ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని అచ్చంపేటలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జీటీడీ అచ్చంపేట నుంచి అచ్చంపేట బస్టాండ్ వరకు అటవీ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటవీ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణులు, ప్రకృతి సంపదను కాపాడేందుకు అటవీ సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అటవీ సంపదను కాపాడిన అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఎదుర్కొనే సవాళ్లను ప్రస్తావిస్తూ, అటవీ సంరక్షణలో అప్రమత్తత, అంకితభావం, సమన్వయం ఎంతో ముఖ్యమని తెలిపారు. భవిష్యత్ తరాలకు పచ్చని అడవులు, సమృద్ధిగా ఉన్న వన్యప్రాణి సంపదను అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.అనంతరం అటవీ అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట, అమ్రాబాద్ డివిజనల్ అధికారులు యాష్ ప్రకాశ్ సింఘాల్, చంద్రశేఖర్ (ఏసీఎఫ్), ఫారెస్ట్ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాగర్ కర్నూల్ జిల్లా యూనిట్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జలసాధన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

- **జేఏసీ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**



నాగర్ కర్నూల్ పట్టణంలోని గాంధీ పార్క్ లో సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జలసాధన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని పెండింగ్ ప్రాజెక్టుల జేఏసీ జిల్లా చైర్మన్ మొసలి శ్యాం ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీక్షకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాల నాయకులు, రైతులు, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులను ఆహ్వానించామన్నారు. ఇది ఏ ఒక్క పార్టీ సమస్య కాదని, ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలందరి సమస్య అని అన్నారు.పాలమూరు ప్రాంతానికి రావాల్సిన సాగునీటిని కాపాడుకోవడంతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించుకోవడానికి ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలన్నారు.పాలమూరు లిఫ్ట్ నీటిని నల్లగొండ వైపు మళ్లించే డిండి లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేయాలని, పాలమూరు ప్రయోజనాల కోసం చంద్రసాగర్అమ్రాబాద్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్ చేశారు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో కీలకమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా సస్యశ్యామలమయ్యే వరకు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని, దీక్షకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## కొండేటికి కదిలిన భక్తజనం

- **అమావాస్య వేళ ఆంజనేయస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తులు.. మార్మోగిన నామస్మరణ**

**ధరూర్ సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో)**



అమావాస్య పర్వదినం.. ఆంజనేయస్వామి దర్శనం కోసం భక్తజనం వెల్లువెత్తారు. మండల కేంద్రంలోని ప్రసిద్ధ కొండేటి ఆంజనేయస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం కోసం బారులుఅమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు..దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. మార్మోగిన ఆంజనేయ నామస్మరణ భజన భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన భజనలు, భక్తి కీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తి గీతాలు, భజనలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తి వెల్లువ అమావాస్య సందర్భంగా కొండేటి ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసందోహంగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రాక కొనసాగింది. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన కొండేటి ఆంజనేయస్వామి ఆలయం అమావాస్య రోజున భక్తి సంద్రంగా మారింది.

# గడి పెద్దాపూర్ అభివృద్ధి చరిత్రను మర్చిపోవద్దు!

**మెదక్ సెప్టెంబర్11 అల్లదుర్గం / (వుదయం ప్రతినిధి )**



గడి పెద్దాపూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సమావేశమై మన గ్రామ అభివృద్ధి గురించి మాట్లాడే ముందు గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలనీ,BRS ప్రభుత్వ హయాంలో బాబు మోహన్ గారు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో NH రోడ్డు నుంచి హనుమాన్ దేవాలయం వరకు BT రోడ్డు నిర్మించిన చరిత్ర BRS ప్రభుత్వానిదే.అదేవిధంగా చంటి క్రాంతి కిరణ్ గారు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రాథమిక పాఠశాల నుంచి బిజిలీపూర్ గ్రామం వరకు BT రోడ్డు నిర్మించిన ఘనత కూడా BRS ప్రభుత్వానిదే.ఇవే కాకుండా గ్రామంలో ఎన్నో CC రోడ్లు, HiMast లైట్లు, పంచాయతీ కార్యాలయం, రైతు వేదికతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు BRS ప్రభుత్వ హయాంలోనే జరిగాయి.

**ముఖ్యంగా...**

ఒకప్పుడు మంచినీటి కోసం ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి నుంచి ప్రతి ఇంటికీ నల్లా నీరు అందించిన ఘనత కూడా BRS ప్రభుత్వానిదే.ఇన్ని అభివృద్ధి పనులు జరిగిన చరిత్రను మర్చిపోయి, గత ప్రభుత్వంలో ఏమీ జరగలేదని చెప్పడం ఎంతవరకు సమంజసం? గ్రామ ప్రజలకు వాస్తవాలు తెలుసు. ఎవరి హయాంలో ఏ అభివృద్ధి జరిగిందో ప్రజలు గుర్తుంచుకున్నారు.
గ్రామంలో 10 ఏండ్లు కాంగ్రెస్ సర్పంచ్ ఉన్న పార్టీలకు అతీతంగా ఎన్నో పనులు చేసిన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వనిధి మా నాయకులది.అంత ఇంత మెజారిటీ ఇచ్చాము అని గొప్పలు చెప్పుకునే మీరు అదే స్థాయిలో ప్రజల సమస్యలు తీర్చే ప్రయాణంలో ఎందుకు విఫలం అయ్యారు?ఏ రోజైనా మంత్రి గారికి ఎమ్మెల్యే గారికి సమస్యల పైన లేదా అధికారులకు వినతి పత్రం అయినా ఇచ్చిన చరిత్ర ఏం అయినా ఉందా?మీ మంత్రి గారూ గ్రామానికి ఒక్కసారైనా వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకునే కనీస ప్రయత్నం అయిన చేసాడా? సింగూరు కాలువల ద్వారా గ్రామ పెద్ద చెరువుకు సాగునీరు అందించింది పెద్దాపూర్ గ్రామంతో పాటు కన్నంపల్లీ, రామసంపల్లీ,కుసంగి ప్రజల కష్టాలను తీర్చిన ఘనత కూడా బిఆర్ఎస్ ప్రభుత్వ నీదే.ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో మౌలిక సదుపాయాలు కల్పించినా ఘనత కేసీఆర్ గారిదే!!
ఈరోజు కూడా రోడ్ సమస్య తీరింది అంటే ప్రజల మద్దతు బిఆర్ఎస్ పార్టీ చేసిన పోరాట ఫలితమే!!బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏం జరగలేదు అని చెప్పు కొచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులకు చర్చలకు సిద్ధమా అని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్ పార్టీ నాయకులతో కలసి సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సొసైటీ చైర్మన్ దుర్గా రెడ్డి గారు,పార్టీ అధ్యక్షులు దుర్గా రెడ్డి గారు,మాజీ ఎంపీపీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్,సీనియర్ నాయకులు రజనీ కాంత్,చెన్న కృష్ణ గౌడ్,వార్డు సభ్యులు విజయ్ కుమార్ ,అనిల్ మరియు రమేశ్ , వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# కూడవెల్లి వాగు బ్రిడ్జిపై రైతుల రాస్తారోకో

- **విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం**
- **తక్షణమే విద్యుత్ సరఫరా అందించాలి**
- **విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.!**
- **సర్పంచ్ మాధవనేని భానుప్రసాద్**

**అక్బర్ పేట భూంపల్లి సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లా అక్బర్పేటభూంపల్లి మండలంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ శుక్రవారం మండల రైతులు నిరసనగళం విప్పారు. జాతీయ ప్రధాన రహదారిపై ఉన్న కూడవెల్లి వాగు బ్రిడ్జిపై రైతులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ మాట్లాడుతూ,దుబ్బాక నియోజకవర్గంలో విద్యుత్ కోతల వల్ల పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించని పక్షంలో త్వరలోనే సిద్దిపేట విద్యుత్ కార్యాలయంతో పాటు, సబ్ స్టేషన్లను ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు. మరోవైపు సకాలంలో యూరియా దొరక్క పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ధర్నాతో జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న భూంపల్లి పోలీసులు వెంటనే ధర్నా స్థలానికి చేరుకుని, రైతులతో మాట్లాడి విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో చిన్న నిజాంపేట్ సర్పంచ్ మహేష్,వివిధ గ్రామాల రైతులు అరిగే కృష్ణ,శ్రీరామ్ మండల గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వనపట్ల గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి భూమిపూజ

**నాగర్ కర్నూల్ రూరల్, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**



నాగర్ కర్నూల్ జిల్లా వనపట్ల గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ వాసుదేవుడు, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతిరావు పూలే విగ్రహానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని స్థాపించుకోవడం అంటే భారత విద్యా జ్యోతిని నిలబెట్టుకోవడమేనని, సమ సమాజ స్థాపనకు, సాంఘిక సమానత్వం కోసం త్యాగం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని, , విద్య, మానవ హక్కులు, సామాజిక వికాసం కోసం నిరంతరం కృషి చేసిన సామాజిక విప్లవకారుడని శ్లాఘించారు. మర్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ సమస్త సమస్యలకు విద్యయే వెలుగు అని నమ్మి అన్ని వర్గాల కోసం ముఖ్యంగా మహిళల కోసం బడులు, పాఠశాలలు, విద్య కోసం ఎనలేని కృషి చేసిన స్ఫూర్తిదాత మహాత్మా జ్యోతిబా పూలే అని అన్నారు. వనపట్ల సుబ్బయ్య మాట్లాడుతూ సత్య శోధక్ సమాజ్ ద్వారా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పూలే అని, 2026 ఏప్రిల్ 11న ఆయన ద్విశత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, కుల నిర్మూలన ఉద్యమానికి బాటలు పరిచి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన మహాత్ముడు చిరస్మరణీయుడని, ఆయన జీవితం, సిద్ధాంతం, పోరాటం నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో కొండకింది మన్యపు రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీటీసీ బుషపాగ రాములు, కౌన్సిలర్ తిమ్మాజిపేట పాండు, బాబురావు, కరణ్ లాల్, గౌడుగు తిర్పతయ్య, విజయ శంకర్ రెడ్డి, నర్సింహ, కృష్ణయ్య, స్వామి, జావుల బాలయ్య పాల్గొన్నారు.

# గుడ్డెందొడ్డి ఇక జలగర్జన!

- **1.19 టీఎంసీల నుంచి ఏకంగా 15 టీఎంసీలకు సామర్థ్యం పెంపు**
- **గద్వాల రైతాంగానికి భారీ జలభరోసా.. రెండు లక్షల ఎకరాలకు సాగునీటి లక్ష్యం**
- **సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ధరూర్ నేతల పాలాభిషేకం**

**ధరూర్ సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో)**



జోగులాంబ గద్వాల జిల్లా రైతాంగం సాగునీటి కల సాకారం దిశగా మరో కీలక అడుగు పడింది. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి ఏకంగా 15 టీఎంసీలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నియోజకవర్గ రైతాంగంలో నూతనోత్సాహాన్ని నింపింది. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురుచూ స్తున్న రైతులకు ఈ నిర్ణయం గొప్ప భరోసానిచ్చిందని ధరూర్ మండల నాయకులు పేర్కొన్నారు. ఈ చారిత్రక నిర్ణయానికి కృతజ్ఞతగా ధరూర్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయానికి హర్షం వ్యక్తం చేశారు. 1.19’ నుంచి ‘15’.. భారీ మార్పు! ఇప్పటి వరకు 1.19 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌ను 15 టీఎంసీల స్థాయికి తీసుకెళ్లే నిర్ణయం సాగునీటి రంగంలో కీలక పరిణామంగా నాయకులు అభివర్ణించారు.

**గద్వాల రైతుకు ఇక రెండు పంటల భరోసా!**

ధరూర్ సర్పంచ్ డీఆర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గద్వాల నియోజకవర్గ రైతాంగం, ప్రజల ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ సాగునీటి అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రెండు పంటలకు నీరు.. చివరి ఆయకట్టు వరకు సాగునీరు.. సుమారు రెండు లక్షల ఎకరాలకు నీరు అందించాలన్న లక్ష్యం గద్వాల రైతాంగానికి గొప్ప ఊరటనిచ్చే అంశమని విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్య పెంపు నిర్ణయం కేవలం ఒక ప్రాజెక్టు సామర్థ్యం పెంపు మాత్రమే కాదని, గద్వాల రైతాంగ భవిష్యత్తుకు నీటి భద్రత కల్పించే కీలక నిర్ణయమని ఆయన అన్నారు. ప్రభుత్వానికి రైతాంగం కృతజ్ఞతలు గుడ్డెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచేందుకు నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి గద్వాల నియోజకవర్గ రైతాంగం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను గుర్తించి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో గద్వాల ప్రాంత వ్యవసాయానికి మరింత బలాన్నిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ధరూర్‌లో నిర్వహించిన పాలాభిషేక కార్యక్రమంలో ధరూర్ బక్క రవి చిరు సి రవి ఎల్కూర్ రామన్న, దర్శల్లి, కర్రెప్ప, ఎల్కూర్ సత్తన్న సంజీవ్తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆయుష్షు ను కాపాడేదే ఆయుర్వేదం

- **పారంపర్య వైద్యాన్ని పరిరక్షించాలి.. ప్రకృతి వైద్య విధానాలను ప్రోత్సహించాలి**
- **ఆయుర్వేద వైద్యుడు కమ్మరి శ్రీనివాసచారి**

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం):**



ప్రకృతి ప్రసాదించిన మూలికలతో అనేక రకాల వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందిస్తున్న ఆయుర్వేద వైద్య విధానాన్ని పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆయుర్వేద వైద్యుడు కమ్మరి శ్రీనివాసచారి అన్నారు. ‘ఆయుష్షును కాపాడేదే ఆయుర్వేదం’ అని ఆయన పేర్కొన్నారు.తెలంగాణలోని భద్రాచలంలో మూడు రోజులపాటు నిర్వహించిన పారంపర్య వైద్య మహాసంఘం తృతీయ సమ్మేళన సమావేశాలకు దేశంలోని తొమ్మిది రాష్ట్రాలకు చెందిన అనువంశిక ఆయుర్వేద వైద్యులు హాజరయ్యారు. ఈ సమ్మేళనంలో దౌల్తాబాద్‌కు చెందిన కమ్మరి శ్రీనివాసచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడంలో ఆయుర్వేద వైద్య విధానం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.
ప్రకృతి నుంచి లభించే వివిధ రకాల ఔషధ మొక్కలు, మూలికల ఆధారంగా ఆయుర్వేద వైద్యులు ఎన్నో వ్యాధులకు చికిత్స అందిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఆధునిక జీవన విధానం, రసాయనాల వినియోగం కారణంగా ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు.
ప్రజలకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయంలో రసాయనిక క్రిమిసంహారక మందుల వినియోగాన్ని తగ్గించి, జీవ సంబంధ ప్రకృతి ఎరువులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రకృతి ఆధారిత వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా పంటలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చన్నారు. తద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేద వైద్య విధానంపై ఆసక్తి పెరుగుతోందని శ్రీనివాసచారి పేర్కొన్నారు. భారతదేశానికి చెందిన ప్రాచీన వైద్య విజ్ఞానాన్ని శాస్త్రీయ పద్ధతులతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.సమ్మేళనంలో పాల్గొన్న కమ్మరి శ్రీనివాసచారిని పారంపర్య వైద్య మహాసంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాసంఘం అధ్యక్షుడు దొంత యాత్రి మహర్షి, చంద్రశేఖర రాజు, మల్లిశాల స్వామీజీ, శివ స్వామి, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు రవివర్మ, జమాల్‌ఖాన్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్,11:**

హైదరాబాద్ ప్రెస్ క్లబ్, హెచ్.ఎం.డి.ఏ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాలను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం నాడు పంపిణీ ప్రారంభించారు. ప్రెస్ క్లబ్ సభ్యులతోపాటు సాధారణ పౌరులకు మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి ,రమేష్ వరికుప్పల, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అమిత్ బట్టు, ముత్యాల సత్తిబాబు , ఎన్. ఉమా దేవి, మనం నాగరాజు, హెచ్.ఎం.డి.ఏ ఎస్. ఈ అప్పారావు, డిప్యూటీ ఈ ఈ గణేష్, అసిస్టెంట్ ఈ ఈ ఆశుతోష్ వర్మలు గణేష్ మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఏటా మట్టి గణేష్ విగ్రహాలను ప్రెస్ క్లబ్ పాలకమండలి హెచ్.ఎం.డి.ఏ నేతృత్వంలో పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్ విగ్రహాలను పూజించాలని ప్రెస్ క్లబ్ పాలకమండలి విజ్ఞప్తి చేసింది.

## ఉమామహేశ్వర ఆలయ నిత్యాన్నదానానికి లక్ష విరాళం

**అచ్చంపేట, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**



శ్రీశైలం ఉత్తర ద్వారమైన రంగాపురం శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం అందింది.
శుక్రవారం నంద్యాల జిల్లాకు చెందిన యాసం వెంకటేశ్వర్ రెడ్డి దంపతులు ధర్మపత్ని వెంకట లక్ష్మమ్మతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానంలో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, నిత్యాన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తమ వంతుగా దేవస్థానం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపి, నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,000 విరాళంగా అందజేశారు.విరాళం అందించిన వెంకటేశ్వర్ రెడ్డి దంపతులకు ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు. వారికి, వారి కుటుంబానికి శ్రీ ఉమామహేశ్వర స్వామి అనుగ్రహం ఉండాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేసేలా భగవంతుడు శక్తిని ప్రసాదించాలని ప్రధాన అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

## పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుంది

- **జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో):**



పదోన్నతి అనేది కేవలం ఉద్యోగంలో ఉన్నత స్థానానికి ఎదగడమే కాకుండా బాధ్యతలను మరింత పెంచుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ అన్నారు.నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎండి. ఖలీల్ ఇటీవల ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తన చేతుల మీదుగా ఎండి. ఖలీల్ కు ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్స్ అలంకరించి అభినందనలు తెలిపి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి పొందిన ప్రతి పోలీస్ సిబ్బంది నిజాయితీ, క్రమశిక్షణతో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం వంటి విలువలను పాటిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఏఓ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైశ్య సంఘం నూతన కార్య వర్గం ఆధ్వర్యంలో ఎంపీ గడ్డం వంశీకి సన్మానం

**ధర్మపురి,సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి క్షేత్రానికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోవడానికి విచ్చేసిన పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణను నూతనంగా ఎన్నికైన వైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు సాయిని. శ్రీనివాస్, పిన్న, శ్రీనివాస్ లు,పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువతో ఘనంగా సన్మానించారు. ఎంపీ గడ్డం వంశీ నూతన అధ్యక్షులను పాలక వర్గంను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ సమాజంలో వైశ్య సంఘం వారు అన్ని రంగాలలోనూ ముందుండటంతో పాటు, పలు సేవా కార్యక్రమాలలో నిరంతరం భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. సంఘ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నర్సారెడ్డిని పరామర్శించిన దోర అరుణ్



**మేడ్చల్, సెప్టెంబర్ 11,(వుదయం ప్రతినిధి ),**

మాజీ ఎమ్మెల్యే, గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు దోర అరుణ్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రెహ్మాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ సమీర్ అహ్మద్ తో కలిసి నర్సారెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దోర అరుణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హింసకు, బెదిరింపులకు ఎలాంటి స్థానం లేదన్నారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను అసెంబ్లీలో బలంగా వినిపించే ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజాప్రతినిధి అవసరమని అన్నారు. కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల గొంతుకగా నిలబడాలని లేదా రాజీనామా చేసి ప్రజలకు అందుబాటులో ఉండే మరో నాయకుడికి అవకాశం ఇవ్వాలని దోర అరుణ్ అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, ప్రతి నాయకుడి పనితీరును ప్రజలు ప్రశ్నిస్తారని, లెక్కలు అడిగి ప్రజాస్వామ్య పద్ధతిలో తీర్పు ఇస్తారని పేర్కొన్నారు.

## ఘనంగా సర్పంచ్ ముక్తాల రమేశ్ జన్మదిన వేడుకలు



**వెల్దండ సెప్టెంబర్ 11 (వు దయం )**

మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామ సర్పంచ్ ముక్తాల రమేశ్ జన్మదిన వేడుకలు శుక్రవారం వెల్లండ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటయ్య గౌడ్, యాదమ్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా రమేష్ చేత కేక్ కట్ చేయించి శాలువాలు కప్పి ముక్తాల రమేశ్ కి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్తులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల కృష్ణ, ఉప సర్పంచ్ ప్రసాద్, కొయ్యల పుల్లయ్య, మట్ట విష్ణుగౌడ్, రమేశ్ గౌడ్, శివరాజ్ గౌడ్, గణేష్ గౌడ్, భరత్ గౌడ్, మల్లేశ్ , లింగం యాదవ్, సర్వేయ, రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్టర్



**సిద్దిపేట, సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో)**

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అనుసరిస్తూ సిద్దిపేట కలెక్టరేట్ సమీపంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిబంధనల ప్రకారం గోదాంను తెరిచారు. అనంతరం సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను భద్రపరిచిన విభాగాల ద్వారాలను, వాటికి వేసిన సీళ్లను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈవీఎం గోదాం వద్ద ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా అత్యున్నత స్థాయి భద్రతా చర్యలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. గోదాం లోపల, బయట మరియు చుట్టుపక్కల పరిసరాలన్నింటినీ నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ రికార్డు చేస్తున్నామని విలేకరులకు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. అనంతరం విజిటర్స్ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేసి, అందరి సమక్షంలో గోదాం ప్రధాన ద్వారానికి తాళం వేయించి సీల్ వేశారు. ఈ తనిఖీ ప్రక్రియ అంతటినీ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో వీడియోగ్రఫీ తీయించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ కిరణ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్యనారాయణ రెడ్డి

**సిద్దిపేట, సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట జిల్లా పరిధిలో గణిత శాస్త్ర విభాగం నుండి వంటేరు సత్యనారాయణ రెడ్డి 'జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు'గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన జిల్లా మ్యాథ్స్ ఫోరం అధ్యక్షుడిగా, పీఆర్‌టీయూ గజ్వేల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ, విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచేలా సులభతర బోధనా పద్ధతులతో విద్యారంగానికి విశేష సేవలు అందిస్తున్నారు. విద్యారంగంలో ఆయన కనబరిచిన ప్రతిభకు, సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడంతో పీఆర్‌టీయూ గజ్వేల్ మండల శాఖ ప్రతినిధులు, తోటి ఉపాధ్యాయులు, అభిమానులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల అవసరాలకే నిధుల కేటాయింపు

**పటాన్చెరు సెప్టెంబర్ 11, వుదయం.**



పటాన్చెరు, జేపీ కాలనీ డివిజన్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో రూ.19 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న వర్షపు నీటి పారుదల కాలువల నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో కాలనీల్లో నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల డ్రైనేజీ, వర్షపు నీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శాంతినగర్ కాలనీ ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.19 లక్షల నిధులతో ఈ పనులను చేపడుతున్నట్లు చెప్పారు.పటాన్చెరు, జేపీ కాలనీ డివిజన్లలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను దశలవారీగా మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, కాలనీ అధ్యక్షులు అంజిరెడ్డి, ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, ఏఈ లావణ్య, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకై జీవో సవరణ

- 85% రాష్ట్ర కోటా వైద్య సీట్లు నిజమైన తెలంగాణ స్థానికులకే దక్కాలి -నీట్ తల్లిదండ్రుల సంఘం డిమాండ్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 11(వుదయం)**



తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో 85 శాతం రాష్ట్ర కోటా సీట్లు నిజమైన తెలంగాణ స్థానిక విద్యార్థులకే దక్కేలా జీవో ఎంఎస్ నం.150ను సవరించాలని నీట్ తల్లిదండ్రుల సంఘం తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.2024 జూలై 19న జారీ చేసిన జీవో 33, అనంతరం సుప్రీంకోర్టు 2025 సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పు నేపథ్యంలో వైద్య ప్రవేశ నిబంధనలను సవరిస్తూ 2025 సెప్టెంబర్ 8న జీవో 150ను ప్రభుత్వం తీసుకొచ్చిందని సంఘం తెలిపింది. అయితే స్థానికతను నిర్ణయించడంలో విద్యార్థి చదువుతో పాటు తల్లిదండ్రుల డోమిసైల్, శాశ్వత నివాసం, కుటుంబ నివాస చరిత్ర, 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాభ్యాసం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కోరింది.కేఎన్ఆర్‌యూహెచ్ఎస్ 202627 ప్రవేశ జాబితాలను ఇతర రాష్ట్రాల నీట్ జాబితాలతో పోల్చగా, ఒకే నీట్ ఆల్ ఇండియా ర్యాంక్‌తో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల జాబితాల్లో కనిపించిన 30 మంది అభ్యర్థులను గుర్తించినట్లు సంఘం వెల్లడించింది. ఇందులో కర్ణాటక 15, ఛత్తీస్‌గఢ్ 7, ఆంధ్రప్రదేశ్ 7, రాజస్థాన్‌లో ఒకరు ఉన్నట్లు పేర్కొంది. అయితే రెండు రాష్ట్రాల జాబితాల్లో పేరు కనిపించడం మాత్రమే స్థానికతపై తుది నిర్ధారణ కాదని స్పష్టం చేసిన సంఘం.. ప్రతి అభ్యర్థి స్థానికత, డోమిసైల్, విద్యా ధ్రువపత్రాలను ప్రభుత్వం అధికారికంగా పరిశీలించి పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేసింది.

తెలంగాణ విద్యార్థుల సీట్లకు అన్యాయం జరగకుండా రాష్ట్ర కోటా అర్హతలను కఠినతరం చేసి, నిజమైన స్థానికులకు వైద్య సీట్లు దక్కేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సంఘం కోరింది. కార్యక్రమంలో విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు

## తాతా మధుపై బీఆర్ఎస్ రివర్స్!

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై వ్యాఖ్యలతో మారిన అసెంబ్లీ రాజకీయ సీన్

**వికారాబాద్ సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో)**



అసెంబ్లీ సమావేశాలను వేదికగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ రూపొందించుకున్న వ్యూహానికి ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలు అనూహ్య మలుపు తిప్పాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలను ప్రధాన అజెండాగా చేసుకోవాల్సిన సమయంలో స్పీకర్‌ను ఉద్దేశించిన వ్యాఖ్యల వివాదం తెరపైకి రావడంతో రాజకీయ చర్చ మొత్తం మరో దిశకు మళ్లిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గులాబీ వ్యూహానికి గండి.. కాంగ్రెస్‌కు కొత్త అస్త్రంబీఆర్ఎస్ చేపట్టిన నిరసనలు, నల్ల దుస్తుల కార్యక్రమాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని భావించిన సమయంలో తాతా మధు వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు ఎదురుదాడి చేసే అవకాశం ఇచ్చాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. స్పీకర్ గౌరవం, సభా సంప్రదాయాలు, వ్యాఖ్యలపై వివరణ వంటి అంశాలను కాంగ్రెస్ ముందుకు తెచ్చడంతో బీఆర్ఎస్ అసలు రాజకీయ అజెండా కొంత మేరకు పక్కకు వెళ్లిందనే చర్చ జరుగుతోంది.ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాల్సింది పోయి.. వివరణలకే పరిమితమా?ప్రభుత్వాన్ని ప్రశ్నించేం కీయంగా ఇబ్బందికర పరిణామంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతు

రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.ఇక ముందున్న అసలు పరీక్షతాతా మధు వ్యాఖ్యల వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? కాంగ్రెస్ ఈ అంశాన్ని ఎంతమేరకు రాజకీయంగా ఉపయోగించుకుంటుంది? అసెంబ్లీలో చర్చ ఏ దిశలో సాగుతుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.మొత్తానికి.. ప్లాన్ ఒకటి.. సీన్ మరోటి!కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్న గులాబీ వ్యూహం.. తాతా మధు వ్యాఖ్యల వివాదంతో దారి మళ్లిందా? ప్రభుత్వంపై దాడి చేయాల్సిన సమయంలో సొంత పార్టీ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సి రావడం బీఆర్ఎస్‌కు రాజకీయంగా నష్టమేనా? అన్నదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 11(వుదయం ప్రతినిధి)**



వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి. డి.జానకి అధికారులకు ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండును, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను శుక్రవారం కలెక్టర్, ఎస్.పి సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా క్రిస్టియన్ పల్లి పంచవటి పాఠశాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ చెరువు, శ్రీనివాస్ కాలనీ చెరువు, అప్పన్నపల్లి చెరువు, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించి, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అప్పనపల్లి చెరువు వద్ద ఎక్కువ వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడ రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో బేబీ పాండ్లను ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నీరు ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు.నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుధ్య సౌకర్యాలు, తాగునీరు, ప్రవేశం-నిష్క్రమణ మార్గాలు తదితర మౌలిక క్టర్ సూచించారు. ప్రజలు తమ సమీపంలోని నిర్దేశిత నిమజ్జన కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై గద్వాల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కలెక్టర్ వెల్లడించారు.నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్.పి.లు సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు.నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లే మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, దాని ప్రక్కనే ఉన్న శిల్పారామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనులు, వాటి పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు యాది రెడ్డి, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించం

**మేడ్చల్ సెప్టెంబర్ 11(వుదయం)**



రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల, చిన్నారుల, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేవ శ్రద్ధ వహిస్తూ వారికి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, అందులో ఏలాంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని తెలంగాణ రాష్ట్ర పుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర పుడ్ సేఫ్టీ కమీషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతి లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో శుక్రవారం పర్యటించారు. మేడ్చల్ తహాసీల్దారు కార్యాలయంలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి ఛైర్మన్ కు, సభ్యులకు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా మేడ్చల్ లోని చౌక ధరల ధుకాణాలను పరిశీలించి డీలర్ తో స్టాక్ వివరాలు,రిజిష్టర్ల నమాదులు పరిశీలించారు. చౌకధరల దుకాణం వద్ద ఫిర్యాదుల బాక్సులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఫిర్యాదులు ఇచ్చేందుకు గాను జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల తహాసీల్దార్ల ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని ఛైర్మన్ సూచించారు. సన్న బియ్యం అందుతున్నాయా అని, మీకు సౌకర్యవంతంగా డీలర్లు బియ్యం అందిస్తున్నారా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ని సందర్శించి డైనింగ్ హాల్, స్టోర్ రూం పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ సరుకులను వాడాలని, నాణ్యమైన సన్నబియ్యం మాత్రమే వండాలని, బియ్యం నాణ్యత లేకుంటే వెంటనే అధికారులకు తెలియజేసి మార్చుకోవాలని తెలిపారు. స్కూలులో ఉడికించిన గుడ్లను పరిశీలించి వాటి రంగు మారిందని, తెల్లగా ఉండాల్సిన గుడ్ల రంగు మారడానికి కారణాలు ఎమిటని అడిగారు. గుండ్లను సేకరించి ఎందుకు రంగు మారాయని ఫుడ్ స్టేఫ్టీ అధికారి టెస్ట్ చేయించి నివేదిక అందించాలని ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ చెకప్ రిజిష్టర్లను పరిశీలించిరక్తహీనత ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. పేరెంట్స్ కమిటీ మీటింగులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకొని సంబంధిత రిజిష్టర్లను పరిశీలించారు. పదవ తరగతి విద్యారుల తో ముచ్చటిస్తూ స్కూల్ లో ఏమైనా సమస్యలున్నాయా అని, మెను ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మంచినీరు టాయిలెట్లు మౌళిక వసతులు సరిగా ఉన్నాయా అని అడిగి, ఏవైనా సమస్యలుంటే ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని ఛైర్మన్ విద్యార్థులకు సూచించారు. నిర్భయంగా నిజాన్ని చెప్పే ధైర్యం ఉండాలని, అప్పుడే సమస్యలను ధైర్యంగా ఎదురుకుంటారని, తద్వారా భవిష్యత్తులో సమాజం పట్ల బాధ్యతగా ఉండగలరని విద్యార్థులకు భోధించారు. దమ్మాయిగూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు అధిక సంఖ్యలో లంచ్ బాక్సులు తెచ్చుకోవడం గమనించిన కమీషన్ సభ్యులు, ఎందుకు ఇంటి నుండి బాక్స్ తెచ్చుకుంటున్నారని అడుగగా, విద్యార్థులు భోజనం సరిగా ఉండడం లేదని కమీషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి లోపాలను ఉపేక్షించబోమని విచారించి సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. దించాలని, తాము మళ్లీ వచ్చి పరిశీలస్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం దమ్మాయిగూడలోని అంబేద్కర్ నగర్ లోని, జవహార్ నగర్ మల్కాపురంలోని అంగన్ వాడీ కేంద్రాలను ఛైర్మన్ సభ్యులు సందర్శించారు.

## ఖరీఫ్ ధాన్యం సేకరణపై సమీక్ష



**రంగారెడ్డి జిల్లా**

ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి - అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి

రాబోయే ఖరీఫ్ 202627 ధాన్యం సేకరణ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 1వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, ఇతర సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర (MSP), ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం గుర్తించిన సన్నరకం ధాన్యం వివరాలను పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేసి, సంబంధిత కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఎటువంటి జాప్యం లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. DRDO, సహకార శాఖలు సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కేంద్ర కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన 16 మౌలిక సదుపాయాల ప్రమాణాలు తప్పనిసరిగా అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంచార్జీ డిఎం సివిల్ సప్లయ్ స్వప్న, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి మహమ్మద్ రియజుద్దీన్, డి.సి.సి.ఓ సుధాకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE, X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT HYDERABAD DISTRICT. AT: HYDERABAD. O.S. No. 2731 Of 2026**

**Between:**
Smt. Vempala Sri Lakshmi & others ... **Plaintiffs**
The Tahsildar & others ... **Defendants**
To
All Concerns ... **Defendants**

Please take notice that the plaintiff 1) Smt. Vempala Sri Lakshmi & others have instituted the above suit for To Declare the Legal Hairs as Mr. Late M. Jagan Mohan Rao and Late M. Anjana Devi. and the same is posted to 06.10.2026 at 10.30 A.M. if anybody not appeared and filed any objection before the Hon'ble Court on 06.10.2026 at 10.30 A.M. the matter will decided on merits.

***(BY ORDER OF THE HON'BLE COURT)***

**Sd/- THOTLA SWAMI Advocate #H. No. 6-84/167/W, Pragathinagar Colony, Dammaiguda, Keesara Mandal, M. M. District – 500083**

**IN THE COURT OF Ist JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT SECUNDERABAD: O. S. No: 405 OF 2025.**

**Between:**
1). KALVA SREENIVAS, S/o. Late. Kalva Damodar Rao, Age: 55 years, Occ: Business, R/o. Flat No.202, Anand Vatika, Dayanand Nagar, Malakpet, Hyderabad. **...PLAINTIFFS**
2). Smt. KALVA RUTHIKA, @ T. RUTHIKA W/o. T. KARTHIK, Age: 39 years, Occ: Landlady, R/o. H. No. 1-8-14/B, P.G. Road, Secunderabad. **.. DEFENDFANT**
Sri. RAVI THEJA CHAKRAVARTHY KOTA, S/o. Sri. SRINIVAS KOTA, Age: 49 years, Business at Flat/Room No. 18, 2nd floor, D. No. 1-1-58/1 to 1-1-56/11,Srinath Commercial Complex, S.D. Road, Secunderabad - 500 003 R/o. Flat No.205, SANALI HEAVENS, Municipal D. No. 8-3-949/1/1/A, Nagarjuna Nagar, Near Kamma Sangam, KHAIRTABAD, Hyderabad -500 073.
To,
Sri. RAVI THEJA CHAKRAVARTHY KOTA, S/o. Sri. SRINIVAS KOTA, Business at Flat/ Room No. 18, 2nd floor, D. No. 1-1-58/1 to 1-1-56/11, Srinath Commercial Complex, S.D. Road, Secunderabad - 500 003
R/o. Flat No.205, SANALI HEAVENS, Municipal D. No. 8-3-949/1/1/A, Nagarjuna Nagar, Near Kamma Sangam, KHAIRTABAD, Hyderabad -500 073.
Take notice that the Plaintiffs herein got filed the above SUIT O.S. No. 405 of 2025, against you i.e. Defendant on the file of Hon'ble Ist Junior Civil Judge, City Civil Court, At Secunderabad for Eviction from the Plaint Schedule Property and for Recovery of Arrears of Rents and mesne profits together with costs of the suit. The said suit stands posted to 12-10-2026, for your appearance. If you fail to appear either in Persons or through Advocate before this Hon'ble Court, on the said date of hearing i.e. 12-10-2026, at 10.30 A.M., the matter will be heard in your absence & exparte orders will be passed against you. Court.

**(BY ORDER OF THE COURT)**

**Sd/- M. SHIVA SHEKAR, B.Com.L.L.B ADVOCATE H. No. 11-3-664/191, Parsigutta. SECUNDERABAD-500 061. Ph. No. 9246521602**

**IN THE COURT OF THE HONOURABLE XI JUNIOR CIVIL JUDGE O.S.NO. 594 OF 2026**

**Between:**
1.Kunumalla Srinivas Son of late Sri Kunumalla Narasaiah, Aged about 61 years, Ooccu: Retired Employee, Resident of Flat No. 208, Maruthi Apartments -1 Maruthi Nagar, Bowenpally, Secunderabad - 500011 Telangana State
2. Kunumalla Geet Saurabh Son of Sri Kunumalla Srinivas, Aged about 26 years, Occu: Student in University United States of America vide Passport No. S9702505, Permanent R/o Flat No. 208, Maruthi Apartments -1 Maruthi Nagar, Bowenpally, Secunderabad - 500011 Telangana State India Presently staying at No. 9543, University Terrace Drive Unit,
K, Charlotte North Carolina 28262, United States of America, Represented by his father and General Power of Attorney Kunumalla Srinivas Son of late Sri Kunumalla Narasaiah, Aged about 61 years, Ooccu: Retired Employee, Resident of Flat No. 208, Maruthi Apartments -1 Maruthi Nagar, Bowenpally, Secunderabad - 500011 Telangana State
3. Kunumalla Gautam Siddharth Son of Sri Kunumalla Srinivas,
Aged about 21 years, Occu: Student R/o Flat No. 208, Maruthi Apartments -1, Maruthi Nagar, Bowenpally, Secunderabad - 500011 Telangana State India **...PLAINTIFFS**

**AND**

1.The Tahsildar,
Trimulghery Mandal, Office situated at Manovikasnagar Hashmathpet, Bowenpally, Secunderabad.
2.All Concerned **.. DEFENDFANT**
To:
All Concerned **...2nd Defendant**

Please take notice that the Plaintiffs abovenamed filed the above suit for Declaration, Declaring the Plaintiff's 1 to 3 as the legal heirs ofthe deceased Smt. Kunumalla Pratibha wife of Sri Kunumalla Srinivas, who died intestate on 15.04.2026. The said suit stands posted to 28.09.2026. If any person/s is/are claiming to be the legal heirs of the said deceased Smt. Kunumalla Pratibha wife of Sri Kunumalla Srinivas, or, having any objection in granting the said relief, may appear before the above said court at 10.30 a.m., either in person or through your Advocate and submit your contentions with documentary evidence. Failing which, the matter will be heard and decided exparte.

**(BY ORDER OF THE COURT)**

**Sd/- M/s S.G.Poorna Chander Rao Rama Rao, K. Gopi Basant M.Rajeswar Rao, B.Uma & M.Soujanya Advocates Off: 1st Floor of P.No. 3-2-4, R.P.Road, Adj.to Krishna Coffee Works,Kings Way, Secunderabad- 500003 TG Ph. No. 9246521602 Counsels for Plaintiffs**




వసుధైక కుటుంబ భావనే మా విధానం

వసుధైక కుటుంబం అన్న భావనే అంతరిక్ష రంగంలో భారత్ అనుసరిస్తున్న విధానానికి స్ఫూర్తి. ఒకే భూమి.. ఒకే కుటుంబం.. ఒకే భవితవ్యం అన్నది మా నినాదం. ఈ ఆదర్శం భూమండలం నుంచి ఖగోళం వరకూ వ్యాప్తి చెందాలి. దేశ అంతరిక్ష యానాన్ని బలోపేతం చేయడంలో ఇస్రో సేవలు కీలకం.

- నరేంద్ర మోడీ, భారత ప్రధాని

## వే'మన' పద్యం

కులము గలుగువాఁడు గోత్రంబు గలవాఁడు
విద్యచేత విఱ్ఱవీగువాఁడు
పసిడి గలుగువాని బానిస కొడుకులు
విశ్వదాభిరామ! వినుర వేమ!



# సంపాదకీయం

## కార్పొరేట్.. కమలం బంధం...

కార్పొరేట్లకు, కమలనాథులకు ఏర్పడ్డ బలమైన బంధానికి బిజెపి ఖాతాల్లోకి పారుతున్న విరాళాల వెల్లువ ఒక తిరుగులేని సాక్ష్యం. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలానికి సంబంధించి బిజెపి కేంద్ర కార్యాలయానికి రూ.1,472.8 కోట్ల మేర నిధులు వచ్చినట్టు తాజాగా వెల్లడైన లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్‌కు అందిన విరాళాలు రూ.207.17 కోట్లు. అస్సాంలో రూ.96.3 కోట్లు, తమిళనాడులో రూ.51.6 కోట్లు, పుదుచ్చేరిలో రూ.11.9 కోట్లు ఖర్చు చేసినట్టు బిజెపి అధికారికంగా చెబుతోంది. లెక్కలకెక్కని, లెక్కలు చెప్పని ధన ప్రవాహం ఎంతుంటుందో అంచనా వేయొచ్చు. రాజకీయాల్లో డబ్బు ఎవరి చేతిలో ఎంతగా కేంద్రీకృతమవుతుందో, ఎన్నికల పోరులో ఆర్థిక శక్తి ఎంతటి అసమానతను సృష్టిస్తుందో ఇది స్పష్టం చేస్తోంది.

కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేసే బిజెపి... వారి నుంచి తిరిగి పొందుతున్న ప్రతిఫలానికి ఈ విరాళాల లెక్క ఒక కొండ గుర్తు. 202425లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అన్ని రాజకీయ పార్టీలకు రూ.3,826.35 కోట్లు చేరితే అందులో రూ.3,157.65 కోట్లు, అంటే 82.52 శాతం బిజెపికే వెళ్లాయి. కాంగ్రెస్‌కు రూ.298.78 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.102 కోట్లు రాగా, మిగిలిన 19 పార్టీలు కలిపి రూ.267.92 కోట్లు జమయ్యాయి. ఈ నిధుల్లో 228 కార్పొరేట్, వ్యాపార సంస్థలు రూ.3,636.82 కోట్లు అందించాయి. పాలకవర్గ పార్టీల నిధుల వ్యవస్థలో కార్పొరేట్ ధనం ఎంతటి పాత్ర పోషిస్తోందో ఈ లెక్క చెబుతోంది. అదే విధంగా కార్పొరేట్ల ప్రయోజనాలకు ఆయా పార్టీలు ఎంతగా అంకితమవుతాయో, ప్రభావితమవుతాయో కూడా ఈ విరాళాలే వెల్లడిస్తాయి.

సిపిఎం దాఖలు చేసిన కేసులో 2024లో సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసినప్పుడు.. వాటికి ఇంతవరకూ కేంద్రం నుండి తగిన సమాధానమూ లేదు, సవరించుకున్న వైనమూ లేదు. బాండ్ల మార్గం రద్దయినా పెద్ద మొత్తాల నిధుల ప్రవాహం ఆగలేదు. అధికారాన్ని దక్కించుకోవడానికి ఉన్మాద భావజాలాన్ని రెచ్చగొట్టే బిజెపికి ఇలా అపరిమితంగా వచ్చిపడే కార్పొరేట్ విరాళాలతో అది ఎన్నికల తీరును దారుణంగా మార్చేసింది! కోట్లు కురిపించి పోల్ మేనేజ్‌మెంటు చేయడం దగ్గర నుంచి గెలుపొందిన ప్రత్యర్థులను తమవైపు తిప్పుకోవటం వరకూ అధికార వ్యవస్థలను, ఆర్థిక బలాన్ని ఇష్టానుసారం వినియోగిస్తూ ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం! దేశ ప్రయోజనాలకు తీవ్ర నష్టం. కాగా, గుజరాత్‌లో వెలుగులోకి వచ్చిన గుర్తింపు లేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల వ్యవహారం ఎన్నికల నిధుల వ్యవస్థలోని మరో చీకటి కోణాన్ని ముందుకు తెచ్చింది. కాగితాలకే పరిమితమైన ఆరు అనామక పార్టీలు 202324లో సుమారు రూ.1,700 కోట్ల విరాళాలు పొందటం ఆశ్చర్యకరం. ఆ పార్టీలన్నీ కలిపి 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సంఖ్య కేవలం 15. మరి ఈ అనామక పార్టీలకు ఇన్ని నిధులు ఎలా సమకూరాయి? దాని వెనుక ఉన్న ప్రయోజనాలేమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. .

పరిమిత వనరులతో పోటీ చేసే వామపక్ష పార్టీలకు ఒకవైపు నిధుల కొరత, మరోవైపు భారీ మొత్తాలు వెచ్చించగల పార్టీలకు అపారమైన ఆర్థిక శక్తి ఉండటం సమాన రాజకీయ పోటీకి విరుద్ధం. ఎన్నికలంటే ప్రజలతో చర్చ, విధానాలపై వాదన, ప్రత్యామ్నాయాల ప్రతిపాదన కావాలి. కానీ డబ్బు, మీడియా, ప్రచార యంత్రాంగం, భారీ సభలు, డిజిటల్ ప్రచారం అన్నీ ఒకే రాజకీయ శక్తి చేతుల్లో కేంద్రీకృతమైతే ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోతుంది. అందుకే ఎన్నికల సంస్కరణలు తేవాల్సిన అవసరం చాలా ఉంది. కార్పొరేట్ విరాళాలు, పెద్ద మొత్తాల నిధులపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటకు రావాలంటే ఎన్నికలకు ప్రజా నిధుల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎన్నికల సంఘమే దీనికి కేంద్ర సంస్థగా ఉండాలి. ప్రచార సామగ్రి, సమావేశాలకు ప్రభుత్వ స్థలాలు, ముద్రణ, ప్రయాణం వంటి అవసరాలను అది సమకూర్చాలి. అదే సమయంలో కార్పొరేట్ విరాళాలకు కఠిన పరిమితులు, ప్రతి విరాళానికి పూర్తి పారదర్శకత, పార్టీల ఆదాయ-వ్యయాల తక్షణ బహిరంగ ప్రకటన, ఎన్నికల సమయంలో పార్టీలు చేసే ఖర్చుపై పరిమితి, ఉల్లంఘనలకు కఠిన చర్యలు ఉండాలి. ఎన్నికల్లో ఎవరి వద్ద ఎంత డబ్బుంది అన్నది కాదు, ప్రజలకు ఎవరి విధానం నచ్చింది అన్నదే నిర్ణయాత్మకం కావాలి. భారీగా విరాళాలు ఇచ్చే కార్పొరేట్ సంస్థలు ఆయా పార్టీల ప్రభుత్వాల నుంచి దొడ్డిదోవల్లో ప్రయోజనాలు పొందటాన్ని నివారించాలి. ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర వ్యవస్థలు అధికార పార్టీ చేతిలో ఆటబొమ్మలుగా మారిపోయిన వర్తమానంలో ఇలాంటి సంస్కరణలను ఆశించలేం కానీ, భవిష్యత్తులోనైనా ఎన్నికలు న్యాయబద్ధంగా జరగాలంటే మార్పులు కచ్చితంగా అవసరం. అందుకు పౌరులు, మేధావులు నిరంతర కృషి ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావాలి. ప్రజల ఓటును డబ్బు నుంచి, ప్రలోభాల నుంచి, ప్రచార మాయాజాలం నుంచి విముక్తం చేయడం ఇప్పుడు అత్యవసరమైన కర్తవ్యం.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# రైతుల్లో రైతు సారంపల్లి

రైతు సంక్షేమమే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన సారంపల్లి మల్లారెడ్డికి ఆగస్టు 24 న కన్నుమూశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాగు వ్యతిరేక నిర్ణయాలను, ఒప్పందాలను తీవ్ర స్థాయిలో ఎండగడుతూ, ఉద్యమాల్లో ముందు నిలిచిన బడుగు రైతు నాయకుడిని ప్రజలు కోల్పోయారు. సాదాసీదాగా, అప్పుడే సాగు పని ముగించుకొని బయటికొచ్చిన రైతులా కనబడే మల్లారెడ్డి వ్యవసాయ మేధోసంపన్నుడు. దేశీయ, అంతర్జాతీయ వ్యవసాయ పోకడలు, మార్పులపై సాధికారిత గల మట్టి మనిషి. 87 ఏళ్ల వయసులో కూడా రైతాంగ ఉద్యమాల్లో పాల్గొంటూ, సదస్సుల్లో ప్రసంగిస్తూ, పత్రికలకు రచనలు చేస్తూ తీరికలేని జీవితం గడుపుతున్న మల్లారెడ్డిని ఊహించని రీతిలో గుండెపోటు కబళించింది. ఈ నెల 17 న ఆయన రాష్ట్ర రైతు సంఘం సమావేశానికి హాజరయ్యారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు గాంధీ హాస్పిటల్ కు అందజేశారు.

వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని తిమ్మంపేట లో మల్లారెడ్డి 1939 లో జన్మించారు. చిన్న వయసులోనే కమ్యూనిజం వైపు ఆకర్షితులైనారు. 1964 నుండి కొంతకాలం సొంతూరులో పోలీస్ పటేల్ గా పనిచేశారు. 1973 లో కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో డివిజనల్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించి చివరి వరకు ఆ పార్టీ రైతు నేతగా కొనసాగారు. తమ గ్రామంలో సర్పంచిగా, సహకార సొసైటీ చైర్మన్ గా పనిచేసి గ్రామానికి ఎన్నో సదుపాయాలను కల్పించారు. వరంగల్ జిల్లా రైతు సంఘం కార్యదర్శిగా, రాష్ట్ర స్థాయిలో అధ్యక్షుడిగా కొనసాగి, ప్రస్తుతం మల్లారెడ్డి అఖిల భారత కిసాన్ సభకు ఉపాధ్యక్ష హోదాలో ఉన్నారు.

మార్క్సిస్టు పార్టీ అనుయాయుడిగానే కాకుండా



అభ్యుదయ రైతాంగ నాయకుడిగా, మేధావిగా సారంపల్లి చేసిన కృషి, సేవలు అద్వితీయం. వ్యవసాయ రంగంలో ఆయనకు తెలియని విషయమే లేదని చెప్పవచ్చు. సుమారు ఆరు దశాబ్దాలు వ్యవసాయ క్షేత్రంలో ఉద్యమకారుడిగా ఉన్న మల్లారెడ్డి నిశిత దృష్టితో ప్రతి నిర్ణయాన్ని, ఒప్పందాన్ని అంచనావేసేవారు. ప్రతి అంశంపై లోతైన అవగాహనయే ఆయనకు అస్త్రశస్త్రాలు. ఎం ఎస్ స్వామినాథన్, పాలగుమ్మి సాయినాథ్ తదితర వ్యవసాయ ప్రజ్ఞుల సరసన ఉండే అర్హత ఉన్న సామాన్యుడు సారంపల్లి. శాస్త్రవేత్తల కన్నా రైతాంగ సమస్యలపై అట్టడుగు వాస్తవాల పరిశీలన విషయంలో వీరు ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తారు.

వ్యవసాయ రంగంలో ప్రభుత్వాలు బహుళజాతి సంస్థలతో చేసుకొనే ఒప్పందాలను మల్లారెడ్డి సూక్ష్మంగా పరిశీలించేవారు. వాటిలోని లొసుగులను, దేశీయ రైతుకు జరిగే నష్టాన్ని గొంతెత్తి వినిపించేవారు. వాటిని వ్యతిరేకిస్తూ సదస్సులు నిర్వహిస్తూ పత్రికలను వ్యాసాలు రాసేవారు. అమెరికా, బ్రిటన్, కెనడా లాంటి ఎన్ని దేశాలు నిషేధించిన బిటి పత్తి విత్తనాలను మనకెందుకని నిలదీశారు. అధిక ధరలకు వాటిని భారత రైతులకు అంటగట్టడాన్ని వ్యతిరేకించారు. వంట దినుసుల ఎగుమతి, దిగుమతుల్లో ప్రభుత్వాలు బహుళజాతి సంస్థలకు అనుకూలంగా ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆయన వివరణాత్మకంగా వ్యాసాలు రాశారు. అవసరం లేకున్నా దిగుమతి చేసుకోవడం, మిగులును ఎగుమతికి అనుమతినీయకపోవడం జరుగుతోంది. పప్పు దినుసులు, వంట నూనెల స్వయం సమృద్ధికి అవకాశం ఉన్నా ప్రభుత్వాలు రైతాంగాన్ని ప్రోత్సహించడం లేదని ఆయన వాదన.

కౌలు రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ, బ్యాంకు ఋణం, పంట నష్టపరిహారం, బీమా వర్తింపజేయాలని సదస్సులు నిర్వహించి తమ కిసాన్ సభ తరపున ప్రభుత్వాలకు విజ్ఞాపనలు అందజేశారు. రైతు ఆత్మహత్యలను సాధారణ చావులుగా చూస్తున్నారని ఆందోళనలను చేపట్టారు. విత్తనాలు, ఎరువులు, రుణాలు, మద్దతు ధర సవ్యంగా ఉంటే రైతులు, దేశం బాగుపడుతుందని ప్రభుత్వాలను కోరారు. భూమి, నీరు, మానవ వనరులున్న దేశంలో నిరుద్యోగం కేవలం ప్రభుత్వాల అసమర్థతే కారణమని వాదించేవారు. బహుళజాతి సంస్థల ఆధిపత్యంలో రైతాంగం బతకడం పాలకుల స్వార్థచింతనే అని తన రచనల్లో పేర్కొన్నారు. సాధారణ జీవనశైలి సారంపల్లి సొంతం. గత ముప్పై ఏళ్లుగా హైదరాబాద్ లో రెండు గదుల చిన్న ఇంట్లో నివాసం. ఎటు వెళ్లిన ఆటో లేదా బస్సులోనే ప్రయాణం. బుద్ధెరిగిన నుండి ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర ఆయనది. వందలాది వ్యాసాలు, 20 పుస్తకాలు రాసిన 'నడిచే వ్యవసాయ సర్వస్వం' సారంపల్లి. రైతాంగ, వ్యవసాయ సమస్యలపై విస్తార అధ్యయనంతో పాటు లోతైన అవగాహన, ఉద్యమ స్ఫూర్తి గల మరో మల్లన్న దొరికేదాకా వీరి స్థానం ఖాళీగానే ఉంటుంది.

> కౌలు రైతులకు ఇన్ ఫుట్ సబ్సిడీ, బ్యాంకు ఋణం, పంట నష్టపరిహారం, బీమా వర్తింపజేయాలని సదస్సులు నిర్వహించి తమ కిసాన్ సభ తరపున ప్రభుత్వాలకు విజ్ఞాపనలు అందజేశారు. రైతు ఆత్మహత్యలను సాధారణ చావులుగా చూస్తున్నారని ఆందోళనలను చేపట్టారు. విత్తనాలు, ఎరువులు, రుణాలు, మద్దతు ధర సవ్యంగా ఉంటే రైతులు, దేశం బాగుపడుతుందని ప్రభుత్వాలను కోరారు. భూమి, నీరు, మానవ వనరులున్న దేశంలో నిరుద్యోగం కేవలం ప్రభుత్వాల అసమర్థతే కారణమని వాదించేవారు. బహుళజాతి సంస్థల ఆధిపత్యంలో రైతాంగం బతకడం పాలకుల స్వార్థచింతనే అని తన రచనల్లో పేర్కొన్నారు.

బద్రి నర్సన్
9440128169w

## తొలి సంతకం

అన్యుల
అడుగుజాడల్లో
అస్తిత్వాన్ని
వెతుక్కోకు...
అంతరంగపు
నిశ్శబ్ద గర్భంలో
వినిపించే
ఆత్మసవ్వడిని
ఆలకించు.
లోకం వెలిగించిన
రాజమార్గాలు
గమ్యానికి
చేర్చకపోయినా...
ఏకాంతపు
చీకటిలోకి అడుగేసి
చూస్తే,
ఆత్మజ్యోతి
సాక్షాత్కారమై
విస్తరించేను గెలుపు
ద్వారాలు.
విజయపు
కిరీటాలుగా
బలాలను
ధరించకు...

ఓటమి
ముద్రలుగా
బలహీనతలను
మోసుకెళ్లకు...
నిన్ను సంపూర్ణంగా
మలిచే
కాలపు శిల్పి
చేతిలోని ఉలి
సుత్తెలవి.

ఇతరులతో
సాగించే పోటీలో
నువ్వు నకలుగా
మారకు...
నిన్నటి నీతో చేసే
పోరాటమే
నీ లోపలి నిన్నటిని
ఛేదించి
సరికొత్త నీవుగా
నిన్ను వెలిగిస్తుంది.
పరుల మెప్పు
కోసం
ప్రశంసల
పూలవానలో తడిసి
సొంత స్వరాన్ని
కోల్పోకు...
అంతరాత్మ పలికే

సత్యాన్ని
నీ దిక్సూచిగా
మలుచుకో
లోకాన్ని గెలిచిన
సామ్రాజ్యాలు
కాలగర్భంలో
కలిసిపోయినా...
నిన్ను నువ్వు
జయించిన క్షణం
నీ మనోఫలకంపై
వెలిగే
అఖండ దీపమై
నిలుస్తుంది.
అది కేవలం గెలుపు
కాదు...
నీ అస్తిత్వపు
పుటలపై
నువ్వు రాసుకున్న
తొలి సంతకం.



డా. ఆవుల రేణుక
9398268976

# ప్రోత్సాహమే మనోధైర్యానికి మూలాధారం

జాతీయ ప్రోత్సాహక దినోత్సవం జరుపుకోవడం వెనుక ఒక లోతైన మానవీయ భావజాలం దాగి ఉంది. మనిషి జీవనంలో విజయాలు, పరాజయాలు, ఆనందం, దుఃఖం, ఆశలు, నిరాశలు పరంపరగా ఎదురవుతుంటాయి. కానీ ఈ విభిన్న అనుభవాల మధ్య నిలబెట్టేది మనోధైర్యం. ఆ మనోధైర్యాన్ని



నిలబెట్టే శక్తి ప్రోత్సాహమే. ఒక మనిషి మాట మరొక మనిషికి ప్రాణాధార మవుతుందని చెప్పడానికి ఇది అత్యుత్తమ ఉదాహరణ. జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మొదట అమెరికాలో 2007లో ఆవిర్భవించింది. "ప్రతి మనిషి సామర్థ్యం అపారమైందే కాని దాన్ని వెలికితీయడానికి ప్రేరణ కావాలి" అన్న ఆలోచనతో ఈ రోజు ఏర్పాటైంది. ఆలోచన ఒక దేశానికి పరిమితం కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న ఈ దినాన్ని గుర్తుచేసుకుంటూ సానుకూల ఆలోచనలు పంచుకుంటున్నారు.ప్రోత్సాహం ఎందుకు అవసరమంటే, అది కేవలం ఒక శబ్దం కాదు, ఒక శక్తి. ఒక చిన్నపిల్ల తొలిసారి నడక మొదలు పెట్టినప్పుడు తల్లి చెప్పే "నీకు వస్తుంది" అన్న మాటే బలాన్నిస్తుంది. విద్యార్థి పరీక్షల భారం ఎదుర్కొన్నప్పుడు గురువు చెప్పే "నువ్వు చేయగలవు" అన్న మాటే ధైర్యాన్నిస్తుంది. క్రీడాకారుడు ఓటమి తర్వాత నిరుత్సాహానికి లోనైనప్పుడు స్నేహితుడు చెప్పే "తర్వాతి సారి నీ విజయం ఖాయం" అన్న మాటే అతనిని తిరిగి లేస్తుంది. ఈ మాటల్లో దాగి ఉన్న ప్రేరణ తోనే మనిషి అసాధ్యాన్ని సాధ్యం చేస్తాడు.

సమాజంలో ప్రోత్సాహం ఒక బంధాన్ని పెంచుతుంది. మనం ఇతరులను అభినందించినప్పుడు, ప్రోత్సహించినప్పుడు వారితో ఉన్న బంధం మరింత దృఢమవుతుంది.

ఉద్యోగ స్థలంలో సహోద్యోగికి ఒక ప్రశంస, కుటుంబంలో బిడ్డకు ఒక అభినందన, స్నేహితునికి ఒక ధైర్య వాక్యం - ఇవన్నీ కలిసి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. పరిశోధనల ప్రకారం ఉద్యోగ ప్రదేశాల్లో ప్రోత్సాహక వాతావరణం ఉంటే ఉత్పాదకత 30 శాతం పెరుగుతుందని, విద్యార్థులు 40 శాతం ఎక్కువగా ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్తారని నిర్ధారించబడింది. ఇది గణాంకాల రూపంలో ప్రోత్సాహం యొక్క శక్తిని స్పష్టంగా చూపిస్తుంది.ఈ రోజు పాటించాల్సిన విధానం చాలా సులభం. కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలి, సహోద్యోగులకు ధైర్యం చెప్పాలి, వెనుకబడిన వారికి సానుకూల మద్దతు అందించాలి. ఒక చిన్న సహాయం కూడా ఒక పెద్ద ప్రోత్సాహమవుతుంది.

ఉదాహరణకు, చదువులో ఇబ్బంది పడుతున్న విద్యార్థికి సహాయం చేయడం, బిజీగా ఉన్న స్నేహితుని పనిలో తోడ్పడడం, ఒక వృద్ధునికి ధైర్యం చెప్పడం వంటి చిన్న చర్యలు గొప్ప ఫలితాలు ఇస్తాయి.మన భారతీయ సంస్కృతిలో ప్రోత్సాహం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. వేదాల్లో "మంచి మాట వంద యజ్ఞాల కంటే శ్రేష్ఠం" అని చెప్పబడింది. కవి గురజాడ అప్పారావు "దేశమంటే మట్టి కాదు, మనుషుల సమూహం" అన్నప్పుడు కూడా పరస్పర ప్రోత్సాహమే ఒక సమాజాన్ని నిర్మిస్తుందని సూచించారు. తాళ్ళపాక అన్నమయ్య, త్యాగరాజు కీర్తనల్లోనూ భక్తిని ప్రేరేపించే ఉత్సాహ వాక్యాలే ప్రధానంగా కనిపిస్తాయి.ప్రోత్సాహం ఇవ్వడం మన కర్తవ్యం మాత్రమే కాదు, మన సంస్కృతి కూడా. ఈ రోజు మనకు గుర్తుచేస్తున్నది - ప్రోత్సాహం ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక సమాజాన్నీ మార్చగలదు. ఒక చిన్న వాక్యం, ఒక ఆశాజనకమైన దృష్టి, ఒక మధురమైన అభినందన - ఇవన్నీ కలిసి నిస్సహాయుడిని స్ఫూర్తివంతుడిగా మార్చగలవు.

జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని కేవలం ఒక రోజుకు పరిమితం చేయకుండా ప్రతీ రోజూ మనం ఆచరించాలి. మన కుటుంబం, మన స్నేహితులు, మన సహచరులు మాత్రమే కాదు, మన పరిచయం లేని వ్యక్తికైనా ఒక చిరునవ్వు, ఒక సానుకూల మాట ఇవ్వగలిగితే అదే నిజమైన ప్రోత్సాహం అవుతుంది.ప్రోత్సాహం ఇస్తే ప్రేరణ కలుగుతుంది, ప్రేరణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, ఆత్మవిశ్వాసం విజయానికి దారితీస్తుంది. ఈ శాశ్వత సత్యాన్నే సెప్టెంబర్ 12 జాతీయ ప్రోత్సాహక దినోత్సవం మనకు గుర్తుచేస్తుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# విద్యతోపాటు ఉపాధి ఏది...?



నీతి ఆయోగ్ 2026 ఆగస్టు 18న 'Reimagining Skilling for Viksit Bharat 2047' పేరుతో విడుదల చేసిన నివేదిక దేశంలోని యువత పరిస్థితిని కండ్లకు కడుతోంది. 2021 నాటి నేషనల్ స్టాటిస్టికల్ సర్వే (ఎన్ఎస్ఎస్) గణాం కాల ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సున్న 8.7 కోట్ల మంది యువత చదువులోగానీ, శిక్షణలో గానీ, ఉపాధిలో గానీ లేరు. దేశంలో దాదాపు 35 కోట్ల మంది యువత ఉంటే, వారిలో సుమారు పాతిక శాతం ఏ విధమైన విద్య, శిక్షణ, ఉపాధికి దూరంగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఈ గణాంకాలు 2021 నాటివి కావడం మరింత ఆందోళనకరం. ఈ ఐదేండ్లలో సాఫ్ట్‌వేర్ సహా అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు తగ్గడం, అటెండర్, స్వీపర్ వంటి పోస్టులకు కూడా పోస్టుగ్రాడ్యుయేట్లు పోటీ పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి నిరాశాజనక పరిస్థితులు పేపర్ లీకులు వంటి అక్రమ మార్గాలకు కూడా కొంతమంది యువతను ప్రోత్సహించే ప్రమాదం ఉంది. 15-29 ఏళ్ల వయస్సు అత్యంత కీలకమైన దశ. ఈ సమయంలో విద్య, ఉన్నత విద్య లేదా ఉపాధికి దారితీసే శిక్షణ లభించకపోతే, తరువాత నైపుణ్యంతో కూడిన ఉపాధిలోకి ప్రవేశించడం కష్టమవుతుంది. 2021 నాటి డేటాను ఐదేళ్ల తర్వాత బహిర్గతం చేయడం ప్రభుత్వ వ్యవస్థలోని నిర్లక్ష్యాన్ని కూడా ప్రశ్నించేలా చేస్తోంది. యువత జీవితంలో ఐదేళ్లు చాలా విలువైన కాలం. ఆ సమయంలో వారికి సరైన దిశ చూపకపోతే, తరువాత ఇచ్చే శిక్షణ కూడా కోల్పోయిన అవకాశాలను పూర్తిగా భర్తీ చేయలేకపోవచ్చు. ఈ సమస్యను కేవలం నిరుద్యోగ గణాంకంగా కాకుండా, దేశ భవిష్యత్తుకు సంబంధించిన మానవ వనరుల సంక్షోభంగా చూడాల్సిన అవసరం ఉంది.

నీతి ఆయోగ్ నివేదికలో మరో ముఖ్యమైన అంశం ఏమంటే, 'నీట్'లో ఉన్న యువతలో 88 శాతం మంది గృహ సంబంధిత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ముఖ్యంగా మహిళలు ఉపాధి అవకాశాలు లేక ఇంటికే పరిమితమవుతున్న పరిస్థితి స్పష్టమవుతోంది. యువత చదువులు కొనసాగించకపోవడానికి ప్రధాన కారణాల్లో ఆర్థిక స్థోమత లేకపోవడం ఒకటని నివేదిక పేర్కొంది. అంతేకాదు, విద్యా వ్యవస్థకు మార్కెట్లో ఉన్న ఉపాధి అవకాశాలకు మధ్య తీవ్రమైన అంతరం ఉందని స్పష్టం చేసింది. డిగ్రీ పొందినంత మాత్రాన ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యం వస్తుందన్న గ్యారంటీ లేదని కూడా పేర్కొంది. అందువల్ల పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యను ప్రారంభించి, దాన్ని ఉన్నత విద్యతో అనుసంధానం చేయాలని సూచించింది. తొమ్మిదో తరగతి నుంచే 'కౌశల్ ట్రాక్స్' వంటి వొకేషనల్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు పరిశ్రమల్లో

> నీతి ఆయోగ్ నివేదికలో మరో ముఖ్యమైన అంశం ఏమంటే, 'నీట్'లో ఉన్న యువతలో 88 శాతం మంది గృహ సంబంధిత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ముఖ్యంగా మహిళలు ఉపాధి అవకాశాలు లేక ఇంటికే పరిమితమవుతున్న పరిస్థితి స్పష్టమవుతోంది. యువత చదువులు కొనసాగించకపోవడానికి ప్రధాన కారణాల్లో ఆర్థిక స్థోమత లేకపోవడం ఒకటని నివేదిక పేర్కొంది.

ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని, ఎంఎస్ఎంఈల సహకారంతో వాటిని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని సూచించింది. శిక్షణ ఏదైనా చివరకు ఉపాధికి దారి చూపేదిగా ఉండాలి తప్ప, కేవలం సర్టిఫికెట్ ఇచ్చి వదిలేయకూడదన్నది నివేదిక సారాంశం. విద్యార్థి ఏ కోర్సు చదివినా, ఆ కోర్సు పూర్తయిన తర్వాత ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి, అందుకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటి అనే సమాచారం కూడా విద్యా దశలోనే అందాలి. అప్పుడే విద్యకు, ఉపాధికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించగలం. చదువుకు మార్కెట్ అవసరాలకు సంబంధం లేకపోతే, విద్యార్థి ఎన్నో సంవత్సరాలు చదివినా చివరకు నిరుద్యోగిగా మిగిలిపోయే ప్రమాదం ఉంటుంది.

'నూతన విద్యా విధానం-2020' వృత్తి విద్యను ప్రోత్సహించాలని చెప్పినప్పటికీ, దేశంలోని ప్రతి పన్నెండు సెకండరీ పాఠశాలల్లో కేవలం ఒక పాఠశాలలో మాత్రమే వొకేషనల్ విద్య కొనసాగుతున్నట్లు నివేదిక చెబుతోంది. ఈ విద్యా విధా నంపై పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే ఉంది. అందుకే ఆరో తరగతి నుంచే 'General Employability and Entrepreneurship Skills', తొమ్మిదో తరగతి నుంచి 'కౌశల్ ట్రాక్స్'ను అమలు చేయాలని నిటి ఆయోగ్ సూచిం చింది. 2024-25 నివేదిక ప్రకారం దేశంలో డిగ్రీ పూర్తి చేసిన వారిలో 8.25 శాతం మంది ఉపాధి లేకుండా ఉన్నారు. 25 ఏళ్ల లోపు పట్టభద్రుల్లో నిరుద్యోగుల శాతం ఏకంగా 39గా ఉంది. మరోవైపు ఇప్పటివరకు 7.67 కోట్ల మందికి శిక్షణ ఇచ్చామని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.34 వేల కోట్లు ఖర్చు చేసిందని నివేదిక పేర్కొంది. అయినప్పటికీ 8.7 కోట్ల మంది 'నీట్'లో ఉండటం శిక్షణా కార్యక్రమాల ఫలితా లను ప్రశ్నిస్తోంది. శిక్షణ పొందిన వారి సంఖ్యను లెక్కించడం కంటే, ఆ శిక్షణ ద్వారా ఎంతమంది ఉపాధి పొందారు, ఎంత ఆదాయం సంపాది స్తున్నారు, తరువాత వారి ఉపాధి ఎలా అభివృద్ధి చెందుతోంది అన్నదే అసలు ప్రమాణంగా ఉండా లి. సరైన శిక్షణ, సర్టిఫికేషన్, ఉపాధి, ఆదా యం, క్రమబద్ధమైన ఎదుగు దల ఉన్నప్పుడే నిజమైన మానవ వనరులను తయారుచేసినట్ల వుతుంది. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి శిక్షణ ఇచ్చా మని చెప్పడం కంటే, ఆ శిక్షణతో ఎన్ని కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయో ప్రభుత్వం లెక్కించాలి. శిక్షణ పొందిన వ్యక్తికి సంబంధిత రంగంలో ఉద్యోగం లేదా స్వయం ఉపాధి లభించిందా లేదా అన్నదే ప్రతి పథకం విజయానికి ప్రధాన కొలమానంగా ఉండాలి.

నీతి ఆయోగ్ గణాంకాలు దేశంలోని శ్రామికశక్తి నిర్మాణాత్మక బలహీనతను కూడా వెల్లడిస్తున్నాయి. మొత్తం 65.4 కోట్ల శ్రామికశక్తిలో 58.4 శాతం స్వయం ఉపాధి, 21.7 శాతం రెగ్యులర్ వేతన ఉద్యోగులు, 19.8 శాతం క్యాజువల్ లేబర్‌గా ఉన్నారు. అంటే దాదాపు 80 శాతం మందికి స్థిరమైన, నిర్మాణాత్మక ఉపాధి లేదు. కేవలం 20 శాతం మంది మాత్రమే రెగ్యులర్ వేతన ఉద్యోగాల్లో ఉన్నారు. దేశంలో 27 కోట్ల మంది ఎలాంటి సామాజిక భద్రత లేకుండా ఉన్నారని నివేదిక చెబుతోంది. మహిళల్లో కేవలం మూడు శాతం మంది మాత్రమే ఫార్మల్ ఉపాధిలో ఉండగా, 71 శాతం మంది ఇన్‌ఫార్మల్ పనుల్లో లేదా 'నీట్' విభాగంలో ఉన్నారు. అలాగే 47 శాతం మహిళలు, 43 శాతం యువత, ఉన్నత విద్యలోని 36 శాతం మంది, ఫార్మల్ వర్కర్లలో 52 శాతం, ఇన్‌ఫార్మల్ వర్కర్లలో 55 శాతం మందికి తమకు సరిపోయే శిక్షణను గుర్తించి పొందడంలో ఇబ్బందులు ఉన్నాయని నివేదిక పేర్కొంది. శిక్షణ పొందేందుకు ప్రయాణం, ఇతర ఖర్చులు కూడా పేద యువతకు భారంగా మారుతున్నాయి. అందువల్ల 'నీట్'లో ఉన్న 8.7 కోట్ల మంది యువతను వెంటనే ఉపాధి వైపు మళ్లించాలి. పాఠశాల నుంచే వృత్తి విద్యను, ఉపాధికి అనుసంధానమైన విద్యను అందించాలి. ఇప్పటికే శిక్షణ పొందిన 7.6 కోట్ల మందిని సంబంధిత ఉపాధిలోకి తీసుకురావాలి. ముఖ్యంగా ఉపాధికి దూరంగా ఉన్న మహిళలకు ప్రత్యేక శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ విధానాలను రూపొందించాలి. వికసిత్ భారత్ అంటే కేవలం మౌలిక వసతులు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. యువతకు స్థిరమైన ఉపాధి, గౌరవప్రదమైన ఆదాయం, మహిళలకు సమాన అవకాశాలు, కార్మికులకు సామాజిక భద్రత లభించినప్పుడే అది నిజమైన అభివృద్ధిగా భావించాలి. 'నీట్'లో ఉన్న యువతను వదిలిపెట్టి 2047 నాటికి వికసిత్ భారత్ సాధిస్తామని చెప్పడం ఆచరణలో సాధ్యం కాదు. కేవలం సర్టిఫికెట్లతో కాదు.. ఉపాధి, ఆదాయం, భద్రతతోనే నైపుణ్య భారతాన్ని నిర్మించాలి.



# జాతీయం-అంతర్జాతీయం





## కృష్ణా జలాలపై విచారణ వాయిదా

- అక్టోబరు 13న మరోసారి సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఎ.ఎం.ఎస్) :**

తెలంగాణతో కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 13న విచారణ చేపట్టనున్నట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. గతంలో కృష్ణా పరీవాహక ప్రాంత పరిధిలోని రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేస్తూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రాష్ట్ర విభజన అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేయాల్సి ఉందని ఏపి ప్రభుత్వం వాదిస్తోంది. దీంతో ఈ అంశానికి సంబంధించిన విధివిధానాలను ప్రస్తుతం కొనసాగుతున్న ట్రిబ్యునల్ పరిధిలోనే ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే కేంద్రం జారీ చేసిన ఈ గెజిట్‌ను సవాలు చేస్తూ ఏపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

విచారణ సందర్భంగా కృష్ణా జలాల పంపిణీకి సంబంధించిన ట్రిబ్యునల్‌లో వాదనలు తుది దశకు చేరుకున్న విషయాన్ని ఏపి ప్రభుత్వం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి తదుపరి ఉత్తర్వులు ఉండాలని ట్రిబ్యునల్‌కు స్పష్టం చేసిన విషయాన్ని కూడా గుర్తుచేసింది. అందువల్ల ట్రిబ్యునల్ విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపి ప్రభుత్వం ధర్మాసనాన్ని కోరింది. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం,

అక్టోబర్ 13న రిట్ పిటిషన్‌పై విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.

## భారీగా భారత వాణిజ్య లోటు

- దిగుమతుల్లో 42 శాతం వాటా..
- ఎగుమతులు 22 శాతమే
- చైనా, రష్యా నుంచే అధిక దిగుమతులు
- యుఎఇకి అత్యధిక ఎగుమతులు
- చైనాదే ఆధిపత్యం
- ఇదీ బ్రిక్స్ కూటమి పరిస్థితి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఎ.ఎం.ఎస్) :**

బ్రిక్స్ కూటమి దేశాలతో భారత వాణిజ్య సంబంధాలు వేగంగా విస్తరిస్తున్న ప్పటికీ.. అంతకంటే దిగుమతులు ఎక్కువగా పెరిగిపోతున్నాయి. ఇటీవల ఎగుమతులు-దిగుమతుల మధ్య భారీ అంతరం మరింత పెరుగుతోంది. భారత్ మొత్తం దిగుమతుల్లో బ్రిక్స్ దేశాల వాటా 42 శాతానికి చేరగా, ఎగుమతుల్లో వాటా కేవలం 22 శాతంగా ఉంది. దీంతో ఈ కూటమితో భారత్ వాణిజ్య లోటు భారీగా పెరిగింది.

'ది వైర్' రిపోర్ట్ ప్రకా రం.. 2021 నుంచి 2026 మధ్య బ్రిక్స్ దేశాల తో భారత్ మొత్తం వస్తు వాణిజ్యం 203.1 బిలియన్ డాలర్ల నుంచి 417.5 బిలియన్ డాల ర్లకు పెరిగింది. దాదాపు రెట్టింపు అయ్యింది. ఈ కాలంలో బ్రిక్స్ దేశాలకు భారత ఎగుమతులు 64.3 బిలియన్ డాలర్ల నుంచి 95.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి. అంటే 48.8 శాతం పెరిగాయి. అదే సమయంలో దిగుమతులు మాత్రం ఏకంగా 131.8 శాతం ఎగిసి 138.8 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 321.8 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా బ్రిక్స్ దేశాలతో భారత్ వాణిజ్య లోటు 74.5 బిలియన్ డాలర్ల నుంచి 226.1 బిలియన్ డాలర్లకు పెరిగింది. దాదాపు మూడు రెట్లకు పైగా వాణిజ్యలోటు పెరిగినట్టయింది.

బ్రిక్స్ దేశాల నుంచి భారత దిగుమతుల్లో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. చైనా నుంచి దిగుమతులు 65.2 బిలియన్ డాలర్ల నుంచి 131.6 బిలియన్ డాలర్లకు చేరాయి. భారత బ్రిక్స్ దిగుమతుల్లో చైనా వాటా దాదాపు 41 శాతంగా ఉంది. యుఎఇ నుంచి 63.9 బిలియన్ డాలర్లు, రష్యా నుంచి 55.4 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు దిగుమతయ్యాయి. రష్యా నుంచి దిగుమతులు 5.5 బిలియన్ డాలర్ల నుంచి




55.4 బిలియన్ డాలర్లకు పెరగడానికి ప్రధానంగా ఇంధన కొనుగోళ్లే కారణం. ఈ మూడు దేశాల నుంచే బ్రిక్స్ కూటమి నుంచి భారత్ చేసుకునే దిగుమతుల్లో దాదాపు 84 శాతం ఉన్నాయి.

ఎగుమతుల పరంగా చూస్తే యుఎఇ భారత్‌కు అతిపెద్ద బ్రిక్స్ మార్కెట్‌గా ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో యుఎఇకి భారత్ ఎగుమతులు 37.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. చైనాకు 19.5 బిలియన్ డాలర్లు, సౌదీ అరేబియాకు 10.3 బిలియన్ డాలర్లు ఎగుమతయ్యాయి. బ్రెజిల్, దక్షిణాఫ్రికాకు 7 బిలియన్ డాలర్లు చొప్పున, రష్యా, ఇండోనేషియాకు 4.5 బిలియన్ డాలర్ల చొప్పున ఎగుమతులు జరిగాయి. అయితే ఇండోనేషియా, ఇరాన్, ఇథియోపియాలకు భారత్ ఎగుమతులు తగ్గాయి. బ్రిక్స్ దేశాల మధ్య అంతర్గత వస్తు వాణిజ్యం కూడా భారీ స్థాయిలో ఉంది. కూటమి దేశాల మధ్య సుమారు 1.1 ట్రిలియన్ డాలర్ల ఎగుమతులు, 1.4 ట్రిలియన్ డాలర్ల దిగుమతులు జరుగుతున్నాయి. ఇందులో చైనా కీలక పాత్ర పోషిస్తోంది. ఇతర బ్రిక్స్ దేశాలకు చైనా 550.8 బిలియన్ డాలర్ల విలువై న వస్తువులు ఎగుమతి చేస్తుండగా.. వాటి నుంచి 464.9 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకుంటోంది. బ్రిక్స్ సభ్య దేశాలన్నింటిలో భారత్‌కే అత్యధికంగా 226.1 బిలియన్ డాల ర్ల వాణిజ్య లోటు ఉండటం ఆందోళనకరం. యంత్రాలు, పారిశ్రామిక ముడిసరు కులు, ఇంధనం వంటి కీలక అవసరాలకు బ్రిక్స్ దేశాలపై భారత్ ఆధారపడు తున్నప్పటికీ.. అదే స్థాయిలో ఎగుమతులను పెంచుకోలేకపోతోంది. ముఖ్యంగా చైనా, రష్యా, ఇండోనేషియా వంటి మార్కెట్లలో భారత ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం పెంచడం, అధిక విలువ కలిగిన వస్తువుల ఎగుమతులను విస్తరించడం, కొన్ని దేశాలపై దిగుమతుల ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా ఈ వాణిజ్యలోటు అసమతుల్యతను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే బ్రిక్స్ కూటమితో భారత్ వాణిజ్య లోటు మరింత విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.




## రిపబ్లికన్లను గెలిపించండి..

- ప్రతీ అమెరికన్‌కు 5 వేల డాలర్లు ఇస్తాం
- ఓటర్లకు ట్రంప్ ఆఫర్
- హార్ము జ్ ను అలా పిలిస్తే ఇరాన్ థ్రిల్ అవుతుందని వ్యాఖ్య

**వాషింగ్టన్, సెప్టెంబరు 11 :**

ట్రంప్ పాలనలో యుద్ధం దెబ్బకు అమెరికా పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయింది. ఓవైపు ఓటమి ఖాయమనే సంకేతాలు వస్తున్న నేపథ్యంలో (నగదు బదిలీ పథకం) మనీగేమ్ ను తెరపైకి తెచ్చారు.నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లిన్ పార్టీ విజయం సాధిస్తే ప్రతి అమెరికన్ వయోజనుడికి 5 వేల డాలర్లు ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. డాలస్‌లో జరిగిన రిపబ్లికన్‌పార్టీ మిడ్‌టర్మ్ కన్వెన్షన్‌లో ప్రసంగించిన ట్రంప్ ఈ ఎన్నికల్లో తాను కూడా పోటీలో ఉన్నట్లుగా భావించి మద్దతుదారులు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రిపబ్లికన్లు గెలిస్తే ఓటర్లు గెలిచినట్టేనని అప్పుడు వారికి 5 వేల డాలర్లు లభిస్తాయన్నారు. దానిని "ట్రంప్ డివిడెండ్" అని పిలుస్తారని ట్రంప్ చెప్పారు. ప్రస్తుత సర్వేల్లో డెమొక్రాట్ల కంటే రిపబ్లికన్లు వెనుకబడి ఉన్న తరుణంలో ట్రంప్ ఈ హామీ ప్రకటించారు. ఈ ప్రతిపాదనను అమలు చేయడానికి కనీసం 1 ట్రిలియన్ డాలర్ల వ్యయం అవు తుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ భారీ మొత్తా నికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుందనేది ట్రంప్ స్పష్టంగా చెప్పలేదు. అమెరికా చాలా డబ్బు సంపాదిస్తోందని మాత్రమే చెప్పారు. ఇదే సభలో హార్ముజ్ జలసంధిని ట్రంప్ సంధిగా పిలుద్దామని మద్దతుదారులకు పిలుపునిచ్చారు. అలా పిలిస్తే ఇరాన్ కూడా థ్రిల్‌గా ఫీలవుతుందని ఎద్దేవా చేశారు.

ఇరాన్ ను దెబ్బ కొట్టలేక ఏఐ ట్రూత్ పోస్టులతో కాలాన్ని నెట్టుకు వస్తున్న విషయం విదితమే.

## అందరి చూపూ.. అటు వైపే...

- బ్రిక్స్ సదస్సుకు సిద్ధమైన ఢిల్లీ
- రష్యా, ఇరాన్ అధ్యక్షుల రాక
- మోడీతో ప్రత్యేక భేటీ
- విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఎ.ఎం.ఎస్) :**

భారత్ అధ్యక్షతన జరుగుతున్న 18వ బ్రిక్స్ సమావేశాల వేదికకు కౌంట్ డౌన్ షురూ అయ్యింది. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే సదస్సులో బ్రిక్స్ సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధులూ పాల్గొననున్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ప్రపంచ ఆర్థిక వృద్ధిని మరింత సమ్మిళితంగా మార్చేందుకు అవసరమైన సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో 18వ బ్రిక్స్ లీడర్స్ సమ్మిట్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే రష్యా అధ్యక్షుడు




వ్లాదిమిర్ పుతిన్ , ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ శుక్రవారమే న్యూఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. వీరిద్దరూ ప్రధానమంత్రి మోడీతో భేటీ కానున్నారు.

బ్రిక్స్ అనేది... గ్లోబల్ సౌత్ దేశాల మధ్య రాజకీయ, దౌత్య, ఆర్థిక సహకారం కోసం ఏర్పడిన అంతర్జాతీయ సమన్వయ వేదిక. దీనికి ప్రత్యేక రాజ్యాంగ ఒప్పందం, సొంత బడ్జెట్ లేదా శాశ్వత సెక్రటేరియట్ లేవు. బ్రిక్స్ సహకారం ప్రధానంగా మూడు విభాగాలు...రాజకీయ, భద్రతా సహకారం, ఆర్థిక రంగ సహకారం, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాల చుట్టూ కొనసాగుతుంది. ప్రస్తుతం బ్రిక్స్‌లో 11 పూర్తి సభ్య దేశాలు ఉన్నాయి. 2026 జనవరి 1 నుంచి భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టింది. అయితే భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లోనూ భారత్ ఈ బాధ్యతలను నిర్వహించింది. అంతేకాకుండా 2026వ సంవత్సరం బ్రిక్స్ ఏర్పాటై 20 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది

2024 కజాన్ సదస్సులో బ్రిక్స్‌లో పార్ట్నర్ కంట్రీ కేటగిరీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విభాగంలో బెలారస్, బొలీవియా, క్యూబా, కజకిస్తాన్, మలేషియా, నైజీరియా, థాయ్‌లాండ్, ఉగాండా, ఉజ్బెకిస్తాన్, వియత్నాం ఉన్నాయి. భాగస్వామ్య దేశాలను సాధారణంగా నేతల సదస్సుకు ఆహ్వానిస్తారు. సభ్య దేశాల ఏకాభిప్రాయం ఉన్న సందర్భాల్లో ఇతర బ్రిక్స్ సమావేశాల్లోనూ వీరు పాల్గొనే అవకాశం ఉంటుంది.

బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భారత ప్రభుత్వం, భారత భద్రతా బలగాలు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సదస్సు సమయంలో అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఢిల్లీ విమానాశ్రయ నిర్వాహక సంస్థ పలు కఠినమైన చర్యలను అమలు చేస్తోంది. తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 500 సీసీటీవీ కెమెరాల సహాయంతో, భద్రతా ఏర్పాట్లను సీసీటీవీ కంట్రోల్ రూమ్ పర్యవేక్షిస్తుంది. ఈ కంట్రోల్ రూమ్ పరిధిలో న్యూఢిల్లీ జిల్లాలోని కీలకమైన రహదారులలో సగం భాగం, అలాగే విదేశీ అతిథులు బస చేయనున్న ఆబ్రే హోటల్ , తాజ్ మాన్ సింగ్ హోటల్ వంటి ప్రాంతాలు ఉంటాయి. అదే విధంగా సమగ్ర భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ, ఇతర ఏజెన్సీలకు చెందిన సుమారు 7,000 మంది సిబ్బందిని మోహరించారు. అలాగే వివిధ ప్రాంతాలలో ఢిల్లీ పోలీసులు, పారామిలిటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎస్పీజీ సిబ్బందితో కూడిన బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

కాగా అంతర్జాతీయ సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను, ప్రాతినిధ్యాన్ని బలంగా వినిపించడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించనుంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ : డిజిటల్ చెల్లింపులు, డిజిటల్ సేవల రంగంలో భారత ప్రభుత్వం సాధించిన విజయాలను, జ్ఞానాన్ని ఇతర బ్రిక్స్ దేశాలతో పంచుకోవడం. వాతావరణ మార్పు లు, ఇంధన పరివర్తన: పునరుత్పాదక శక్తి, ఇంధన భద్రత, స్థిరమైన సాంకేతికతలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం. మల్టీలేటరల్ సంస్థల సంస్కరణలు: ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్ వంటి ప్రపంచ ఆర్థిక, పాలనా సంస్థల్లో వర్ధమాన దేశాలకు సరైన ప్రాతినిధ్యం దక్కేలా సంస్కరణలు తీసుకురావడంపై చర్చలు జరగనున్నాయి.

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె సక్సెస్



- పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఎ.ఎం.ఎస్) :**

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఢిల్లీ నుంచి గల్లీ వరకు సమ్మెను బ్యాంకు ఉద్యోగులు విజయవంతం చేశారు. వారంలో ఐదు రోజులకు పని దినాలను కుదించాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకంపై విభేదాలు, పెన్షన్ సంబంధిత డిమాండ్లతో సహా పలు ఇతర పెండింగ్ సమస్యలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఢిల్లీ, భోపాల్, చెన్నై, సిలిగురి, రాజ్‌కోట్, విజయవాడతో సహా పలు నగరాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించారు. దేశంలోని బ్యాంకు ఉద్యోగుల సంఘాలైన ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ , ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ , ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ల సమన్వయంతో 90శాతానికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల భారంపై ప్రజాగ్రహం



- మహారాష్ట్రలో జాతీయ రహదారి దిగ్బంధనం
- పాల్గొన్న 35 వేల మందికిపైగా బాధితులు

**ముంబయి, సెప్టెంబరు 11 (ఎ.ఎం.ఎస్) :**

మహారాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజాగ్రహం మిన్నంటింది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, మితిమీరిన విద్యుత్ బిల్లుల భారానికి నిరసనగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం దహను వద్ద చేపట్టిన జాతీయ రహదారి దిగ్బంధనం ఉధృతంగా సాగింది. ఈ ఆందోళనలో సుమారు 35,000 మందికి పైగా బాధితులు, ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు దిగ్బంధనం భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా దాదాపు మూడు గంటల పాటు కొనసాగింది. విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించే విషయమై తదుపరి 15 రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు లిఖితపూర్వక హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ప్రజాస్వామ్య మహిళా సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, అఖిల భారత కిసాన్ సభల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యులు మరియు ఎమ్మెల్యే వినోద్ నికోలే, జిల్లా కార్యదర్శి కిరణ్ గహాల తదితర ప్రముఖ నాయకులు నాయకత్వం

## నౌకలో భారీ అగ్ని ప్రమాదం

- చైనాలో 25 మంది మృతి
- ఘటనాస్థలంలో సహాయక చర్యలు ముమ్మరంచేయాలి
- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు

**బీజింగ్, సెప్టెంబరు 11 :**

చైనాలోని చింగ్దావో బెహై షిప్‌యార్డ్‌లో ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 25 మంది మృతి చెందారు. మరో ఐదుగురు గల్లంతయ్యారు.




లైబీరియా జెండాతో ప్రయాణిస్తున్న 'ఓషన్ మెలోడీ' అనే సరకు రవాణా నౌక.. మరమ్మతుల కోసం చింగ్దావో బెహై షిప్‌యార్డ్‌లో ఆగింది. అక్కడే నౌకలో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థ లంలో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అగ్నిప్రమాదానికి దారితీసిన కారణాలపై త్వరితగతిన దర్యాప్తు జరపాలని, బాధితులకు సాయం అందించాలని సూచించారు. మరోవైపు, ఈ నౌకలో చిక్కుకున్న సిబ్బందిని రక్షించడం, గాయపడిన వారికి చికిత్స అందించడంపై దృష్టి పెట్టాలని చైనా ప్రధాని లీ కియాంగ్ అత్యవసర బృందాలను ఆదేశించారు. చింగ్దావో బెహై అనేది 'చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్' ఆధ్వర్యం లోని ఒక ప్రధాన షిప్‌యార్డ్.

ఇక్కడ వాణిజ్య నౌకల నిర్మాణం, మరమ్మతులు వంటివి చేస్తుంటారు. తీరప్రాం తం వెంబడి 9 కిలోమీటర్ల మేర 815 ఎకరాల విస్తీర్ణంలో ఇది విస్తరించి ఉంది.

## కాంగోలో ఘోర అగ్ని ప్రమాదం

- 26 మంది విద్యార్థులు మృతి

**బుకావు, సెప్టెంబరు 11 :**

కాంగోలోని బుకావు నగరంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో 26 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. రెండు పాఠశాలలకు మంటలు వ్యాపించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో పదుల సంఖ్యలో గాయపడినట్లు ప్రొవిన్షియల్ ప్రభుత్వం తెలిపింది. మృతుల్లో 19 మంది బాలికలు, ఏడుగురు బాలురు ఉన్నారు. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. ఓ ఇంట్లో మంటలు చెలరేగి పక్కనే ఉన్న పాఠశాలలకు వ్యాపించినట్లు సమాచారం.

## విమానానికి అత్యంత సమీపంలో డ్రోన్



- ఉక్రెయిన్ అధ్యక్షుడికి తృటిలో తప్పిన ముప్పు

**మాల్డోవా, సెప్టెంబరు 11 :**

ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ ప్రయాణిస్తున్న విమానం టేకాఫ్ సమయంలో డ్రోన్ అత్యంత సమీపంలోకి వచ్చింది. కొద్దిలో ఢీకొనే ప్రమాదం తప్పిందని నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్ వెల్లడించారు. మాల్డోవా నుంచి నార్వే రాజధాని ఓస్లోకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నార్వే రాజు హెరాల్డ్ 5 అంత్యక్రియలకు హాజరయ్యేందుకు జెలెన్స్కీ ప్రయాణించారు. డ్రోన్ ఘటనతో మాల్డోవా గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేయడంతో ఆయన విమానం కొంత ఆలస్యమైంది.

అనంతరం గగనతల ఆంక్షలు ఎత్తివేయడంతో విమానం ఓస్లోకు బయలుదేరింది. డ్రోన్ ఎటువైపు నుంచి వచ్చిందనే వివరాలను నార్వే ప్రధాని వెల్లడించలేదు. మాల్డోవా అధికారులు మాత్రం తమ గగనతలంలోకి రెండు రష్యా డ్రోన్లు ప్రవేశించాయని, వాటిలో ఒకటి రిస్కానీ జిల్లాలోని పొలంలో కూలిపోయిందని తెలిపారు.

## ఢిల్లీ ఎయిర్ పోర్టులో సందడి

- వివిధ దేశాల అధినేతల రాక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 11 (ఎ.ఎం.ఎస్) :**

భారత్ వేదికగా రేపు 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో వివిధ దేశాల అధినేతల రాకతో ఢిల్లీ ఎయిర్ పోర్టులో సందడి నెలకొంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ చేరుకున్నారు. యూఎన్ కార్యదర్శికి విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్వాగతం పలికారు. అంతకుముందు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఉగాండా ఉపాధ్యక్షురాలు జెస్సికా అలుపో దేశ రాజధానికి చేరుకున్నారు. వీరికి నైపుణ్యాభివృద్ధి , పారిశ్రామికత శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) జయంత్ చౌదరి స్వాగతం పలికారు. అదే




విధంగా వీఐపీల రాక నేపథ్యంలో ఎయిర్ పోర్టు దగ్గర భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు పోలీసులు.


2026 జనవరి 1 నుంచి భారత్ బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టింది. అయితే భారత్ బ్రిక్స్ అధ్యక్షత వహించడం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021 సంవత్సరాల్లోనూ భారత్ ఈ బాధ్యతలను నిర్వహించింది. అంతేకాకుండా 2026వ సంవత్సరం బ్రిక్స్ ఏర్పాటై 20 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం బ్రిక్స్‌లో 11 పూర్తి సభ్య దేశాలు ఉన్నాయి.

## అంతర్జాతీయ సహకారాన్ని పునరుద్ధరించాలి

- ఐరాస సెక్రెటరీ జనరల్ గుటెర్రెస్

**న్యూయార్క్, సెప్టెంబరు 11 :**

ప్రపంచం ఘర్షణలు, అసమానతలు, వాతావరణ మార్పుల ఒత్తిడులు, వేగవంతమైన సాంకేతిక మార్పులు వంటి పరిణామాలను ఎదు ర్కొంటున్న తరుణంలో బహు పాక్షిక వాదం, అంతర్జాతీయ సహకారంపై విశ్వా సాన్ని పునరుద్ధరించాలని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ పిలుపునిచ్చారు. ఐరాస 81వ సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రపంచ సవాళ్లకు సమర్థవంతంగా ప్రతిస్పందిం చేందుకు ఐరాస సామర్థ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. జనరల్ అసెంబ్లీ అధ్యక్ష పదవిని తాత్కాలికంగా చేపట్టిన ఖలీలుర్ రెహ మాన్‌కు ఆయన అభినందనలు తెలిపారు. దౌత్యం, చర్చలు, సామూహిక చర్యల ద్వారా విభేదాలను పరిష్కరించుకోగల వేదికగా ఐరాస ప్రాముఖ్యతను గుటెర్రెస్ వివరించారు. జనరల్ అసెంబ్లీ 81వ సమావేశం వచ్చే సంవత్సరం సెప్టెంబర్ వరకూ కొనసాగుతుంది. ఈ నెల



చివరలో జరిగే వార్షిక ఉన్నతస్థాయి చర్చల కోసం ప్రపంచ నేతలు న్యూయార్క్‌లో సమావేశం అవుతారు. ఐరాసకు అత్యంత కీలకమైన తరు ణంలోతాను ఈ బాధ్యతలు చేపట్టానని నూతన అధ్యక్షుడు ఖలీలుర్ రెహమాన్ చెప్పారు. ఐరాస తొమ్మిదో దశాబ్దంలోకి అడుగు పెడుతున్న సమయంలో గతంలో సాధించిన అనేక విజయాలను ఆయన ప్రస్తావించారు. అదే సమయంలో ఐరాస తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని అన్నారు. అంచనాలను అందుకోవడంలో ఐరాస తరచుగా విఫలమైందని, వివిధ దేశాల మధ్య జరుగుతున్న ఘర్షణలు అపారమైన నష్టాలను మిగిల్చాయని, అభివృద్ధి విజయాలు బలహీనంగా ఉన్నాయని తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావాలు తీవ్రంగా ఉన్నాయని రెహ మాన్ ఆందోళన వ్యక్తం చేశారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## రీ-సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్యశారద



**వరంగల్ జిల్లా/ పర్వతగిరి సెప్టెంబర్ 11(వుదయం ):**

పర్వతగిరి మండలంలోని జమాల్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో భూముల రీసర్వే జరుగుతున్నా తీరును పరిశీలించి ఏ మేరకు పూర్తయింది, అధికారులు చేపడుతున్న చర్యలు, సర్వేలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రీసర్వే సందర్భంగా భూముల వివరాలు, సరిహద్దులు, హక్కులకు సంబంధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులు, భూ యజమానులకు అవసరమైన సమాచారం అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. సర్వే వివరాల నమోదు, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిర్ణీత గడువులోగా రీసర్వే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రీ సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ రీ సర్వే పరిశీలన లో వరంగల్ ఆర్డీవో సుమ, ఎడి సర్వే మరియు భూ రికార్డు అధికారి శ్రీనివాసులు, పర్వతగిరి తహసిల్దార్ వెంకట స్వామి తదితర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ
### ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం,సెప్టెంబర్11 (వుదయం ప్రతినిధి):**

2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బంది (గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో సమర్పించిన వివరాలు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, అందుబాటులో ఉన్న అధికారిక రికార్డులను పరిశీలించిన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితాలను సిద్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.సంబంధిత పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని పీవో సూచించారు.

జాబితాలో తమ పేరు, విద్యార్హతలు, పొందిన మెరిట్, సెట్, నెట్, పీహెచ్‌డీ లేదా ఇతర సంబంధిత అర్హతల వివరాల్లో ఏవైనా తప్పులు, పొరపాట్లు లేదా అభ్యంతరకర అంశాలు ఉన్నట్లయితే, వాటిని నిర్ధారించే తగిన ఆధారాలతో అభ్యంతరాలను సమర్పించాలని తెలిపారు.అభ్యంతరాలను ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మాత్రమే కార్యాలయ పనివేళల్లో ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏ, భద్రాచలంలో నేరుగా సమర్పించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అభ్యర్థులు అభ్యంతరాలను సమర్పించే సమయంలో తమ అభ్యంతరానికి సంబంధించిన పూర్తి వివరాలను స్పష్టంగా పేర్కొనడంతో పాటు, అందుకు మద్దతుగా ఉన్న విద్యార్హతలు, అనుభవం, సెట్, నెట్, పీహెచ్‌డీ తదితర ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. తాత్కాలిక మెరిట్ జాబితాలో వివరాలు సక్రమంగా ఉన్న అభ్యర్థులు ఎలాంటి అభ్యంతరాలనుసమర్పించాల్సిన అవసరం లేదని, అయితే తమ వివరాల్లో ఏదైనా పొరపాటు లేదా లోపం ఉన్నట్లు గుర్తించిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా సంబంధిత ఆధారాలతో అభ్యంతరాలను సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను సమర్పించేందుకు చివరి తేదీ, సమయాన్ని ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకోవాలని పీవో సూచించారు.నిర్ణీత గడువు ముగిసిన అనంతరం అందిన అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని బి. రాహుల్ స్పష్టం చేశారు. అలాగే ఆధారాలు లేకుండా సమర్పించే అభ్యంతరాలను పరిశీలనకు స్వీకరించడంలో ఇబ్బందులు ఉంటాయని, అందువల్ల ప్రతి అభ్యంతరానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలను జతపరచాలని సూచించారు. అభ్యర్థుల నుంచి నిర్ణీత గడువులో అందిన అభ్యంతరాలను సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలిస్తారని తెలిపారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం అభ్యర్థుల అర్హత, మెరిట్, సమర్పించిన ధ్రువపత్రాలు, సంబంధిత నియామక నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నియామక ప్రక్రియను కొనసాగించనున్నట్లు ఆయన వెల్లడించారు. గెస్ట్ ఫ్యాకల్టీ నియామక ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, అర్హులైన అభ్యర్థులకు సముచిత అవకాశం కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు పీవో తెలిపారు. అభ్యర్థులు ఎటువంటి అపోహలకు తావులేకుండా అధికారికంగా ప్రకటించిన తాత్కాలిక మెరిట్ జాబితాలను పరిశీలించి, అవసరమైతే నిర్ణీత గడువులోగా తమ అభ్యంతరాలను సమర్పించాలని ఆయన కోరారు. నియామక ప్రక్రియకు సంబంధించిన ఇతర వివరాలు, సందేహాలు లేదా మరింత సమాచారం కోసం చరవాణి నంబర్ 8500136628ను సంప్రదించి తెలుసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అభ్యర్థులకు సూచించారు.

## ఏపూరి సోమన్న 25 ఏండ్ల పాటల ప్రవాహం సభ



**ప్రజలను చైతన్య పరిచే పాటకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి _సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి**

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్11(వుదయం):**

ప్రజా కళాకారుడు, ప్రజా యుద్ధనౌక ఏపూరి సోమన్న పాటకు 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా గురువారం భువనగిరిలో ఏ ఆర్ గార్డెన్ లో పాటల ప్రవాహం సభ జరిగింది. ఈ సభకు ప్రజా కళాకారుడు మీసాల గణేష్ అధ్యక్షత వహించగా సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ఏపూరి సోమన్న జీవితంలో

సగం జీవితం ప్రజా కళాకారుడిగా ప్రజలను చైతన్య పరిచాడని ఆయన అన్నారు. ఏపూరి సోమన్న సేవలను ప్రజలు గుండెల్లో దాచుకుంటారని ఆయన అన్నారు. ప్రజా కళాకారులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ఈ సభ ద్వారా ప్రపంచానికి పరిచయం చేయాలని ఆయన అన్నారు. ఏపూరి సోమన్న చట్ట సభలకు వేళ్ళే వరకు మనమంతా సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపూరి సోమన్న పాటకు "25 ఏండ్ల పాటలు ప్రవాహం" పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బట్టు రామచంద్రయ్య, కరెన్సీనోట్లపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరుశురాం, జిల్లా అధ్యక్షులు కొడారి వెంకటేష్, ఎం ఆర్ పి ఎస్ జిల్లా నాయకులు చిలుకమారిగణేష్, ఐ లు జిల్లా అధ్యక్షులు బొల్లేపల్లికుమార్, కవి బైరపాక స్వామి, కళాకారులు ఎర్ర సూర్యం ,మహిళా కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల ఇంటి స్థలాల సాధనకు టీయూ డబ్ల్యూజే(ఐజేయూ)
### 18, 19 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల నిరాహార దీక్షలు



**జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మామిడి మహేందర్ రెడ్డి**

**నల్గొండ జిల్లా సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి**

నల్గొండ పట్టణ కేంద్రంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల18, 19 తేదీల్లో నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (TUWJIJU) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు.ఈ మేరకు దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ నల్లగొండ డీఎస్పీ కె. శివరాంరెడ్డికి యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్య అయిన ఇంటి స్థలాల కేటాయింపును ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులి మామిడి మహేందర్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు జక్కల పరమేష్, చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బోజు మదనాచారి, జిల్లా కోశాధికారి పి. అశోక్ కుమార్, వంగాల శ్రీనివాసరెడ్డి, ఉయ్యాల లింగయ్య, ఎండి సయ్యద్, దోటి శ్రీనివాస్, ఊర రమేష్, సూరారపు రాంప్రసాద్, శ్రీరామోజు కనకాచారి, ఎస్కే సలీం, వినోద్, కారింగి శ్రీను, సోమ చంద్రశేఖర్, సాగర్, చింత యాదయ్య, డీఎస్ యాదవ్, రాజు వనమాల, పుల్లెంల సందీప్, కొండ నరసింహ స్వామి, రెడ్డిపల్లి యాదగిరి, దశరథ, భాస్కర్, విజయ్, జగదీశ్వర చారి తదితరులు పాల్గొన్నారు

## ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సిపి ఎన్. శ్వేత



**వరంగల్ క్రైం, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి) :**

వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీపీకి పోలీసులు గౌరవ వందనం సమర్పించగా, స్టేషన్ ఇన్స్పెక్టర్ మొక్కను అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ రికార్డులను పరిశీలించిన సీపీ, సిబ్బందిని శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల తనిఖీలు, రోడ్డు ప్రమాదాల నివారణపై సమీక్షించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి. భద్రతకు ప్రాధాన్యం, వాహనదారులు, పాదచారుల భద్రతే లక్ష్యంగా నిబంధనలు కఠినంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి. ట్రాఫిక్ సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, అంకితభావంతో మెరుగైన సేవలందించాలి. ఈ తనిఖీ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
### సీపీ శ్వేత, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హనుమకొండ, సెప్టెంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

నగరంలో గణపతి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, సజావుగా సాగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వారు అధికారులతో కలిసి కాజీపేట బంధం చెరువు, సిద్దేశ్వర గుండం, చిన్న వడ్డేపల్లి, ఉర్సు చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు చేపట్టాల్సిన కీలక చర్యలను సూచించారు:

మౌలిక వసతులు, పరిశుభ్రత, బంధం చెరువులో గుర్రపు డెక్కను త్వరగా తొలగించాలని, చెరువుల వద్ద క్రేన్లను సిద్ధం చేయాలని మరియు చెరువు కట్టలను చదును చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్లకు మరమ్మతులు చేపట్టి, రద్దీని నివారించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నవరాత్రులు పూర్తవగానే విగ్రహాలను త్వరగా నిమజ్జనానికి తీసుకురావాలని కోరారు. తక్కువ ఎత్తు ఉన్న చిన్న విగ్రహాలను మరియు మట్టి విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనం చేసుకుని సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, జీడబ్ల్యూఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



**– జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 11(వుదయం ప్రతినిధి) :**

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణలో మట్టి గణపతి ప్రతిమలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా, రసాయన రహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (PoP), ప్రమాదకర రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి విగ్రహాలనే పూజించి నీటి మూలాలను, పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్లాస్టిక్, రసాయన విగ్రహాల వాడకాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయి శ్రీజ, డి.పి.ఆర్.ఓ రాజేంద్రప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యానికి కొత్త బలం..
## ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల విస్తరణ



**కలెక్టర్ దివాకర టిఎస్ పర్యవేక్షణ తో ఆధునిక వైద్య సేవలకు**
**మంత్రుల ప్రత్యేక శ్రద్ధతో సౌకర్యాల విస్తరణ..**
**ప్రజలకు మరింత చేరువైన నాణ్యమైన వైద్యం**
**కలర్ డాప్లర్, కాంట్రాస్ట్ సీటీ, హెచ్ఆర్ సీటీతో అధునాతన నిర్ధారణ సేవలు**
**మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 16,961 స్కాన్లు..**
**546 టిఫ్ఫా స్కాన్లతో గర్భిణులకు ప్రత్యేక భరోసా**

**ఖమ్మం జిల్లా,సెప్టెంబర్ 11(వుదయం బ్యూరో):**

ప్రభుత్వ ఆసుపత్రి అంటే సాధారణ వైద్యం మాత్రమే అనే భావనను మార్చేలా ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్య సేవలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఆధునిక వైద్య పరీక్షలు, అధునాతన స్కానింగ్ సదుపాయాలు, రేడియాలజీ సేవలు, మాతా శిశు సంరక్షణ, అత్యవసర రోగులకు పడక వద్దే పరీక్షలు వంటి అనేక సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువవుతోంది. ఖరీదైన పరీక్షల కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే అనేక ఆధునిక సేవలు అందుతున్నాయి.జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆసుపత్రిలోని అవసరాలను గుర్తించడం, వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకు రావడం, వాటికి అవసరమైన మౌళిక వసతులు కల్పించడం, వైద్య నిపుణుల కొరతను అధిగమించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల విస్తరణకు రాష్ట్ర మంత్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో ఖమ్మం సర్వజనాసుపత్రిలో సేవల బలోపేతానికి మరింత ఊతం లభిస్తోంది.

మూడు పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులో
ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి కొత్తగా 3 పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో అవసరమైన రోగులకు వేగంగా అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని బట్టి పరీక్షలు నిర్వహించేందుకు ఈ పోర్టబుల్ యంత్రాలు ఎంతోఉపయోగపడుతున్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి తరలించాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వైద్యుల సూచన మేరకు అవసరమైన ప్రదేశంలోనే పరీక్ష నిర్వహించే వెసులుబాటు ఏర్పడుతోంది.

త్వరలో ఎంఆర్ఐ.. కలెక్టర్ చొరవతో సివిల్ పనులు వేగవంతం:
ఖమ్మం సర్వజనాసుపత్రిలో త్వరలో ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి రానుంది. ఎంఆర్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక చొరవతో వేగంగా పూర్తి చేస్తున్నారు. ఎంఆర్ఐ యంత్రానికి అవసరమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యంత్రం ఏర్పాటు చేసిన తర్వాత అది నిరంతరాయంగా ప్రజలకు సేవలందించేలా అవసరమైన మౌళిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేస్తున్నారు.

మెదడు, వెన్నెముక, కీళ్లు, కండరాలు, అంతర్గత అవయవాలు, తదితర ప్రాంతాలకు సంబంధించిన అనేక సమస్యలను గుర్తించడంలో ఎంఆర్ఐ పరీక్ష ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు అధిక వ్యయంతో కూడిన ప్రైవేటు పరీక్షల భారం తగ్గనుంది.

పడక వద్దే ఎక్స్‌రే.. తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారికి ఉపశమనం:
సర్వజనాసుపత్రిలో పోర్టబుల్ ఎక్స్‌రే, స్థిర ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఓపీ, ఐపీ రోగులకు అవసరాన్ని బట్టి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉండటం వల్ల కదలలేని రోగులను పడక నుంచి ఎక్స్‌రే విభాగానికి తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గింది. రోగిని పడకపైనే ఉంచి అవసరమైన సమయంలో అక్కడికక్కడే ఎక్స్‌రే తీసే సదుపాయం ఏర్పడింది.తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు, అత్యవసర చికిత్స పొందుతున్నవారు, కదలడానికి ఇబ్బంది ఉన్న రోగులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. రోగిని తరలించే సమయంలో కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంతో పాటు వైద్యులకు త్వరగా పరీక్షా ఫలితాలు అందే అవకాశం ఏర్పడింది. అదనంగా ఓపీ, ఐపీ సేవలకు ఎక్స్‌రే యంత్రాలను వినియోగిస్తున్నారు. టీహబ్‌లో అదనపు ఎక్స్‌రే యంత్రంతో పాటు మామోగ్రఫీ, స్కానింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు.జనవరి-ఆగస్టులో

13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు:
ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో అల్ట్రాసౌండ్ సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 13,816 అల్ట్రాసౌండ్ స్కాన్లు నిర్వహించారు.

జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, అత్యవసర తదితర విభాగాలకు వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి అల్ట్రా సౌండ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జూలైలో 1,977, ఆగస్టులో 1,943 స్కాన్లు నిర్వహించడం ద్వారా సేవలను పెద్ద సంఖ్యలో రోగులు వినియోగించుకుంటున్న విషయం స్పష్టమవుతోంది.

మాతా శిశు సంరక్షణలో 16,961 స్కాన్లు:
గర్భిణీలు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 16,961 స్కాన్లు నిర్వహించారు. వీటిలో 8,945 ఓబీజీ స్కాన్లు , 5,417 ఉదర భాగం స్కాన్లు , 546 టిఫ్ఫా స్కాన్లు, 2,053 చిన్నారుల స్కాన్లు ఉన్నాయి.

నెలవారీగా పరిశీలిస్తే ఓబీజీ స్కాన్లు జనవరిలో 910 నుంచి ఆగస్టులో 1,329కు పెరిగాయి. ఉదర భాగం స్కాన్లు జనవరిలో 455 ఉండగా జూలైలో 999కు చేరాయి. చిన్నారులకు నిర్వహించిన స్కాన్లు ఆగస్టులో 388కు చేరాయి.ఇది మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పరీక్షా సేవల వినియోగం పెరుగుతున్నదానికి నిదర్శనంగా నిలుస్తోంది.

గర్భంలోని శిశువు ఆరోగ్యం ముందుగానే తెలుసుకునే అవకాశం:
మాతా శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా టిఫ్ఫా స్కాన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భధారణలో సాధారణంగా ఐదు నుంచి ఆరో నెల మధ్య నిర్వహించే ఈ పరీక్ష ద్వారా గర్భంలోని శిశువు అవయవాల నిర్మాణం, అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితిని ముందుగానే పరిశీలించే అవకాశం ఉంటుంది. పిండంలో అవయవ లోపాలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ముందుగానే వైద్య ప్రణాళిక రూపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

ప్రైవేటు వైద్య కేంద్రాల్లో సాధారణంగా సుమారు రూ. 6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా సేవను ప్రభుత్వ వైద్య వ్యవస్థలో ఉచితంగా అందించడం గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరం. టిఫ్ఫా స్కాన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఫిబ్రవరిలో 19 గా ఉన్న స్కాన్లు , ఆగస్టులో 136కు చేరాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు మొత్తం 546 టిఫ్ఫా స్కాన్లు నిర్వహించారు.

కలర్ డాప్లర్‌తో రక్తనాళాల సమస్యలకు ముందస్తు గుర్తింపు:
సర్వజనాసుపత్రిలో కలర్ డాప్లర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. రక్త నాళాల్లో రక్తప్రసరణను పరిశీలించారు

## ఇందిరమ్మ ఇళ్లు, మార్కెట్ గోదాము పరిశీలన



**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి) :**

జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంతో పాటు గ్రామ శివారు ప్రాంతాల్లో శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను, వ్యవసాయ మార్కెట్ ఆధునిక గోదామును ఆయన అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా దేవరుప్పుల గ్రామ పంచాయతీ పరిధిలో లబ్ధిదారులు బండిపల్లి పద్మ, తోటకూర శారద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. ఇప్పటివరకు మూడు విడతల బిల్లులు అందాయని లబ్ధిదారులు కలెక్టర్‌కు తెలపగా, మరో రెండు మూడు రోజుల్లో తలుపుల బిగింపు, సున్నం వేసే పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులు త్వరగా పూర్తి చేస్తే తదుపరి బిల్లు మంజూరవుతుందని స్పష్టం చేశారు. అలాగే గ్రామంలో దోమల నివారణ, వ్యాధుల అరికట్టేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం గ్రామ శివారులోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ గోదామును పరిశీలించిన కలెక్టర్, అక్కడి నిల్వ సామర్థ్యం, బియ్యం నిల్వ విధానాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని రైస్ మిల్లుల నుంచి ఇక్కడికి వచ్చే బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గోదాము నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని వ్యక్తులను లోనికి రానివ్వవద్దని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ పర్యటనలో పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డితో పాటు వివిధ శాఖల సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 15 నుంచి పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు



**– డిఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి**

**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి) :**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 15 నుంచి డిసెంబర్ 31 వరకు కంటి పరీక్షల (ఐ స్క్రీనింగ్) శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డా. బి. రాజా రెడ్డి తెలిపారు. శుక్రవారం డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఆర్ బి ఎస్ కే వైద్యులు,

ఆప్తాల్మిక్ అధికారులు, ఆప్టోమెట్రిస్ట్‌లతో నిర్వహించిన సంసిద్ధత సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ సెప్టెంబర్ 15 నుండి డిసెంబర్ 31 వరకు, వారంలో 3 లేదా 4 రోజుల పాటు ఈ శిబిరాలు జరుగుతాయి. జిల్లాలోని 5 RBSK టీమ్‌లు (ప్రతి టీమ్‌లో ఒక ఆప్టోమెట్రిస్ట్/ఆప్తాల్మిక్ అధికారి) పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. లక్ష్యంతో ప్రతి టీమ్ రోజుకు 300 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు పూర్తి చేయాలి. చూపు సమస్యలు (రిఫ్రాక్టివ్ ఎర్రర్) ఉన్న విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు సిఫారసు చేస్తారు. తీవ్రమైన సమస్యలు ఉంటే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక వైద్యాధికారుల సమన్వయంతో పక్కా కార్యాచరణ రూపొందించి రోజువారీ నివేదికలను జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. ప్రకాష్, ఆర్ బి ఎస్ కె వైద్య అధికారులు, ఆప్తాల్మిక్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ భాషా దినోత్సవం




**హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హిందీ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం హిందీ విభాగం విశ్రాంతి ఆచార్యులు ప్రొఫెసర్ సంజీవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సంజీవ్ మాట్లాడుతూ భారతదేశ భాషా వైవిధ్యంలో హిందీకి ప్రత్యేక స్థానం ఉందని, భాషలు ప్రజలను, సంస్కృతులను కలిపే వారధులని అన్నారు. విద్యార్థులు మాతృభాషతో పాటు ఇతర భారతీయ భాషలను నేర్చుకోవడం ద్వారా తమ జ్ఞానాన్ని, ఉపాధి అవకాశాలను విస్తరించుకోవాలని సూచించారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ భాషా పరిజ్ఞానం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. హిందీ భాషా అధ్యయనం ద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాల ప్రజలతో సులభంగా సంభాషించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో హిందీ విభాగం అధ్యాపకులు డాక్టర్ ఫరః ఫాతిమా, డాక్టర్ రమాదేవి, డాక్టర్ వెంకట్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జ్యోష్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి
### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**ఆధునిక సాంకేతికతతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం - ప్రజావాణి, భూభారతి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

**సూర్యాపేట, సెప్టెంబర్ 11(వుదయం ప్రతినిధి):**

జిల్లాలో రెవెన్యూ సేవలను మరింత వేగవంతం చేసి ప్రజలకు వేగంగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రతి అంశంలో పారదర్శకత, ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో రెవెన్యూ అధికారులతో వెబెక్స్ ద్వారా భూభారతి, ప్రజావాణి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు.

కలెక్టర్ ఆదేశాలు:
రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా చేస్తున్న గ్రామ సర్వే మరింత సమర్థవంతంగా చేయాలి తహసీల్దార్లు, సర్వేయర్లు ప్రతివారం పురోగతి నివేదికలు ఇవ్వాలి. జాప్యం నివారణకు AI, డిజిటల్ పరిజ్ఞానం వాడాలి. గంటలు పట్టే పనులను నిమిషాల్లో నాణ్యతతో పూర్తి చేయవచ్చు.మండలాల వారీగా దీర్ఘకాల భూసమస్యల జాబితా రూపొందించి, 60 రోజులుగా పెండింగ్ లో ఉన్న భూభారతి, ప్రజావాణి కేసులను ప్రాధాన్యతగా పరిష్కరించాలి.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి...

**పనుల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి...**

**ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి...కలెక్టర్**

**జగిత్యాల సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)**

అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. పనుల అమలులో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే పరిష్కరించాలని అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి అయినా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు మధ్యలో నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పూర్తయిన పనులు పురోగతిలో ఉన్న పనులు ప్రారంభం కాని పనుల వివరాలను కలెక్టర్ సమీక్షించారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి ప్రతి పనిలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకొని పని చేయాలని సూచించారు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని భూ సమస్యలు సాంకేతిక సమస్యలు ఇతర పరిపాలనా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని భవన నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నందున వాటిని త్వరితగతిన పూర్తి ప్రక్రియలు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పరిధిలో మొత్తం 2,949 పనులకు 497.03 కోట్ల రూపాయల అంచనా వ్యయం ఉండగా ఇప్పటివరకు 128.13 కోట్ల రూపాయల వ్యయం జరిగినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీటిలో 842 పనులు పూర్తికాగా 839 పనులు పురోగతిలో 1,268 పనులు ప్రారంభం కాలేదు. 127 ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలు చాలాకాలంగా పరిష్కారం కాకుండా ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ భవనాల పనుల్లో పురోగతి చాలా తక్కువగా ఉందని పనుల వేగాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. అలాగే రెండేళ్ల క్రితం మంజూరైన కిచెన్ షెడ్లు అంగన్వాడీ భవనాలు మరుగుదొడ్లు గ్రామపంచాయతీ భవనాల పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని వాటిని ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రారంభం కాని పనులన్నీ వచ్చే వారం క్షేత్ర స్థాయిలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకో



వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడ కుండా క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

**ఉపాధి హామీ పనులపై సమీక్ష**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వివిజి రామ్ జి కింద జిల్లాలో చేపడుతున్న పనుల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. 2026 సెప్టెంబర్ 11 నాటికి జిల్లాలో మొత్తం 971 ఉపాధి హామీ పనులకు 77.44 కోట్ల రూపాయల అంచనా వ్యయం ఉండగా 304 పనులు పూర్తయ్యాయి. 464 పనులు పురోగతిలో ఉన్నాయి 205 పనులు ప్రారంభం కాలేదు. గత సంవత్సరానికి సంబంధించిన వ్యయం 14.42 కోట్లు రూపాయలు కాగా 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3.57 కోట్ల రూపాయల వ్యయం జరిగింది. మొత్తంగా 17.99 కోట్ల రూపాయల వ్యయం నమోదైనట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీకింద గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడీ భవనాలు పాఠశాలల మరుగుదొడ్లు కిచెన్ షెడ్లు గ్రామ సంస్థల భవనాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉప కేంద్రాలు పలు ఇతర మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఉపాధి హామీ పనుల్లో ప్రారంభం కాని పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి నిర్దేశించిన 100 రోజుల కార్యాచరణ ప్రకారం పనుల పూర్తికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సమస్యలు ఏజెన్సీ సమస్యలు అవసరం లేని పనులు ద్వంద్వ మంజూర్లలో వంటి కారణాలతో నిలిచిపోయిన పనులను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. గ్రామపంచాయతీ భవనాల కింద 90 పనులకు 17.96 కోట్ల రూపాయలు అంగన్వాడీ భవనాల కింద 76 పనులకు 9.12 కోట్ల రూపాయలు పాఠశాలల మరుగుదొడ్ల కింద 354 పనులకు 7.08 కోట్ల రూపాయలు కిచెన్ షెడ్ల కింద 98 పనులకు 5.35 కోట్ల రూపాయలు గ్రామ సంస్థల భవనాల కింద 345 పనులకు 34.50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద ఒక పనికి 1.43 కోట్ల రూపాయలు ఉప కేంద్రాల కింద నాలుగు పనులకు 80 లక్షల రూపాయలు పలు ఇతర మౌలిక వసతుల పనులకు 1.20 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు.

ప్రతిపనికి సం బంధించి క్షేత్రస్థాయి పరిస్థితులను నిరం తరం పర్యవేక్షిస్తూ ఎదురయ్యే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి పను లను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బం దీగా నిర్వహించాలి

**నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు వ్యక్తిగతంగా అందజేయాలి**

**అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**ధర్మపురి సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా జారీ చేస్తున్న నోటీసులు, వాటిపై నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియ, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ నోటీసులపై విచారణను పూర్తిస్థాయిలో, నిబంధనలకు అను గుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి సేకరించిన ఆధారాలు, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు, తేడాలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. నో మ్యాపింగ్ ఓటర్లు, అనామ లీస్ ఓటర్లకు సంబంధించిన అన్ని నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, అందజేత, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్‌లో వివరాల నమోదు తదితర ప్రతి దశను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. అదే సమయంలో అనర్హమైన లేదా తప్పుగా నమో దైన వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి సరిదిద్దేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మన లక్ష్యం. ఎస్ఐఆర్ ప్రక్రియ లో పారదర్శకత,నిష్పక్షపాతంగా వ్యవహరించడం, నిబంధన లను కచ్చితంగా పాటించడం అత్యంత ముఖ్యం అని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం 2027లో రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ధర్మపురిలోని గోదావరి నది వద్ద జరుగుతున్న పనులను ఆయన క్షేత్ర



స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతంగా,ప్రణాళి కలకు అనుగుణంగా భక్తులకు, వీఐపీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కర ఘాట్లను నిర్మించాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి , తహసీల్దార్ శ్రీనివాస్,ఎంపిడిఓ రవీందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# కళలు మానసిక ఆనందాన్ని ఇస్తాయి

**జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన చైతన్య జైనీ, జిల్లా విద్యాశాఖ అధికారి**

**కరీంనగర్ సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**

సైన్స్ మ్యూజియం ఆడిటోరియంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్య జైనిహాజరై మాట్లాడుతూ కళలు మానసిక ఆనందాన్నిస్తాయని అన్నారు. సైన్స్ డ్రామా ఆనందంతో పాటు శాస్త్ర సాంకేతిక దృక్పథాన్ని పెంపొందింపచేస్తుందని, సమాజం ఈరోజు ఆనందంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. పాఠశాల స్థాయిలోనే శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకుంటూ సామాజిక అభివృద్ధిలో పాలుపంచుకోవాలని వారు కోరారు.పిల్లలు చదువుతో పాటుగా కళా రంగంలో ఎదుగుతూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఏ స్థాయిలో ఉన్నప్పటికిని కళ మనుషులకి గుర్తింపు తెస్తుందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు గొప్ప స్పందన వచ్చినట్లు తెలిపారు. వివిధ యాజమాన్యాల కింద 31 సైన్స్ డ్రామాలు ప్రదర్శించడం జరిగిందన్నారు. ఇందులో ఆర్టిఫిషియల్



ఇంటెలిజెన్స్ ద్వారా ఉపయోగాలు, అలాగే విపరీతర్థాలను తెలిపారు. భూమితో పాటు ఇతర గ్రహాల పైన జరుగుతున్నటువంటి ఒక మార్పుల ద్వారా ఆ ప్రమతతను ప్రకటించారు. సముద్రాన్ని పాడు చేయవద్దని ప్లాస్టిక్ తో ఈ ప్రపంచాన్ని ఇబ్బంది గురి చేయవద్దని సందేశాత్మకమైన నాటకాల్ని ప్రదర్శించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన మొదటి ఉత్తమ ప్రదర్శన రాష్ట్రస్థాయి ఎస్సీఆర్టీలో 25 26 తేదీలలో ప్రదర్శనకు వెళ్లాల్సి అవసరం ఉంటుందని చెప్పారు. నవంబర్ 19 20 తేదీలు బెంగళూరు లోపల దక్షిణ భారతదేశ సైన్స్ డ్రామా కాంపిటీషన్ జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీబీ కార్యదర్శి భగవంతయ్య అకడమిక్ మానిటరింగ్ ఆఫ్సర్ అశోక రెడ్డి బాలల సైన్స్ అకడమిక్ కోఆర్డినేటర్ పెద్ది బీరయ్య, రవినందన్ రావు పాల్గొన్నారు .జూరీ మెంబర్లుగా గంగాధర మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పద్మ ,గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, సత్యనారాయణ , అనుసంధానకర్తగాకె ఎస్ అనంతాచార్యులు వ్యవహరించారు.ప్రథమ బహుమతి అల్ఫోర్స్ హై స్కూల్ కొత్తపల్లి, ద్వితీయ బహుమతి సెయింట్ జార్జ్ హై స్కూల్ కొత్తపల్లి, మూడవ బహుమతి భగవతి హై స్కూల్ కరీంనగర్ గెలుపొందినట్లు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్

**మార్చి 2027 నాటికి ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేయాలి**

**ప్రారంభం నాటికే అన్ని పరికరాలతో ప్రజలకు వైద్య సేవలు అందించేలా సిద్ధం చేయాలి**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ, పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, విద్యాబోధనకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను ఒప్పందంలో నిర్దేశించిన గడువు మేరకు మార్చి 2027 నాటికి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని వైద్య పరికరాలను ఏర్పాటు చేసి, విద్యుత్, నీరు, ఇతర అనుబంధ సౌకర్యాల పనులను సైతం పూర్తిచేయాలని సూచించారు. ఆసుపత్రి భవనం ప్రారంభించే నాటికే అన్ని విభాగాలు, పరికరాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని, ప్రారంభం నుంచే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, చేపట్టిన పునరుద్ధరణ పనులను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చేలా పనులను వేగవంతంచేయాలని, నాణ్యతతో పాటు నిర్ణీత గడువుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వారి విద్యా స్థాయిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి అవసరమైన విద్యాపరమైన పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత సమయంలోగా సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు అదనపు బోధన, అవసరమైన సహాయాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు.



ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని తెలిపారు.పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పర్యటనలో టీజీఎంఐడీసీ విశ్వప్రసాద్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 11 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో పరిష్కరించలేని, పైస్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులను వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. అనంతరం మహిళా, శిశు



సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. డీడబ్ల్యూవో వినూత్నతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించిన ఆయన, పోషణ మాసం కార్యక్రమాలను అక్టోబర్ 8వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహారం, ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కృషితోనే విద్యారంగంలో జిల్లా ముందంజ: కలెక్టర్

**మంచిర్యాల/సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)**


ఉపాధ్యాయుల కృషి, అంకితభావంతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా మైనారిటీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరై డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు పెరగడంలో ఉపాధ్యాయుల కృషి కీలకమని, ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులలో నమ్మకం పెంపొందించేందుకు



ఉపాధ్యాయుల అంకితభావం ప్రధాన కారణమని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో సైతం విద్యార్థుల నమోదును మరింత పెంచడంతో పాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు, బోధనలో నాణ్యతను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్‌ను పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం ఉపాధ్యాయ వృత్తిలో కీలకమైన బాధ్యత అని తెలిపారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో వ్యవహరిస్తూ అదే లక్షణాలను విద్యార్థులలో పెంపొందించాలని, విభిన్న బోధనా పద్ధతులను అనుసరించాలని సూచించారు. సాంకేతికత ఆధారంగా ప్రతి ఒక్కరికీ నేర్చుకునే అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, వసతి తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని, పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ అందించామని, ఎప్పటికప్పుడు నూతన విద్యా విధానాలను, సాంకేతికతను నేర్చుకుంటూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి విమర్శలు వచ్చినా వాటిని నిర్మాణాత్మకంగా స్వీకరించి విద్యార్థుల అభివృద్ధికి ఉపయోగపడేలా పని చేయాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా విద్యార్థుల నమోదు, ఉత్తీర్ణతలో ముందు వరుసలో ఉండటం ఉపాధ్యాయ వర్గానికే గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనలో, పాఠశాలల అభివృద్ధిలో తమవంతు పాత్ర, అనుభవాలను వివరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 27 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఎన్రోల్మెంట్ సాధించిన 20 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవార్డులు, ఎన్.ఎం.ఎం.ఎస్. ద్వారా అధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లు సాధించిన 3 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఎస్.ఎస్.సి. ఎన్రోల్మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 3 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.అనంతరం జిల్లా కలెక్టర్‌ను అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు.

## దళితుల జోలికొస్తే.. బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతాం

**- మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరిక**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**

దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తే బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోరంచు శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. మావల మండల కేంద్రంలో బీఆర్ఎస్ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులను అవమానించేలా వ్యవహరించడం దొరహంకారానికి నిదర్శనమన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మార్‌పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండించారు. దళితులను అవమానించే చర్యలు కొనసాగితే వచ్చే ఎన్నికల్లో గట్టి సమాధానం చెబుతామని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.కార్యక్రమంలో మావల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుదుర్పాక సురేష్‌కుమార్, కోరాటి ప్రభాకర్, అట్ల గోవర్ధన్‌రెడ్డి, రెండ్ల రాజన్న, ఆత్రం శంకర్, గోస్కూర్ రాజేందర్, వేముల నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అకడమిక్ వేడుక

## ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు డాక్టరేట్లు

**కామారెడ్డి, సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు యువ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రతిష్టాత్మక డాక్టరేట్ పట్టాలను సాధించి కళాశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారు. జూవాలజీ విభాగానికి చెందిన డా. మల్సూర్ తిరుమల, కెమిస్ట్రీ విభాగానికి చెందిన డా. కోరే శ్రీనివాస్ లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి వేర్వేరు అంశాలపై పీహెచ్‌డీ పట్టాలను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.జూవాలజీ విభాగానికి చెందిన డా. మల్సూర్ తిరుమల.. సీనియర్ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్ పర్యవేక్షణలో 'స్టడీస్ అండ్ వాటర్ క్వాలిటీ అండ్ అసెస్మెంట్ ఆఫ్ మెటల్ ఇన్ వేరియస్ టిష్యూస్ ఆఫ్ ఫిష్ ఫ్రం కాచాపూర్ లేక్ కామారెడ్డి జిల్లా, తెలంగాణ, ఇండియా' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ఇదే కాకుండా ఇదే సమయంలో తన సతీమణి డా. వనజ కూడా డాక్టరేట్ సాధించడం విశేషం.అలాగే కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం రంగమ్మపల్లి గ్రామానికి చెందిన కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కోరే శ్రీనివాస్.. ప్రొఫెసర్ పి. సరితా రెడ్డి మార్గదర్శకత్వంలో "ఎన్–మిథైల్‌బెంజైలమైన్‌తో రూపొందించిన ద్వి, త్రి లోహ సంశ్లిష్టల సంశ్లేషణ, వర్ణపట, డీఎన్ఏ పరస్పర చర్యలు, జీవశాస్త్ర అధ్యయనాలు" అనే



అంశంపై సమగ్ర పరిశోధనను పూర్తి చేసి రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. డాక్టర్ తిరుమల మల్సూర్, డాక్టర్ కోరే శ్రీనివాస్ ల కృషి, పట్టుదల, పరిశోధనా నిబద్ధత కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ కొనియాడారు. భవిష్యత్తులో వారు మరిన్ని పరిశోధనలు చేపట్టి అధ్యాపక రంగానికి, విద్యార్థి లోకానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని నూతన డాక్టరేట్లు సాధించిన ఇద్దరు అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## పోషక మాసం లక్ష్యాల సాధనకు శాఖల సమన్వయంతో కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దేవ సహాయం

నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 11 (వుదయం బ్యూరో):

జిల్లాలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను గుర్తించి సకాలంలో తగిన పోషకాహారం అందించేందుకు పోషణ్ మాసం కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయం అధికారులను ఆదేశించారు.
శుక్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న పోషణ్ అభియాన్ పోషక మాసం కార్యక్రమాలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. హమారీ అంగన్వాడీ హమారీ భాగ్యదారి అనే నినాదంతో పోషకాహారం, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తొలి దశ నుంచే సరైన పోషకాహారం అందించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరువ చేయాలన్నారు.పోషక మాసం కార్యక్రమాలను కేవలం సంక్షేమ శాఖకు మాత్రమే పరిమితం చేయకుండా వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, మున్సిపల్, మహిళా శిశు సంక్షేమ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులను భాగస్వాములను చేసి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం, పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లాను పోషకాహార లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు.
ఈ సందర్భంగా నెలరోజుల పాటు నిర్వహించే రోజువారీ కార్యక్రమాల అవగాహన పోస్టర్ ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పోషక అభియాన్ నిర్వహణపై ప్రతిజ్ఞ చేయించారు.సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్, డీఆర్డీఓ చిన్న ఓబులేసు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కోటయ్య, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవి నాయక్, జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.



## తాండూర్‌లో మళ్లీ 'పైలేట్ జోరు'!





- ఆరు నెలల రాజకీయ నిశ్శబ్దానికి తెర.. మకాం మార్చిన మాజీ ఎమ్మెల్యే
- వరుస భేటీలు.. కార్యకర్తలతో సమావేశాలు.. ప్రజా సమస్యలపై ఫోకస్
- బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్.. అసలు వ్యూహం ఏమిటన్నదే హాట్ టాపిక్

వికారాబాద్ సెప్టెంబర్ 11 వుదయం బ్యూరో)

తాండూర్ రాజకీయాల్లో మరోసారి కదలిక మొదలైంది. మాజీ ఎమ్మెల్యే పైలేట్ రోహిత్ రెడ్డి నియోజకవర్గంలో మకాం వేసి రాజకీయంగా చురుగ్గా వ్యవహరిస్తుండటం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. కొంత కాలంగా కనిపించిన రాజకీయ నిశ్శబ్దం తర్వాత ఆయన నివాసం, క్యాంప్ కార్యాలయం చుట్టూ నాయకులు, కార్యకర్తల రాకపోకలు పెరగడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**ఆరు నెలల తర్వాత రీఎంట్రీ**

గత కొంతకాలంగా రాజకీయ కార్యక్రమాలకు దూరంగా కనిపించిన పైలేట్ రోహిత్ రెడ్డి ప్రస్తుతం తాండూర్‌లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. కార్యకర్తలు, స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను తెలుసుకుంటున్నారనే చర్చ సాగుతోంది.
గ్రామాల నుంచి పట్టణం వరకు పలువురు కార్యకర్తలు ఆయనను కలుస్తుండటంతో క్యాంప్ కార్యాలయం మళ్లీ రాజకీయ కేంద్రంగా మారుతున్నట్టుగా కనిపిస్తోంది.

**రోజుకో అంశం.. రోజుకో భేటీ**

స్థానిక సమస్యలను ప్రస్తావించడం, కార్యకర్తలతో మాట్లాడటం, నాయకులతో వరుసగా సమావేశాలు నిర్వహించడం వంటి పరిణామాలతో తాండూర్‌లో రాజకీయ వేడి పెరుగుతోంది. ముఖ్యంగా నియోజకవర్గంలోని మండలాల వారీగా పార్టీ పరిస్థితిపై ఆయన ఆరా తీస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.

**ఎక్కడ పార్టీ క్యాడర్ చురుగ్గా ఉంది?**
**ఎక్కడ సమన్వయం అవసరం?**
**ప్రజల్లో ప్రస్తుతం ఏ సమస్యలు ప్రధానంగా చర్చకు వస్తున్నాయి?**
**రాబోయే రోజుల్లో పార్టీ వ్యూహం ఎలా ఉండాలి?**

అనే అంశాలపై దృష్టి సారిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

**క్యాడర్‌లో కొత్త జోష్**

పైలేట్ రోహిత్ రెడ్డి మళ్లీ అందుబాటులోకి రావడంతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతకాలంగా రాజకీయంగా నిశ్శబ్దంగా ఉన్న కార్యకర్తలు మళ్లీ నాయకత్వం చుట్టూ చేరుతున్న దృశ్యం కనిపిస్తోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.
స్థానిక సమస్యలపై స్పందిస్తూ, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న తీరు ఆయన రాజకీయ పునరాక్టివ్‌కు సంకేతమా? అన్న చర్చ మొదలైంది.

**తాండూర్‌పై మళ్లీ పట్టు సాధించే ప్రయత్నమా?**

ఒకప్పుడు తాండూర్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న పైలేట్ రోహిత్ రెడ్డి ప్రస్తుతం మరోసారి నియోజకవర్గంపై దృష్టి కేంద్రీకరించడం ప్రాధాన్యత సంతరించుకుంది.
కేవలం కార్యకర్తలను కలవడానికే ఈ మకాం పరిమితమా?
లేక రాబోయే రాజకీయ పోరాటానికి ఇప్పటి నుంచే గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారా?
పార్టీ క్యాడర్‌ను పూర్తిస్థాయిలో యాక్టివ్ చేయడమే లక్ష్యమా?
లేక భవిష్యత్‌లో కీలక రాజకీయ నిర్ణయానికి ఇది ముందడుగా?
అనే ప్రశ్నలు తాండూర్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

**రాజకీయ పునర్వ్యవస్థీకరణకు సంకేతమా?**

తాండూర్‌లో అధికార పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష శిబిరంలోనూ రాజకీయ పునర్వ్యవస్థీకరణపై చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో పైలేట్ రోహిత్ రెడ్డి నియోజకవర్గంలో ఎక్కువ సమయం కేటాయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.
కార్యకర్తలను ఒకచోటకు చేర్చడం, స్థానిక సమస్యలను రాజకీయ అజెండాగా ముందుకు తీసుకురావడం, నాయకులతో సమన్వయం పెంచడం వంటి చర్యలు భవిష్యత్ రాజకీయాలకు పునాది వేస్తున్నాయా? అన్న చర్చ సాగుతోంది.

**అసలు వ్యూహం ఏమిటి?**

ప్రస్తుతం తాండూర్ రాజకీయాల్లో ప్రధాన ప్రశ్న ఒక్కటే—
**పైలేట్ రోహిత్ రెడ్డి లక్ష్యం ఏమిటి?**
**కేవలం క్యాడర్‌లో ఉత్సాహం నింపడమా?**
**నియోజకవర్గంలో తన రాజకీయ ఉనికిని బలోపేతం చేసుకోవడమా?**
**రాబోయే రాజకీయ పోరాటానికి ముందస్తు సన్నాహాలా?**
**లేక మరింత పెద్ద రాజకీయ అడుగుకు సంకేతమా?**

దీనిపై స్పష్టత రావాలంటే ఆయన తదుపరి రాజకీయ కార్యక్రమాలను పరిశీలించాల్సిందే.
క్యాంప్ చుట్టూ పెరుగుతున్న సందడి
గతంలో రాజకీయ నిశ్శబ్దానికి ప్రతీకగా కనిపించిన పైలేట్ క్యాంప్ కార్యాలయం ఇప్పుడు మళ్లీ నాయకులు, కార్యకర్తల రాకపోకలతో సందడిగా మారుతున్నట్టు కనిపిస్తోంది.
రోజుకో సమావేశం..
**రోజుకో రాజకీయ చర్చ..**
**రోజుకో ప్రజా సమస్య..**
ఇలా పైలేట్ చుట్టూ రాజకీయ కార్యకలాపాలు పెరుగుతుండటంతో తాండూర్‌లో మరోసారి ఆయన హవాపై చర్చ మొదలైంది.

**ఇక ముందు ఏంటి?**

రాబోయే రోజుల్లో పైలేట్ రోహిత్ రెడ్డి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు? ఏ అంశాలను ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్తారు? నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలను ఏ విధంగా సమన్వయం చేస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది.మొత్తానికి.. ఆరు నెలల రాజకీయ నిశ్శబ్దం తర్వాత తాండూర్‌లో పైలేట్ రోహిత్ రెడ్డి మళ్లీ యాక్టివ్ కావడం స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. క్యాంప్ కార్యాలయం చుట్టూ పెరుగుతున్న సందడి భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.తాండూర్ పాలిటిక్స్‌లో ఇప్పుడు ఒకటే ప్రశ్న.."పైలేట్ మళ్లీ వచ్చారా..? లేక కొత్త రాజకీయ ఆటకు రంగం సిద్ధం చేస్తున్నారా?"

## ప్రజా పాలన దినోత్సవానికి ఏర్పాట్లు



గద్వాల, సెప్టెంబర్ 11 (వుదయం కరస్పాండెంట్)

సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వానాలు, జాతీయ పతాకావిష్కరణ, స్టేజి, టెంట్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఫైర్ సేఫ్టీ, వైద్య శిబిరం వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. శాంతి భద్రతలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు సెప్టెంబర్ 17 ప్రాధాన్యతను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పురపాలక సంఘాలు, మండలాల్లోనూ ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించాలని తెలిపారు.

**మట్టి వినాయకులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం పెరిగే అవకాశం ఉన్నందున పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. అధికారులంతా మట్టి వినాయకులను పూజించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. గణేష్ నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కలిసి మట్టి వినాయకులపై రూపొందించిన గోడపత్రికలు, విగ్రహాలను ఆవిష్కరించి, అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో బిఎల్ఓ లు, సూపర్ వైజర్లు, దుబాటులో ఉండాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ సెప్టెంబర్ 11(వుదయం ప్రతినిధి)



మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రచార దినాలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను, తహసీల్దార్లను ఆదేశించారు.
ప్రత్యేక ప్రచార దినాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బి ఎల్ ఓ లు, సూపర్‌వైజర్లు, ఏ ఈ ఆర్ ఓ లు సమన్వయంతో విధులు నిర్వహించాలని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో నిర్ణీత సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన యువతీ యువకులతో పాటు ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన పౌరులను గుర్తించి, వారి నుంచి ఫాం 6 దరఖాస్తులను స్వీకరించి ఓటరు జాబితాలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.మొదటిసారిగా ఓటు హక్కు పొందనున్న యువతలో అవగాహన కల్పించి, వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బిఎల్ఓ లు ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.అనర్హులైన ఓటర్ల వివరాలను నిబంధనల మేరకు పరిశీలించాలిఓటరు జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల పేర్లు లేదా ఇతర కారణాలతో అనర్హులైన ఓటర్ల వివరాలు ఉన్నట్లయితే, నిబంధనల మేరకు పరిశీలించి ఫాం 7 ద్వారా తొలగింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు పూర్తి సమాచారం అందించాలన్నారు. ప్రత్యేక ప్రచార దినాల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఓటరు నమోదు, తొలగింపు, వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. బిఎల్ఓ లు తమ పరిధిలోని ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ, అర్హులైన కొత్త ఓటర్లను గుర్తించడం, ఓటరు జాబితాలో నమోదైన వివరాలను పరిశీలించడం, అవసరమైన సవరణలను నమోదు చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.అలాగే బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏ ఈ ఆర్ ఓ లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రత్యేక ప్రచార దినాల నిర్వహణను సమీక్షించాలని ఆదేశించారు. స్వీకరించిన ఫాం 6, ఫాం 7, ఫాం 8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, ఎటువంటి పెండింగ్ లేకుండా తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షించాలని తెలిపారు.అర్హులైన పౌరులు కొత్త ఓటరు నమోదుకు ఫాం 6,ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపునకు ఫాం 7,ఓటరు వివరాల సవరణకు ఫాం 8 దరఖాస్తులను సమర్పించి, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కోరారు.అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, ఓటరు జాబితా శుద్ధంగా, పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండేలా చూడటం అధికారుల బాధ్యత అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి



నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 11(వుదయం ప్రతినిధి)

నారాయణపేట పట్టణంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బీసీ హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎస్ ఎఫ్ ఐ జిల్లా బృందం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిల్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు.హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రతిరోజూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సరైన సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.ప్రైవేట్ హాస్టళ్లకు అధిక ఫీజులు చెల్లించలేక, బయట గదులకు అద్దెలు భరించలేక పేద, గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బీసీ హాస్టల్‌లో సీట్లు కేటాయించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కనకప్ప తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- దళితులను అవమానిస్తే భారీ మూల్యం తప్పదు
- బీఆర్ఎస్ అరాచకంపై సంగారెడ్డి లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన కార్యక్రమం లో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి వుదయం



అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ..అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు.బీఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళిత వర్గాన్ని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని నిర్మలా జగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.
దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదని, ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలా జగ్గారెడ్డి హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్మెన్ కూన వనితా సంతోష్,సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, నాయకులు జార్జ్ ,కిరణ్ గౌడ్, సంతోష్ , శ్రీకాంత్ , రామ్ చందర్ నాయక్ , శ్రీకాంత్ రెడ్డి, సందీప్ రెడ్డి,భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

వనపర్తి సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)

భూ రీసర్వేను పకడ్బందీగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలి
సర్వేకు వెళ్లే ముందు రైతులకు సమాచారం ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖిల్లాఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ వినోద్ కుమార్‌తో కలిసి గ్రామంలో క్షేత్రస్థాయిలో రీసర్వేలో భాగంగా రోవర్‌ల వినియోగం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో సర్వేయర్లు భూములను కొలుస్తున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వేయర్లకు పలు సూచనలు చేశారు.
సర్వే సమయంలో రైతులకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వాటిని నివృత్తి చేసి నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సాంకేతిక పరికరాలను సక్రమంగా వినియోగిస్తూ భూముల కొలతలు, సరిహద్దులు, వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సర్వేయర్లకు సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, కచ్చితత్వంతో పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సర్పంచ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు భూ రీసర్వే ప్రక్రియలో అధికారులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. రీసర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు అధికారులు, సర్వేయర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని, ఇందుకోసం కావలసిన సాంకేతిక రోవర్లు కొనుగోలు చేయాలని జిల్లా సర్వే అధికారికి కలెక్టర్ సూచించారు. అనంతరం గ్రామంలో రీసర్వే ప్రక్రియపై అవగాహన కోసం అక్కడికి వచ్చిన గ్రామస్తులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. భూ రీసర్వే యొక్క ప్రాముఖ్యతను వారికి వివరించారు. భూముల సరిహద్దులు, కొలతలు, రికార్డుల నవీకరణ తదితర అంశాలకు సంబంధించి గ్రామస్తులు అడిగిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. రీసర్వే ద్వారా భూ వివరాలను మరింత కచ్చితంగా నమోదు చేయడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.
ఈ సందర్భంగా సర్వే ఏడి శ్రీనివాసులు, తహసిల్దార్ సుగుణ, ఎంపీడీవో విజయ సింహారెడ్డి, గ్రామ సర్పంచ్ రవీందర్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేట రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

- బకాయిలు చెల్లించాలి
- ఎఫ్‌సీఐ నిబంధనలపై స్పష్టత ఇవ్వాలి
- వేధింపులు ఆపకపోతే మిల్లింగ్ నిలిపివేస్తాం
- రైస్ మిల్లర్ అండ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్

వుదయం, సిద్దిపేట ప్రతినిధి




జిల్లాలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా రైస్ మిల్లర్ అండ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్ ఛార్జీలు, రవాణా ఖర్చులు, ఇతర బకాయిలను విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకుని నిరసన తెలిపారు. అనంతరం జిల్లా పాలనాధికారి (ఏవో) రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్, కార్యదర్శి కే. బుచ్చయ్య మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ధాన్యం కేటాయింపులు జరిగినా, బియ్యం నిల్వ చేసేందుకు ఎఫ్‌సీఐ నుంచి సకాలంలో స్థలం కేటాయించకపోవడంతో డెలివరీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. డెలివరీ చేయలేకపోయిన మిల్లులను డిఫాల్టర్లుగా పరిగణించి 25 శాతం పెనాల్టీతో పాటు 12 శాతం వడ్డీ విధించడం వల్ల మిల్లర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.2025-26 రబీ సీజన్‌కు 2.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ లక్ష్యం కాగా, ఇప్పటివరకు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని డెలివరీ చేసినట్లు తెలిపారు. రబీ ధాన్యం మిల్లింగ్ సమయంలో ఉష్ణోగ్రతలు 40 నుంచి 50 డిగ్రీల వరకు ఉండటంతో నూకలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, దీంతో 67 శాతం బియ్యం రికవరీ సాధించడం కష్టమవుతుందని వివరించారు.2019-20 నుంచి పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన మిల్లింగ్ ఛార్జీలు, ట్రాన్స్‌పోర్ట్, ఇతర అలవెన్సులు పూర్తిస్థాయిలో విడుదల కాలేదని మిల్లర్లు తెలిపారు. బకాయిలు పేరుకుపోవడంతో మిల్లుల నిర్వహణ, కార్మికుల వేతనాలు చెల్లించడం భారంగా మారిందన్నారు. ఇటీవల సివిల్ సప్లైస్, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం నాణ్యత, మిల్లింగ్ సమయంలో ఏర్పడే సహజ నష్టాల వల్లే కొంత వ్యత్యాసం ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాలని, బకాయిలు విడుదల చేయాలని, ఎఫ్‌సీఐ నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే మిల్లింగ్ ప్రక్రియను నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించారు.రైస్ మిల్లర్ల ధర్నా విషయం తమ దృష్టికి వచ్చిందని జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజా తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి వెంటనే తీసుకువెళ్తామని, తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె. బాలకిషన్‌రావు, సలహాదారు కె. కాశీనాథ్, క్యాషియర్ చి. విష్ణుమూర్తి, సంయుక్త కార్యదర్శి ఆర్. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి చేయూతనివ్వండి

వెల్దండ సెప్టెంబర్ 11 (వు దయం)

బిఆర్ ఎస్ నేత రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ను వెల్దండ మండల బిఆర్ ఎస్ నేతలు కానుగుల జోగయ్య, నిరంజన్, ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా వెల్దండ గ్రామానికి చెందిన సైదులు, యాదయ్య, మరో ఇద్దరి వ్యక్తుల ఇంటి నిర్మాణానికి చేయూతనందించాలని కోరారు ఉప్పల వెంకటేష్ స్పందించి ఇంటి నిర్మాణం చేపడుతున్న నిరుపేదలందరికీ నిర్మాణ సామాగ్రిని తప్పకుండా అందజేస్తామని తెలిపినట్లు తెలిపారు



## పోషకాహార లోప నివారణకు ప్రత్యేక దృష్టి



వనపర్తి సెప్టెంబర్ 11 (వుదయం ప్రతినిధి)

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా అవసరమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా అవసరమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పోషకాహార లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి తగిన వైద్య, పోషకాహార సేవలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పోషకాహారంపై అవగాహన పెంచేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు సుధారాణి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి భువనగిరి ,11.09.2026**



శుక్రవారం అడ్డగూడూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (KGBV)ను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ...కే జీబీవీలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతులపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులు మంచిగా చదువుకొని ఉన్నత సాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం,భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్ వైద్య సేవలను విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి

- **కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**
- **కలెక్టరేట్ లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం**

**సూర్యాపేట, సెప్టెంబర్ 11 వుదయం ప్రతినిధి**

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

అందుబాటులో ఉన్న ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తృతంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి తదితర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత విస్తరించాలని సూచించారు. ఔషధ చికిత్సతో పాటు పంచకర్మ వంటి సాంప్రదాయ చికిత్సా విధానాలను శాస్త్రీయ వైద్య ప్రమాణాల ప్రకారం వినియోగిస్తూ వివిధ రుగ్మతల నివారణ, నియంత్రణకు కృషి చేయాలని ఆయుష్ వైద్యులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయుష్ విధానాల ప్రాధాన్యతను వివరించాలని, అవసరమైన వారికి సలహాలు, మందులు, పంచకర్మ సేవలు అందుబాటులోకి తేవాలన్నారు. ఆయుష్ వైద్యులు మెరుగైన సేవలు అందిస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పి. వెంకట రమణ, ఐఎంఏ ప్రెసిడెంట్ డా. రమేష్ కుమార్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డా. మాధవ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు డా. కోటి రత్నం, డా. నాజియా తబస్సుం, డా. శ్రీశైలం, డా. నాగరాజు, వి. సంజీవ్ రెడ్డి, ఉమా మహేశ్వరి, భార్గవ్, ఆయుష్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం




**ఎన్ సి బి ఈ జిల్లా అధ్యక్షుడు అయితగాని మహేష్**

**సూర్యాపేట, సెప్టెంబర్ 11 వుదయం ప్రతినిధి**

బ్యాంకు ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎన్ సి బి ఈ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అయితగాని మహేష్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బ్యాంకు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. వారానికి 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రస్తుతం 2 శనివారాలు సెలవు ఉండగా, మిగిలిన 2 శనివారాలను కూడా సెలవుగా ప్రకటించాలి. కస్టమర్లకు సేవలు సాయంత్రం 4 గంటలకే ముగిసినా, ఉద్యోగులు రాత్రి 9, 10 గంటల వరకు పని చేస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. 5 రోజుల పనిదినాలు అమలు చేసినా సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ అదనంగా 40 నిమిషాలు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. IBA తో ఒప్పందం జరిగి రెండున్నరేళ్లు దాటినా అమలు చేయకపోవడం బాధాకరం. పనితీరు ఆధారిత ప్రోత్సాహకంలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కింది స్థాయి ఉద్యోగులకు 15 రోజుల జీతం, పైస్థాయి అధికారులకు 365 రోజుల జీతం ప్రోత్సాహకం ఇవ్వడం సరికాదని, లాభాల్లో ఉద్యోగుల శ్రమ కీలకమన్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను బలహీనపరిచి ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోందని, ఉద్యోగులను విభజించి పాలించే విధానాన్ని సహించబోమని స్పష్టం చేశారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మె, అప్పటికీ స్పందించకపోతే నిరవధిక సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో భాస్కర్, ఫణి, వంశీ, నీల శ్రీనివాస్, ఎస్ రామకృష్ణ, అలీం, శ్రీధర్, నరేష్, వెంకటేశ్వర్లు, వికాస్, సురేష్, నవీన్, కిషోర్, కృష్ణ, హేమలత, ప్రియాంక, సౌజన్య, నాగిరెడ్డి, నందన్, ఉమ మహేష్, చిట్టిబాబు, పవన్ శర్మ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



**గంగారం సెప్టెంబర్ 11 వుదయం:**

గంగారం మండల కేంద్రంలోని శుక్రవారం నాడు ప్రపంచ అటవీ అమరవీరుల దినోత్సవం ర్యాలీతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి మరియు కరుణ మాట్లాడుతూ పచ్చని అడవులను, మూగజీవాలను కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన గ్రీన్ వారియర్స్ త్యాగాలు చిరస్మరణీయమైనవి. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ సిబ్బందికి నివాళిగా ప్రతి ఏటా సెప్టెంబర్ 11వ తేదీన 'జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం' దేశంలో అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడటంలో అటవీ శాఖ అధికారుల మరియు సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైనది. ఎర్రచందనం, కలప స్మగ్లర్లు, అక్రమ ఆక్రమణదారులు మరియు వేటగాళ్ల దురాగతాలను ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే క్రమంలో ఎంతోమంది ఫారెస్ట్ ఆఫీసర్లు, బీట్ గార్డులు వీరమరణం పొందారు. ప్రాణాలకు తెగించి అడవులను రక్షించే క్రమంలో అసువులు బాసిన ఆ యోధులను స్మరించుకునేందుకే ఈ దినోత్సవం వేదికవుతోంది. రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతంలోని ఖేజర్లీ గ్రామంలో 1730 సెప్టెంబర్ 11న పవిత్రమైన ఖేజ్రి వృక్షాలను నరకడాన్ని అడ్డుకుంటూ అమృతదేవి బిష్ణోయ్ నేతృత్వంలో 363 మంది ప్రాణత్యాగం చేశారు. చెట్లు, ప్రకృతి రక్షణ కోసం ప్రాణాలర్పించిన ఈ చారిత్రక ఘటనకు ప్రతీకగా కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 11ను జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవంగా అధికారికంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విధి నిర్వహణలో అత్యధికంగా అటవీ సిబ్బంది ప్రాణాలు కోల్పోతున్న దేశాలలో భారతదేశం ముందుండటం,. అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాసరెడ్డి, కరుణ, ఎఫ్ ఎస్ ఓ శ్రీనివాస్,వెంకన్న, పోశాలు,దేవ్ సింగ్, రాములు, ఎఫ్ బి ఓ కార్తీక్, పాపారావు బేస్ క్యాంపు మరియు యానిమల్ ట్రాక్ సిబ్బంది పాల్గొన్నారు.



## అయ్యప్ప దేవాలయంలో మహా మృత్యుంజయ హోమం

**అనంతగిరి సెప్టెంబర్ 11 వుదయం**

తెలంగాణా శబరిమల అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో అమావాస్య సందర్భంగా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహామృత్యుంజయ హోమంలో కోదాడ పట్టణ వాస్తవ్యులు, సీ. హెచ్, మాధవరావు - సీత దంపతులు, సత్యవతి దంపతులు పాల్గొన్నారు, లోక కల్యాణార్థం ప్రతి అమావాస్య కు ఆలయం లో నిర్వహించే ఇట్టి హోమాలు సమస్త అపమృత్యుభయ దోశాల నివారణకు ఉపాకరిస్తాయి నిర్వాహకులు తెలిపారు.

## డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కవిడే సురేష్- బుర్రు అనిల్ కుమార్ ఎన్నిక

**యాదాద్రి భువనగిరి,11/09/2026**




డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభలు చౌటుప్పల్ మండల కేంద్రంలో పద్మశ్రీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరగడం జరిగింది . ఈ మహాసభల్లో డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షుడిగా కవిడే సురేష్, జిల్లా కార్యదర్శిగా బుర్రు అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా వ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించేందుకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని డివైఎఫ్ఐ నూతన కమిటీ కృషి చేయాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా 33 మందితో డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఎన్నిక కాగా అందులో 11 మందితో ఆఫీస్ బేరర్స్ కమిటీ డివైఎఫ్ఐ జిల్లా ఉపాధక్షులుగా –వనం రాజు, ఎండీ ఖాయం, శానుగొండ రాము, పల్లె శివ,దొంతగాని అమరేందర్, జిల్లా సహాయ కార్యదర్శిలుగా పల్లె మధు కృష్ణ, ఎండీ సలీం, చుక్క రజినీకాంత్,మొంగాడి పృథ్వీ,ఎన్నికైంది. జిల్లా కమిటీ సభ్యులుగా ధ్యానబోయిన యాదగిరి, రత్నం శ్రీకాంత్, ఆకుల రాజు, బోదాసు నరేష్, దండని లక్ష్మి పతి, మల్లేపల్లి సతీష్ రెడ్డి, యాసరపు ప్రసాద్, రేగోటి ప్రశాంత్, మెట్టు శ్రవణ్, యస్. డి. అలీమ్,మాదేబోయిన సుందరయ్య, సుధాగాని మల్లేష్, గడ్డం కనకరాజు, ఉపేందర్,జోకు మహేష్, దుబ్బాక జగన్, దొడిగే వెంకటేష్,వడ్డెమాను మధు, జిల్లా కమిటీ కి ఎన్నికైన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవిడే సురేష్, బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని యువత సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. యువతను సంఘటితం చేసి, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు మరియు సామాజిక సమస్యల పరిష్కారానికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. డివైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీకి పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## బిఆర్ఎస్ నాయకులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి

**యాదాద్రి భువనగిరి, 11/09/2026**



ఎర్రవెల్లి బిఆర్ఎస్ నాయకులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి ఎస్సీ సెల్ చైర్మన్ కాకునూరు మహేందర్, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్. ఈనెల 7వ తేదీ రోజున కేసీఆర్ గారి ఫామ్ హౌస్ ఎదుట చావు డప్పు కొట్టడానికి వేలాది సంఖ్యలో కాంగ్రెస్ పార్ట్ సైనికులు మరియు దళితులు వెళ్లడం జరిగింది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నటువంటి స్పీకర్ గారిని వారి తల్లి గారిని అవమానించినటువంటి తాత మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. కానీ బిఆర్ఎస్ పార్టీ చేసిన తప్పును ఒప్పుకోకుండా ఆ పార్టీ ఎమ్మెల్సీ ని వెనుకేసుకొస్తూ యావత్తు దళిత జాతిని అవమానించడమే కాకుండా ఎర్రవెల్లి బిఆర్ఎస్ నాయకులు, అది దళితులు తిరిగిన నేల అని దీనిని వెంటనే శుద్ధి చేయాలని ఒక కార్యక్రమం చేపట్టి యావత్తు దళిత జాతిని మరోసారి వాళ్లు అవమానపరిచి తీవ్ర మనోవేదనకు గురి చేయడం జరిగింది. కావున అట్టి వారిపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారికి చట్టరీత్యా శిక్ష పడేలా చేయాలని భోనగిరి పట్టణ సిఐ గారికి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగారం శంకర్, కొండాపురం పాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో మెరుగ్గా కనీస అభ్యసనా సామర్థ్యాలు

- **ఎంఈఓ బెక్కంటి శ్రీనివాస్ రావు**
- **సుభాష్ నగర్ వాసుల ఆశాజ్యోతి గోపాలకృష్ణ ఎయిడెడ్ పాఠశాల**
- **పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ పూనెం కృష్ణ ప్రశంసలు**

**భద్రాచలం, 11/9/26 వుదయం ప్రతినిధి**



భద్రాచలం సుభాష్ నగర్ కాలనీలో గత మూడు దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందిస్తూ గోపాలకృష్ణ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల స్థానికుల ఆశాజ్యోతిగా నిలుస్తోందని భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ అన్నారు. విద్య ప్రతి ఒక్కరి హక్కు అనే భావనతో పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. సుభాష్ నగర్ ప్రాంతంలోని పేద, బడుగు వర్గాల విద్యార్థులకు విద్యాబోధన అందించాలనే సంకల్పంతో సుమారు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ పాఠశాల నేడు అనేక ప్రత్యేకతలను సొంతం చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని వార్డు సభ్యుడు కావూరి గోపి తెలిపారు. 1995 సంవత్సరంలో ఒక చిన్న గుడిసెలో ప్రారంభమైన ఈ పాఠశాల అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నేడు అన్ని మౌలిక వసతులతో కూడిన పాఠశాలగా రూపుదిద్దుకోవడం వెనుక ఉపాధ్యాయుల అంకితభావం, కాలనీ వాసుల సహకారం, దాతల ప్రోత్సాహం ఉన్నాయని ఆయన వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని వేంపాటి ఉషారాణి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిరంతరం చేస్తున్న కృషికి గుర్తింపుగా 2022లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని తెలిపారు. అనంతరం 2023లో రాష్ట్ర స్థాయిలో కూడా గుర్తింపు లభించి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ఆమె అవార్డు స్వీకరించడం పాఠశాలకే గర్వకారణమని వార్డు సభ్యుడు గోపి అన్నారు. ప్రధానోపాధ్యాయురాలి కృషిని ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షధ్వానాల మధ్య అభినందించారు. 2022లో పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయిని సమన్వయంతో ఐటీసీ పేపర్‌బోర్డ్స్ సంస్థ అందించిన ఆర్థిక సహాయంతో నూతన పక్కా భవన నిర్మాణం చేపట్టారు. పాఠశాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ గోడను కూడా నిర్మించడంతో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం ఏర్పడింది. ప్రస్తుతం పాఠశాల ఆధునిక వసతులతో ఆకట్టుకునేలా రూపుదిద్దుకుని జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా నిలుస్తోందని గ్రామస్తులు నూకరత్నం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ చేతుల మీదుగా పాఠశాలలోని విద్యార్థులందరికీ నూతన ఏకరూప దుస్తులను అందజేశారు. విద్యార్థులు నూతన ఏకరూప దుస్తులతో సందడి చేశారు. విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. అనంతరం పాఠశాలకు విచ్చేసిన గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణను ప్రధానోపాధ్యాయిని వేంపాటి ఉషారాణి, మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా శాలువాతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు సభ్యుడు కావూరి గోపి, మండల ఏపీఎం, టైలర్ దాసు, పాఠశాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపికృష్ణ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు నూకరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్ట్‌లో త్రిపురవరం పాఠశాలకు మొదటి ర్యాంకు

**అనంతగిరి సెప్టెంబర్ 11 వుదయం**

సూర్యాపేట జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాల పరిశీలన కోసం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బేస్‌లైన్ టెస్ట్‌లో అనంతగిరి మండల పరిధిలోని పాఠశాలలు విశేష ప్రతిభ చాటాయి. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన మొత్తం 192 ఎఫ్ఎల్ఎన్ కాంపిటెంట్ పాఠశాలల్లో అనంతగిరి మండలం ఎంపీపీఎస్ హెచ్.డబ్ల్యూ త్రిపురవరం పాఠశాల 59.82 శాతం సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ఇదే మండల పరిధిలోని ఎంపీపీఎస్ వాయిల సింగారం పాఠశాల 30.06 శాతంతో 11వ ర్యాంకు, ఎంపీపీఎస్ పాలవరం తండా పాఠశాల 22.32 శాతంతో 39వ ర్యాంకు సాధించి మండల ఖ్యాతిని చాటాయి. జిల్లా స్థాయిలో త్రిపురవరం పాఠశాల మొదటి ర్యాంకు సాధించడంతో అనంతగిరి మండల విద్యాధికారి తల్లాడ శ్రీనివాసరావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను అభినందించడం జరిగింది ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



## చండూరులో కోలాహలంగా ఎస్జీఎఫ్ఐ క్రీడా ఎంపికలు

**ఘనంగా ప్రారంభించిన ఎంఈఓ సుధాకర్ రెడ్డి, హెచ్ఎం కోటీశ్వర్ రెడ్డి**

**చండూరు, సెప్టెంబర్ 11(వుదయం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) కార్యక్రమంలో భాగంగా చండూరు మండల స్థాయి పాఠశాలల బాలబాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోలాహలంగా ప్రారంభమయ్యాయి. స్థానిక హెచ్ఎమ్ ఏ. కోటీశ్వర్ రెడ్డి, మండల విద్యాధికారి (MEO) వి.సుధాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కత్తిరించి ఈ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు (PDs) జి.కరుణాకర్ రెడ్డి, అంజయ్య, సునీత, సాయిరాంల ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే నియోజకవర్గ స్థాయి పోటీల్లో చండూరు మండలం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చండూరును కరువు మండలంగా ప్రకటించాలి

**ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేసిన సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్**

**చండూరు, సెప్టెంబర్ 11(వుదయం):**



చండూరు మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆర్‌డీఓ శ్రీదేవికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కొమ్ము గణేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో మండలంలో సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరుబావులపై ఆధారపడిన రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కనీసం పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో అధికారులతో పరిశీలన జరిపించాలని, చండూరును కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు సమగ్ర సర్వే ద్వారా తగిన నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## నల్గొండ నెక్స్టా షోరూమ్ లో సరికొత్త బాలెనో ఘన ఆవిష్కరణ



**పవన్ మోటార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి**

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 11**

నల్గొండ పట్టణ కేంద్రంలో నెక్స్టా పవన్ మోటార్స్ షోరూమ్ లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ది స్టన్నింగ్ న్యూ బాలెనో" కారును నేడు ఘనంగా ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారుతి సుజుకి నుండి సౌత్ ఈస్ట్ జోన్ సి బి హెచ్ యోగేష్ గుప్తా, రీజినల్ మేనేజర్ నెక్స్టా గణేష్ గుట్ట, క్షితిజ్ కుమార్ చీఫ్ మేనేజర్, ఎస్ బి ఐ నల్గొండ పవన్ మోటార్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి టీఎస్ ఎం ప్రతీక్ గుప్తా కంపెనీ సీసీఓ కె రవి రెడ్డి వీపీ ఎం రవీందర్ పాల్గొని, నూతన బాలెనో కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి చంద్ర పవన్ రెడ్డి మాట్లాడుతూ, నెక్స్టా అంటేనే స్టైల్, టెక్నాలజీ, సోఫిస్టికేషన్. ఈ కొత్త బాలెనోలో అత్యాధునిక ఫీచర్లు, ప్రీమియం డిజైన్, భద్రతా ప్రమాణాలు ఉన్నాయి. నల్గొండ వినియోగదారుల నుండి దీనికి అద్భుతమైన స్పందన వస్తుందని ఆశిస్తున్నాము" అని తెలిపారు. కొత్త బాలెనో డార్క్ బ్లూ గ్రీన్ షేడ్ లో ఆకర్షణీయంగా ఉండి, చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ వేడుకకు నెక్స్టా సిబ్బంది, వినియోగదారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నూతన బాలెనో టెస్ట్ డ్రైవ్ మరియు బుకింగ్స్ నెక్స్టా నల్గొండ పవన్ మోటార్స్ షోరూమ్ లో అందుబాటులో ఉన్నాయని షోరూం మేనేజర్ ఎండీ జానీ పాషా తెలిపాడు.

## ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాలు



**సత్తుపల్లి సెప్టెంబర్ 11 ( వుదయం ప్రతినిధి )**

సత్తుపల్లి మండల పరిధిలోని రుద్రాక్ష పల్లి సెక్టార్ అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పప్పు దాన్యములు ఎక్కువ గా తినాలని పప్పులలో మాంసకృతులు ఉంటాయని, శరీర నిర్మాణం కి ఉపయోగపడతాయాని ఆకు కూరలు కూరగాయలలో విటమిన్లు ఉంటాయని ఇవి శరీర రక్షకలు వ్యాధి బారిన పడకుండా కాపాడతాయాని పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ , తల్లులు పిల్లలు అంగన్వాడీ టీచర్ లు , లక్షి , సరిత పాల్గొన్నారు.

## కందిపాడులో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**ఆదివాసీ గ్రామాల సంక్షేమానికి పోలీసుల కృషి**

**చర్ల, సెప్టెంబర్ 11: (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో చర్ల మండలంలోని ఆదివాసీ వలస గ్రామమైన కందిపాడులో శుక్రవారం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామాన్ని సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను, గ్రామ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడవద్దని డీఎస్పీ గ్రామస్తులకు సూచించారు. గుడుంబా తయారీ, విక్రయాలు, వినియోగం వల్ల కుటుంబాలపై, ముఖ్యంగా యువతపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని వివరించారు. అక్రమ గుడుంబా తయారీ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలోని యువత, చిన్నారులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని డీఎస్పీ సూచించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ అరుణ్‌కుమార్, చర్ల సీఐ రాజువర్మ స్థానిక విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. మారుమూల ఆదివాసీ గ్రామాల ప్రజలకు పోలీసు శాఖ అండగా ఉంటుందనే భరోసా కల్పించడం కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత రాణి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాలు



**సత్తుపల్లి సెప్టెంబర్ 11 ( వుదయం ప్రతినిధి)**

వేంసూరు మండల పరిధిలోని రాయుడుపాలెం గ్రామపంచాయతీ లోని కొత్తూరు అంగన్వాడీ సెంటర్ లో పోషణ మాసం కార్యక్రమం ఐసిడిఎస్ఎస్ సూపర్వైజర్ వసంత రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పప్పు దాన్యములు ఎక్కువ గా తినాలని పప్పులలో మాంసకృతులు ఉంటాయని, శరీర నిర్మాణం కి ఉపయోగపడతాయాని ఆకు కూరలు కూరగాయలలో విటమిన్లు ఉంటాయని ఇవి శరీర రక్షకలు వ్యాధి బారిన పడకుండా కాపాడతాయాని పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం కు గ్రామ సర్పంచ్ ఇందిరా , మదర్స్, పిల్లలు అంగన్వాడీ టీచర్స్ పద్మ, నాగలక్ష్మి , సరిత పాల్గొన్నారు.

## గాయత్రీ కళాశాలలో ఘనంగా ప్రెషర్స్ డే

**యాదాద్రి భువనగిరి, 11/09/2026**



పట్టణంలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం స్థానిక వైఎస్ఆర్ గార్డెన్లో ఘనంగా ప్రెస్సర్స్ పార్టీ జరుపుకున్నారు ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎస్ బి మల్లేశం మాట్లాడారు విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వేణు రెడ్డి నవీన్ పట్టాభి రమేష్ స్టీఫెన్ పావని సత్యనారాయణ శ్రావణి నాగయ్య మురళి శివరంజని ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## నవీన్‌రెడ్డి హౌస్ అరెస్ట్.. ప్రశ్నించే గొంతుకు కళ్లెం!

**మునగాల, సెప్టెంబర్ 11 (వుదయం):**



కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసనకు సిద్ధమయ్యారనే కారణంతో మునగాల మండల కేంద్రానికి చెందిన టీఆర్ఎస్ యువ నాయకుడు కుప్పిరెడ్డి నవీన్‌రెడ్డిని మునగాల పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఎలాంటి నిరసన కార్యక్రమం చేపట్టకముందే ఇంటికే పరిమితం చేయడంపై టీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదని, నవీన్‌రెడ్డిని అరెస్ట్ చేసినంత మాత్రాన తమ గొంతును అణచలేరని టీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు.

ఉదయం



# చక్కని ఆరోగ్యం

## కంటి మందు చుక్కల సీసాలను ఎక్కువ రోజుల పాటు ఉపయోగిస్తున్నారా..

కళ్లలో వేసుకునే మందు చుక్కల విషయంలో చాలా మంది సీసాపై ఉన్న గడువు తేదీని మాత్రమే చూసి వాటిని నెలల తరబడి ఉపయోగిస్తుంటారు. అయితే సీసాను ఒకసారి తెరిచిన తర్వాత పరిస్థితి మారుతుంది. సాధారణంగా అనేకసార్లు ఉపయోగించే కంటి మందు చుక్కల సీసాను తెరిచిన 28 నుంచి 30 రోజుల్లోపు పడేయాలని నిపుణులు సూచిస్తున్నారు. సీసా తెరిచిన వెంటనే దాని లోపల ఉన్న ద్రావణం గాలి, పరిసర వాతావరణం, చేతులు లేదా కనురెప్పలు, వెంట్రుకలతో తాకే అవకాశం ఉండటంతో కలుషితమయ్యే ప్రమాదం పెరుగుతుంది. సాధారణంగా కంటి మందు చుక్కలను సీసా తెరిచిన ఒక నెల తర్వాత, సీసాలో మందు మిగిలి ఉన్నా, ముద్రించిన గడువు తేదీ ఇంకా చాలా దూరంలో ఉన్నా ఉపయోగించకూడదని సూచిస్తున్నారు. అయితే సంరక్షక పదార్థాలు లేని ఒకసారి మాత్రమే ఉపయోగించే చిన్న సీసాలను తెరిచిన 24 గంటల్లోపు పడేయాలి. కొన్ని బ్రాండ్లు వాటిని ఉపయోగించిన వెంటనే పడేయాలని కూడా సూచిస్తాయి.



కంటి మందు సీసాను తెరిచిన తర్వాత గాలి, పరిసర వాతావరణానికి ద్రావణం గురవుతుంది. మందు సీసా చివరి భాగం కనురెప్పలు లేదా కంటి వెంట్రుకలకు తగిలితే బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు సీసాలోకి చేరే అవకాశం ఉంటుంది. దీంతో మందులోని సంరక్షక వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుంది. ఫలితంగా మందు ప్రభావం తగ్గిపోతుంది. అంటే కంటికి వేసే చికిత్స ఆశించినంతగా పనిచేయదు. అలాగే కలుషితమైన కంటి మందు చుక్కలను ఉపయోగించడం వల్ల కంటిలో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంటుంది. కండ్లకలక వంటి సాధారణ ఇన్ఫెక్షన్లతోపాటు, కంటిలోని కార్నియాకు ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం కూడా ఉంటుంది. అరుదైన తీవ్రమైన సందర్భాల్లో ఇది చూపుపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. మందు ప్రభావం తగ్గడం ఒక సమస్య అయితే, సూక్ష్మజీవుల కలుషితంతో వచ్చే కంటి ఇన్ఫెక్షన్ మరింత ప్రమాదకరమైన సమస్యగా మారుతుంది. ముఖ్యంగా గ్లాకోమా ఉన్నవారు ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. కలుషితమైన లేదా కాలక్రమేణా ప్రభావం తగ్గిన మందు వాడితే కంటి ఒత్తిడి సరిగ్గా నియంత్రణలో లేకపోయినా అది వెంటనే గుర్తించదు. దీంతో చికిత్స సరిగా కొనసాగకపోయే ప్రమాదం ఉంటుంది. కంటి మందు సీసాపై ముద్రించిన గడువు తేదీని కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఆ తేదీ అనేది సీసా తెరవకుండా, సూచించిన నిల్వ పరిస్థితుల్లో ఉంచినప్పుడు మందు స్థిరత్వం, శుభ్రతకు సంబంధించిన గడువును సూచిస్తుంది. అంటే సీసా ఎప్పుడూ తెరవకపోతే ఆ తేదీ వరకు దాన్ని ఉపయోగించవచ్చని అర్థం. కానీ ఒకసారి సీసా తెరిచిన తర్వాత తెరిచినప్పటి నుంచి లెక్కించే గడువు వర్తిస్తుంది. సాధారణంగా అనేకసార్లు ఉపయోగించే సీసాలకు ఇది ఒక నెల కాగా, ఒకసారి మాత్రమే ఉపయోగించే చిన్న సీసాలకు 24 గంటలు మాత్రమే ఉంటుంది.

అందుకే కంటి మందు సీసాను తెరవకముందే దానిపై ఉన్న గడువు తేదీని పరిశీలించడం మంచిది. సీసా తెరిచిన తేదీని వెంటనే దానిపైనే రాసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది. ఇలా చేస్తే తెరిచి ఎన్ని రోజులు అయిందో గుర్తుంచుకోవడానికి జ్ఞాపకశక్తిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. తెరిచిన తేదీ నుంచి ఒక నెల పూర్తయిన తర్వాత సాధారణ బహుళ వినియోగ కంటి చుక్కల సీసాను పడేయాలి. కంటి మందు చుక్కలను ఉపయోగించే సమయంలో సీసా చివర భాగం కంటికి, చర్మానికి లేదా ఇతర ఏ ఉపరితలానికీ తగలకుండా చూసుకోవాలి. సీసా చివర భాగం తాకితే సూక్ష్మజీవులు మందులోకి చేరే అవకాశం ఉంటుంది. అందువల్ల మందు వేసేటప్పుడు కంటికి దగ్గరగా తీసుకెళ్లినా సీసా చివర భాగం కంటిని తాకకుండా జాగ్రత్తపడాలి. సంరక్షక పదార్థాలు లేని ఒకసారి మాత్రమే ఉపయోగించే కంటి మందు చిన్న సీసాలను 30 రోజుల పాటు ఉంచి ఉపయోగించడం సురక్షితం కాదు. వాటిని తెరిచిన 24 గంటల్లోపు పడేయాలి. కొన్ని సందర్భాల్లో తయారీదారు వెంటనే పడేయాలని సూచిస్తారు. కాబట్టి ఆయా మందులపై ఉన్న సూచనలను కూడా పాటించాలి.

కంటి మందులు సాధారణ మందుల్లా భావించి ఎక్కువ కాలం నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు ఉపయోగించడం సరికాదు. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే సీసా తెరిచిన తేదీని గుర్తుంచుకోవడం, సరైన సమయంలో మందును మార్చడం, సీసా చివర భాగం ఎక్కడా తగలనివ్వకపోవడం చాలా ముఖ్యం. కంటి మందు చుక్కలను ఉపయోగించే విషయంలో పరిశుభ్రత, నిల్వ విధానం, తెరిచిన తర్వాత ఉపయోగించే గడువు వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలి.

## సాయంత్రం సమయంలో స్నాక్స్ తినాలని ఉంటే..

సాయంత్రం 5 గంటల సమయంలో ఆకలి వేయగానే చాలామంది వెంటనే ప్యాకెట్ స్నాక్స్, బిస్కెట్లు లేదా ఇతర ప్రాసెస్డ్ ఆహార పదార్థాల వైపు మొగ్గుచూపుతుంటారు. అయితే ఆకలిని తీర్చుకోవడానికి తప్పనిసరిగా ప్యాకెట్ ఫుడ్‌నే ఆశ్రయించాల్సిన అవసరం లేదు. మన ఇంటి వంటగదిలోనే ప్రోటీన్, ఫైబర్‌తో పాటు శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఎన్నో ఆరోగ్యకరమైన స్నాక్స్ ఉన్నాయి. వీటిని సులభంగా తయారు చేసుకోవచ్చు. వేయించిన శనగలు (భునా చనా) సాయంత్రం ఆకలి తీర్చుకోవడానికి మంచి ఎంపిక. ఇవి కరకరలాడుతూ ఉండడమే కాకుండా ప్రోటీన్, ఫైబర్‌కు మంచి వనరు. ఎక్కువ సేపు కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో ఇవి సహాయపడతాయి. ఆఫీసులో లేదా ఇంట్లో చిన్న మొత్తంలో గాలి చొరబడని డబ్బాలో పెట్టుకుని తినవచ్చు. రుచికి కొద్దిగా నల్ల ఉప్పు, వేయించిన జీలకర్ర పొడి లేదా కారం కలుపుకోవచ్చు. అయితే పెద్ద ప్యాకెట్ నుంచి నేరుగా తినకుండా, ముందుగానే చిన్న పరిమాణంలో తీసుకోవడం మంచిది.



మఖానా, పల్లీలతో తయారు చేసే చాట్ కూడా సాయంత్రం వేళకు రుచికరమైన, పోషకమైన స్నాక్‌గా ఉపయోగపడుతుంది. ప్యాకెట్‌లో దొరికే ఎక్కువ ఉప్పు కలిగిన స్నాక్స్‌కు బదులుగా వేయించిన మఖానాను తీసుకోవచ్చు. వేరుశనగలు ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. వేయించిన మఖానా, వేరుశనగలను కొద్దిగా నెయ్యి, అవసరమైన మసాలాలతో కలిపి సులభంగా చాట్‌లా తయారు చేసుకోవచ్చు. అయితే ఈ కాంబినేషన్‌ను ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది కాబట్టి పరిమాణంపై నియంత్రణ అవసరం. ఒక గుప్పెడు సరిపోతుంది. ఆకలి ఎక్కువగా ఉన్నప్పుడు పనీర్ ముక్కలు కూడా సులభమైన ప్రోటీన్ రిచ్ స్నాక్‌గా ఉపయోగపడతాయి. పనీర్‌ను నేరుగా తినవచ్చు లేదా తవాపై స్వల్పంగా వేడి చేసి, కొద్దిగా మసాలా కలుపుకోవచ్చు.

## తడినేలలపై జారి పడడం సహజం.. ఈ జాగ్రత్తలు పాటిస్తే సేఫ్..

వర్షాకాలంలో తడి నేలలు, జారే రోడ్లు, గుంతలు, అసమానమైన ఉపరితలాల కారణంగా జారిపడి గాయపడే ప్రమాదం పెరుగుతుంది. ముఖ్యంగా కాలు మెలిక పడటం లేదా చీలమండ తిరగడం సాధారణంగా కనిపించినప్పటికీ, దాన్ని చిన్న గాయంగా నిర్లక్ష్యం చేయకూడదు. కొన్నిసార్లు ఇలాంటి గాయం చీలమండను పట్టి ఉంచే లిగమెంట్లకు నష్టం కలిగించడంతోపాటు ఎముక విరిగేందుకు కూడా కారణమవుతుంది. నొప్పి, వాపు కొనసాగుతున్నప్పటికీ సాధారణ పనులు చేసుకోవడం వల్ల గాయం మరింత తీవ్రం అవుతుంది. అందుకే గాయం తీవ్రతను గుర్తించి, అవసరమైన సమయంలో వైద్య సహాయం తీసుకోవడం పూర్తిస్థాయి కోలుకోవడానికి సహాయపడుతుంది. చీలమండలోని లిగమెంట్లు ఎక్కువగా సాగిపోవడం లేదా చిట్లిపోవడం వల్ల సాధారణంగా స్ప్రెయిన్ ఏర్పడుతుంది. కాలు అకస్మాత్తుగా మెలిక తిరగడం, పడిపోవడం లేదా పాదం ఒకవైపు తిరగడం వంటి సందర్భాల్లో ఇది సంభవిస్తుంది. ఈ గాయం స్వల్పంగా లిగమెంట్ సాగిపోవడం నుంచి పూర్తిగా చిట్లిపోవడం వరకు వివిధ స్థాయుల్లో ఉండే అవకాశం ఉంటుంది. అయితే బలమైన దెబ్బ లేదా పడిపోవడం వల్ల చీలమండ ఎముక విరిగే అవకాశం కూడా ఉంటుంది. తీవ్రమైన నొప్పి, అధిక వాపు లేదా గాయపడిన కాలిపై బరువు వేయలేకపోవడం వంటి లక్షణాలను కేవలం సాధారణ మెలికగా భావించకూడదు. చీలమండ స్ప్రెయిన్, ఫ్రాక్చర్ రెండింటిలోనూ నొప్పి, వాపు, నడవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల వైద్య పరీక్ష లేకుండా ఈ రెండింటి మధ్య తేడాను కచ్చితంగా గుర్తించడం కష్టం. తీవ్రమైన నొప్పి, ఎక్కువగా వాపు రావడం, చీలమండ ఆకారం మారడం, ఎముకపై తాకినప్పుడు తీవ్రంగా నొప్పి రావడం లేదా కాలిపై బరువు వేయలేకపోవడం వంటి వాటిని చూసి చాలా మంది ఫ్రాక్చర్ గా అనుమానిస్తారు. చీలమండ బయటివైపు ఉండే లిగమెంట్లు కూడా గాయపడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా యాంటీరియర్ టాలోఫైబ్యులర్ లిగమెంట్ (ఏటీఎఫ్ఎల్), కాల్కేనియోఫైబ్యులర్ లిగమెంట్ (సీఎఫ్ఎల్) దెబ్బతినే అవకాశాలు ఉంటాయి. ఇలాంటి లిగమెంట్ గాయాలు ఎక్స్‌రేలో తప్పనిసరిగా కనిపించవు.



## దేశంలో పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య వ్యాధి..

భారత్‌లో ఊబకాయం, మధుమేహం, ఇతర మెటబాలిక్ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఫ్యాటీ లివర్ వ్యాధిని ఇప్పుడు కేవలం కాలేయానికి సంబంధించిన సమస్యగా లేదా పెద్ద నగరాల్లో మాత్రమే కనిపించే అనారోగ్యంగా భావించలేం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా చాలా మందిలో ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించకుండానే ఈ వ్యాధి అభివృద్ధి చెందుతుండటంతో, ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్ మరింత కీలకంగా మారాయి. ఫ్యాటీ లివర్ వ్యాధిని ప్రస్తుతం మెటబాలిక్ డిస్‌ఫంక్షన్–అసోసియేటెడ్ స్టియాటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఏఎస్ఎల్‌డీ)గా పిలుస్తున్నారు. ఈ వ్యాధి అధికంగా మద్యం తీసుకునే వారికే వస్తుందనుకోవడం తప్పు. ఊబకాయం, టైప్–2 మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో కూడా ఇది బలమైన సంబంధం కలిగి ఉంటుంది.



దేశంలో ఈ పరిస్థితులు పెరుగుతుండటంతో ఫ్యాటీ లివర్ సమస్య కూడా ఎక్కువవుతోంది. ప్రస్తుతం ప్రతి ముగ్గురిలో ఒకరికి ఫ్యాటీ లివర్ ఉండే అవకాశం ఉందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఎంఏఎస్ఎల్‌డీ సాధారణంగా చాలా సంవత్సరాల పాటు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. ప్రారంభ దశలో ప్రత్యేకమైన లక్షణాలు కనిపించకపోవడంతో చాలామందికి తమకు ఈ సమస్య ఉన్న విషయం తెలియదు. సాధారణ ఆరోగ్య పరీక్షలు లేదా ఇతర కారణాలతో వైద్య పరీక్షలు చేయించుకున్న సమయంలోనే కాలేయంలో మార్పులు బయటపడుతున్నాయి. అయితే చికిత్స లేకుండా వ్యాధి కొనసాగితే కాలేయంలో వాపు, మచ్చలు ఏర్పడటం, సిరోసిస్, కాలేయ వైఫల్యం, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. కొన్ని సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరమయ్యే పరిస్థితి కూడా వచ్చే అవకాశం ఉంటుంది.

## సౌందర్య సంరక్షణకూ..!

తేనె ఆరోగ్యానికే కాదు.. సౌందర్య పరిరక్షణకూ ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు దీనిలో ఉన్న యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలే కారణమంటున్నారు.



తేనె పూయడం వల్ల పెదాలు పొడిబారకుండా ఉంటాయి. ఇది చర్మకాంతిని పెంచడమే కాకుండా చర్మంలో తేమ నిలిచి ఉండేలా చేసి చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. చక్కటి మాయిశ్చరైజర్‌గానూ ఉపయోగపడుతుంది. తేనె జుట్టుకు సహజ కండిషనర్‌గా పనిచేస్తుంది. ఈ క్రమంలో తేనె, ఆలివ్ ఆయిల్ కలిపి జుట్టుకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేయడం వల్ల జుట్టు మెరిసే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు.

## మహిళల్లో వస్తున్న లీన్ పీసీఓఎస్ సమస్య.. అంటే ఏమిటి..

సాధారణంగా పీసీవోఎస్ అంటే అధిక బరువు, క్రమం తప్పిన రుతుక్రమం, మొటిమలు, అవాంఛిత రోమాలు వంటి లక్షణాలు గుర్తుకొస్తాయి. అయితే శరీర బరువు సాధారణ స్థాయిలో ఉన్న మహిళల్లోనూ ఈ సమస్య కనిపించే అవకాశం ఉంటుంది. దీనినే లీన్ పీసీఓఎస్ గా పిలుస్తారు. పీసీఓఎస్ కేవలం రుతుసంబంధమైన సమస్య మాత్రమే కాకుండా శరీరంలోని జీవక్రియలపై కూడా ప్రభావం చూపుతుందనే కారణంతో గత మేలో దీనికి పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఓవేరియన్ సింద్రోమ్ గా పేరు మార్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఎనిమిది మంది మహిళల్లో ఒకరికి ఈ సమస్య ఉన్నట్లు అంచనా. భారత్‌లో సుమారు 11.3 శాతం మంది మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. సాధారణ శరీర బరువు ఉన్న మహిళల్లో కూడా రుతుక్రమం సక్రమంగా రాకపోవడం, తరచూ రుతుస్రావం మిస్ అవడం, రుతుస్రావం వచ్చినప్పుడు అధిక రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శరీరంలో పురుష హార్మోన్ల స్థాయిలు పెరగడం వల్ల ముఖం, శరీరంపై అధికంగా రోమాలు పెరగడం, మొటిమలు, చర్మం జిడ్డుగా మారడం, జుట్టు పలుచబడటం లేదా రాలిపోవడం వంటివి కూడా ఉంటాయి. అండోత్సర్గం సక్రమంగా జరగకపోవడం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు, వంధ్యత్వ సమస్యలు కూడా కనిపించే అవకాశముంటుంది. పీసీఓఎస్‌కు సంబంధించిన జీవక్రియ సమస్యల్లో ఇన్సులిన్ నిరోధకత ముఖ్యమైనది. దీని వల్ల రక్తంలో చక్కెరను నియంత్రించడంలో శరీరానికి ఇబ్బంది ఏర్పడుతుంది. ముందస్తు మధుమేహం లేదా టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం పెరిగే వీలు ఉంది. మెడ, చంకలు వంటి ప్రాంతాల్లో చర్మం నల్లబడటం, చర్మంపై చిన్న మాంసపు ముద్దలు రావడం, అధికంగా బరువు పెరగడం లేదా బరువు తగ్గడం కష్టంగా మారడం వంటి సమస్యలు కూడా ఉంటాయి. కొందరిలో అలసట, మానసిక స్థితిలో మార్పులు, ఆందోళన, నిరాశ, నిద్ర సమస్యలు, కటి ప్రాంతంలో అసౌకర్యం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. లీన్ పీసీఓఎస్ అంటే అధిక బరువు లేకపోయినా పీసీఓఎస్‌కు సంబంధించిన హార్మోన్ల, జీవక్రియ మార్పులు ఉండే పరిస్థితి. పీసీఓఎస్ ప్రతి మహిళలో ఒకే విధంగా కనిపించదు.



కొందరిలో రుతుక్రమం సక్రమంగా రాకపోవడం, మొటిమలు, ముఖం లేదా శరీరంపై అధిక రోమాలు, జుట్టు పలుచబడటం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. మరికొందరిలో కొన్ని లక్షణాలు మాత్రమే స్వల్పంగా ఉండటంతో సమస్యను గుర్తించకుండా సంవత్సరాల పాటు ఉండే అవకాశం ఉంది. శరీర బరువు ఒక్కటే పీసీఓఎస్‌ను నిర్ణయించే అంశం కాదు. సన్నగా కనిపించే మహిళల్లో కూడా ఇన్సులిన్ నిరోధకత ఉండే అవకాశం ఉంది. ఇన్సులిన్‌కు శరీరం సరిగ్గా స్పందించనప్పుడు దాన్ని భర్తీ చేసేందుకు శరీరం మరింత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ అధిక ఇన్సులిన్ స్థాయిలు పురుష హార్మోన్ల ఉత్పత్తిని పెంచి, సాధారణ అండోత్సర్గానికి ఆటంకం కలిగిస్తాయి. ఫలితంగా రుతుక్రమం సక్రమంగా రాకపోవడం, మొటిమలు, ముఖం లేదా శరీరంపై అధిక రోమాలు పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇన్సులిన్ నిరోధకత ఉన్నా ప్రతి ఒక్కరిలో స్పష్టమైన లక్షణాలు కనిపించవు.

## హెయిర్ స్పా చేయించుకుంటే జుట్టు సమస్యల నుంచి బయట పడవచ్చా..

జుట్టు రాలడం సమస్యతో బాధపడేవారు తరచూ హెయిర్ స్పా వంటి సౌందర్య చికిత్సలను ఆశ్రయిస్తుంటారు. జుట్టుకు పోషణ అందించడం, మూలాలను బలోపేతం చేయడం, రక్త ప్రసరణ మెరుగుపరచడం, జుట్టు రాలడాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు హెయిర్ స్పా వల్ల కలుగుతాయని ప్రచారం జరుగుతోంది. అయితే హెయిర్ స్పా నిజంగా జుట్టు రాలడాన్ని ఆపగలదా అనే ప్రశ్నకు సమాధానం సాధారణంగా లేదు అనే చెప్పాలి. సాధారణ హెయిర్ స్పా ప్రధానంగా జుట్టును శుభ్రపరచడం, కండిషనింగ్ చేయడం, జుట్టు మృదువుగా, మెరుపుగా కనిపించేలా చేయడం వంటి సౌందర్య ప్రయోజనాల కోసం చేస్తారు. సాధారణ హెయిర్ స్పాలో షాంపూతో జుట్టును శుభ్రం చేయడం, కండిషనింగ్ మాస్క్ లేదా క్రీమ్ వేయడం, తలకు మసాజ్ చేయడం, ఆవిరి లేదా వేడి చికిత్స ఇవ్వడం, చివరగా జుట్టును కడిగి కండిషనింగ్ చేయడం, ఆరబెట్టడం లేదా స్టైలింగ్ చేయడం వంటి ప్రక్రియలు ఉంటాయి. పొడిబారిన, రసాయనాల వల్ల దెబ్బతిన్న జుట్టును ఇవి మృదువుగా, సులభంగా దువ్వుకునేలా చేస్తాయి. జుట్టు విరిగిపోవడం తగ్గితే, జుట్టు రాలడం కూడా తగ్గినట్లు కనిపిస్తుంది. అయితే జుట్టు రాలడం, జుట్టు విరిగిపోవడం రెండూ ఒకటే కావు. జుట్టు రాలడం అంటే జుట్టు కుదురు నుంచి బయటకు రావడం. జుట్టు విరిగిపోవడం అంటే జుట్టు పొడవులోని ఏదో ఒక భాగంలో వెంట్రుక తెగిపోవడం. కండిషనింగ్ వంటి చికిత్సలు జుట్టు విరిగిపోవడాన్ని కొంతవరకు తగ్గిస్తాయి. కానీ జుట్టు కుదుర్ల నుంచి రాలిపోవడానికి కారణమయ్యే సమస్యను అవి తప్పనిసరిగా పరిష్కరించవు. జుట్టు రాలడానికి అనేక వైద్యపరమైన కారణాలు ఉంటాయి. ఆండ్రోజెనెటిక్ అలోపేషియా, థైరాయిడ్ సమస్యలు, పోషకాహార లోపాలు, హార్మోన్లలో మార్పులు, అనారోగ్యం, ఒత్తిడి, కొన్ని మందుల వాడకం వంటి కారణాల వల్ల జుట్టు రాలుతుంది. కాబట్టి కేవలం సౌందర్య చికిత్సతో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించడం సాధ్యం కాదు. హెయిర్ స్పా వల్ల తక్షణంగా కనిపించే ప్రయోజనాలు ప్రధానంగా సౌందర్యపరమైనవే. జుట్టు మృదువుగా, మెరుస్తూ, చిక్కులు లేకుండా, సులభంగా నిర్వహించుకునేలా మారుతుంది. అయితే తలకు మసాజ్ చేయడం వల్ల జుట్టు మందం పెరుగుతుందని సూచించే పరిమిత పరిశోధనలు ఉన్నప్పటికీ, హెయిర్ స్పా సాధారణ జుట్టు రాలడాన్ని చికిత్స చేస్తుందని నిర్ధారించే బలమైన ఆధారాలు లేవు.



## ప్రోటీన్ పౌడర్లను తీసుకోవడంపై చాలా మందికి ఉండే అపోహలు ఇవే..

ప్రస్తుతం ప్రోటీన్ పౌడర్లు కేవలం బాడీబిల్డర్లు, క్రీడాకారులు మాత్రమే ఉపయోగించే సప్లిమెంట్లుగా కాకుండా సాధారణ ఆహారంలోనూ భాగంగా మారుతున్నాయి. వ్యాయామం తర్వాత షేక్‌గా తీసుకోవడం, ఉదయం ఓట్స్‌లో కలుపుకోవడం వంటి పద్ధతుల్లో చాలామంది వీటిని ఉపయోగిస్తున్నారు. కండరాల పునరుద్ధరణ, బరువు నియంత్రణ, శక్తి పెంపు కోసం ప్రోటీన్ పౌడర్లు ఉపయోగపడతాయని చెబుతున్నప్పటికీ, వీటి భద్రత, మోతాదుపై అనేక అపోహలు ఉన్నాయి. ప్రోటీన్ పౌడర్లకు సంబంధించి సాధారణంగా వినిపించే పది అపోహలు, వాటి వెనుక ఉన్న వాస్తవాల గురించి నిపుణులు వివరిస్తున్నారు. ప్రోటీన్ పౌడర్లు తీసుకుంటే ఆరోగ్యవంతమైన వ్యక్తుల్లో కిడ్నీలు దెబ్బతింటాయనేది ఒక సాధారణ అపోహ. అయితే కిడ్నీల పనితీరు సాధారణంగా ఉన్నవారు సిఫారసు చేసిన రోజువారీ పరిమితుల్లో ప్రోటీన్ లేదా ప్రోటీన్ సప్లిమెంట్లు తీసుకోవడం సాధారణంగా సురక్షితమే. అయితే ఇప్పటికే దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ఉన్నవారు మాత్రం ప్రోటీన్ తీసుకునే పరిమాణాన్ని తప్పనిసరిగా నియంత్రించాల్సి ఉంటుంది. ఆరోగ్యవంతమైన, చురుకైన వ్యక్తుల్లో సిఫారసు చేసిన పరిమితికి మించి ప్రోటీన్ తీసుకున్నా కిడ్నీల వడపోత సామర్థ్యం లేదా మొత్తం కిడ్నీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆధారాలు లేవని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రోటీన్ పౌడర్లు కేవలం బాడీబిల్డర్లు, క్రీడాకారుల కోసమేననేది మరో అపోహ. ప్రోటీన్ శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషక పదార్థం. ఎంజైమ్‌ల తయారీ, రోగనిరోధక వ్యవస్థ పనితీరు, కణజాలాల పునరుద్ధరణ, హార్మోన్ల సమతుల్యత వంటి అనేక ప్రక్రియల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. వ్యాయామంచేయని పెద్దలు, వయసు పెరుగుతున్న కొద్దీ కండరాల పరిమాణం తగ్గే సమస్యను ఎదుర్కొంటున్న వృద్ధులు, అనారోగ్యం నుంచి కోలుకుంటున్నవారు కూడా రోజువారీ ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవడానికి సప్లిమెంట్లను ఉపయోగించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రోటీన్పౌడర్ తీసుకుంటే మహిళలు వెంటనే భారీ కండరాలతో కనిపిస్తారనేది కూడా అపోహే. గణనీయంగా కండరాలు పెరగాలంటే ప్రత్యేకమైన వ్యాయామ ప్రేరణ, క్రమంగా పెంచే శక్తి శిక్షణ, తగినంత కేలరీల తీసుకోవడం వంటి అనేక అంశాలు అవసరం. మహిళల్లో పురుషులతో పోలిస్తే టెస్టోస్టెరాన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల కేవలం ఆహారంలో ఒక స్కూప్ ప్రోటీన్ పౌడర్‌ను చేర్చడం ద్వారా భారీ కండరాల శరీరాకృతి ఏర్పడదు. బదులుగా ప్రోటీన్ సన్నని కండరాల నిర్మాణం, శరీర జీవక్రియ ఆరోగ్యానికి తోడ్పడుతుంది.



## ఏడాదిలోనే 50%పెరిగిన రాగి ధర

ప్రపంచవ్యాప్తంగా రాగి తవ్వకం, శుద్ధి సామర్థ్యాల మధ్య పెరుగుతున్న అసమతుల్యత వల్ల.. సరఫరా ఒత్తిళ్లు పెరిగి, రాగి ధరలు రికార్డు స్థాయికి చేరాయని ఇండియన్ ప్రైమరీ కాపర్ ప్రొడ్యూసర్ అసోసియేషన్ తెలిపింది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజీలో రాగి ధర టన్ను 14,737 డాలర్ల (రూ.14 లక్షల)కు చేరింది. ఇది గతేడాది సెప్టెంబరుతో పోలిస్తే 50% ఎక్కువ. అమెరికా సుంకాలు విధించొచ్చనే అంచనాలు, గనుల నుంచి సరఫరా తగ్గడం, ప్రపంచ నిల్వల్లో తీవ్రమైన మార్పుల వల్ల మార్కెట్ స్వరూపం మారుతుండటం ఇందుకు కారణమని ఐపీసీపీఏ పేర్కొంది. కామెక్స్, ఎల్ఎంఈ మార్కెట్ల మధ్య ఉన్న ధరల వ్యత్యాసాన్ని అనుకూలంగా మల్చుకునేందుకు.. ఈ ఏడాది ప్రారంభం నుంచి లక్షల టన్నుల రాగి అమెరికాకు రవాణా అయినట్లు తెలిపింది.




# ఎన్ఎస్ఈ ఐపీఓ తేదీలొచ్చాయ్..

మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ పబ్లిక్ ఇష్యూ తేదీలు వచ్చేశాయి. సెప్టెంబరు 17న ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఎన్ఎస్ఈ షేరు ధరల శ్రేణిని రూ.1700–రూ.1785గా నిర్ణయించారు. ఒక్కో షేరు ముఖ విలువను రూ.1గా పేర్కొన్నారు. ఒక లాట్ పరిమాణంలో ఎనిమిది షేర్లు ఉంటాయి. అంటే.. రిటైల్ ఇన్వెస్టర్లు ఒక లాట్ కోసం రూ.14,280 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

సబ్‌స్క్రిప్షన్ ప్రారంభ తేదీ : సెప్టెంబరు 17
ముగింపు తేదీ: సెప్టెంబరు 21
షేర్ల కేటాయింపు: సెప్టెంబరు 22
డీమ్యాట్ ఖాతాల్లో షేర్ల క్రెడిట్: సెప్టెంబరు 23
లిస్టింగ్ తేదీ: సెప్టెంబరు 24
సిప్.. రెండేళ్లు చూసి ఆపేయొద్దు

షేరు ధర అప్పర్ బ్యాండ్ వద్ద ఎన్ఎస్ఈ ఐపీఓ విలువ




రూ.22,561.57కోట్లుగా ఉండనుంది. దీంతో దేశంలో రెండో అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టించనుంది. మొత్తం షేర్లలో 35శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు కేటాయించారు. 50శాతం క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బిడ్డర్లకు రిజర్వ్ చేశారు. మిగతా షేర్లను నాన్–ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచనున్నారు. అర్హత కలిగిన ఎన్ఎస్ఈ ఉద్యోగులకు షేరకు రూ.170 చొప్పున డిస్కౌంట్ లభించనుంది. మొత్తం 12.64 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలోనే విక్రయించనున్నారు. వీటిని ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ వంటి సంస్థల ద్వారా సేల్‌కు పెట్టనున్నారు. ఇందులో ఒక్క ఎస్‌బీఐనే 2.48 కోట్ల షేర్లను విక్రయించనుంది. గతంలో మొత్తం 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించాలని ప్రణాళికలు చేసినప్పటికీ.. ఇష్యూ పరిమాణాన్ని 15శాతం మేర కుదించారు. వాస్తవానికి ఈ ఐపీఓ దశాబ్దం క్రితమే రావాల్సి ఉంది. కో–లొకేషన్ వివాదం కారణంగా ఇన్నాళ్లూ ఆలస్యమైన ఈ పబ్లిక్ ఇష్యూకు ఇటీవలే సెబీ నుంచి ఆమోదం లభించింది.

# స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో భారీగా రికవరీ అయ్యాయి. సెన్సెక్స్ దాదాపు 620 పాయింట్లు మేర కోలుకుంది. మళ్లీ ఆఖర్లో స్వల్ప నష్టాల్లోకి జారుకున్నాయి. ఆసియా మార్కెట్‌లు దాదాపు నష్టాల్లోనే ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,309.16 (క్రితం ముగింపు 74,902.59) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,160.16 వద్ద కనిష్ఠాన్ని తాకింది. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో మధ్యాహ్నం తర్వాత సూచీ నష్టాలను భర్తీ చేసింది. చివరికి 120.83 పాయింట్ల నష్టంతో 74,781.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 79.70 పాయింట్ల నష్టంతో 23,398 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.57గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ




బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి.

# ఇకామర్స్ కొనుగోళ్లకు భరోసా



ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో కొనుగోళ్లకు మరింత భరోసా ఇచ్చేందుకు, వినియోగదారులను తప్పుదోవ పట్టించే మోసపూరిత పద్ధతులకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ రంగంలోకి దిగింది. కన్జ్యూమర్ ప్రొటెక్షన్ (ఇ–కామర్స్) నిబంధనలు, 2020ను సవరిస్తూ.. కన్జ్యూమర్ ప్రొటెక్షన్ (ఇ–కామర్స్) సవరణ నిబంధనలు–2026ను గురువారం నోటిఫై చేసింది. ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. వీటి ప్రకారం ఇకపై ఏదైనా వస్తువుపై రాయితీ ఇస్తున్నామని ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో ప్రకటించినప్పుడు.. తగ్గించిన ధరతో పాటు, అంతకు ముందు ఉన్న అసలు ధరను కూడా స్పష్టంగా చూపించాలి. రాయితీ ప్రకటించడానికి ముందు గత 30 రోజుల్లో ఆ వస్తువు అమ్ముడైన అత్యల్ప ధరనే 'ప్రయర్ ప్రైస్'గా పరిగణించాలి. కృత్రిమంగా గరిష్ఠ విక్రయ ధర పెంచి.. ఆయా సందర్భాల్లో భారీ రాయితీ ఇస్తున్నట్లు భ్రమ కల్పించే మోసాలకు ఇది అడ్డుకట్ట వేయనుంది. వినియోగదారులు వెతికే క్వైరీలకు సంబంధం లేకుండా, సెర్చ్ ఫలితాలను తారుమారు చేసి తప్పు దోవ పట్టించడాన్ని నిషేధించారు. ప్రకటనల ద్వారా చూపించే స్పాన్సర్డ్ లిస్టింగ్స్ ఏవో వినియోగదారుడికి స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక లేబుల్స్ వేయాలి. ప్రతి ఇ–కామర్స్ సంస్థ తప్పనిసరిగా 'నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్‌లైన్' (ఎన్‌సీహెచ్) వ్యవస్థతో అనుసంధానం కావాలి. 2025లో ఎన్‌సీహెచ్‌కు వచ్చిన మొత్తం 17.71 లక్షల ఫిర్యాదుల్లో, దాదాపు 29% (5.11 లక్షలు) ఇ–కామర్స్ రంగానికి సంబంధించినవే ఉన్నాయి. వినియోగదారుడు ఫిర్యాదు చేసినప్పుడు, గ్రీవెన్స్ అధికారి వద్ద నమోదైన రికార్డు కాపీని తప్పనిసరిగా ఫిర్యాదుదారునికి అందించాలి. కొనుగోలుదారులకు తెలియకుండానే బుట్టలోపడేసే డార్క్ ప్యాటర్న్స్ (హిడెన్ ఛార్జీలు, బలవంతపు సబ్‌స్క్రిప్షన్‌లు వంటివి) అంశాల్లో నియంత్రణ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. ప్రతి ఇ–కామర్స్ సంస్థ ఏటా స్వీయ ఆడిట్ నిర్వహించి, తాము నిబంధనలు పాటిస్తున్నట్లు సర్టిఫికెట్‌ను వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలి.

## ఐఫోన్ల విక్రయాలు తగ్గొచ్చు..!

యాపిల్ తన కొత్త మోడల్ 'ఐఫోన్ 18'ను విడుదల చేసిన వెంటనే భారత్‌లో పాత ఐఫోన్ల ధరలు భారీగా పెంచేసింది. మరోవైపు, కొత్తగా విడుదల చేసిన ఫోల్డబుల్ ఫోన్‌తో పాటు ఐఫోన్ 18 శ్రేణి ధరలు కూడా విపరీతంగా ఉన్నాయి. దీనిపై ఇప్పటికే నెట్టింట సెటైర్లు పేలుతున్నాయి. అయితే, ఈ ధరల ప్రభావం దేశీయంగా ఐఫోన్ విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపొచ్చని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. 2026 క్యాలెండర్ సంవత్సరంలో భారత్‌లో ఐఫోన్ విక్రయాలు కాస్త తగ్గే అవకాశం ఉందని మార్కెట్ రీసెర్చర్స్ ఐడీసీ ఇండియా, కౌంటర్‌పాయింట్ అంచనా వేశాయి. దేశీయంగా ఈ విక్రయాల్లో తొలిసారి క్షీణత నమోదవ్వొచ్చని పేర్కొన్నాయి. అయితే, అమ్మకాల విలువ పరంగా చూస్తే



మాత్రం.. 6–7శాతం వృద్ధి ఉండొచ్చని అంచనా వేశాయి. మరోవైపు, ఐఫోన్ల ధరల పెంపు వల్ల గ్రే మార్కెట్ విక్రయాలు, వ్యక్తిగత దిగుమతులు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల రిటైల్ మార్కెట్ దెబ్బతిని, వ్యాపారులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంది. యాపిల్ కొత్తగా విడుదల చేసిన ఐఫోన్ 18 శ్రేణి ధర రూ.1,64,900 నుంచి మొదలైన సంగతి తెలిసిందే. మడతపెట్టే ఐఫోన్ డ్యూయో ప్రారంభ ధర రూ.2,99,900గా ఉంది. ఐఫోన్ 17, ఐఫోన్ ఎయిర్, ఐఫోన్ 16 ధరలను కూడా యాపిల్ భారీగా పెంచేసింది. ఇతర దేశాల మార్కెట్లతో పోలిస్తే భారత్‌లో వీటి ధరలు దాదాపు 10–15శాతం అధికంగా ఉండటం గమనార్హం.

# నగర యువతలో పెరుగుతున్న వెరికోస్ వీన్స్

ఒకప్పుడు మహిళల్లో మాత్రమే ఎక్కువగా కనిపించే వెరికోస్ వీన్స్ (సిరలు ఉబ్బే వ్యాధి) ఇప్పుడు హైదరాబాద్ నగరంలోని 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న పురుషులు, యువతలోనూ వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం బాహ్య సౌందర్య సమస్య కాదని, రక్తప్రసరణ లోపానికి సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రక్తనాళాలు ఉబ్బి, మెలికలు తిరిగి, బయటకు పొడుచుకు వచ్చినట్లు కనిపించే ఈ సమస్యను చాలామంది కేవలం బాహ్య సౌందర్యానికి సంబంధించిన ఇబ్బందిగా కొట్టిపారేస్తుంటారు. అయితే, ఇది శరీరంలోని రక్తప్రసరణ లోపానికి (వీనస్ ఇన్‌సఫిషియెన్సీ) సంకేతం కావచ్చు. సకాలంలో చికిత్స తీసుకోకపోతే పరిస్థితి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ వాస్కులర్ అండ్ ఎండోవాస్కులర్ సర్జరీ హెడ్, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా మాట్లాడుతూ ప్రారంభ దశలో వైద్యులను సంప్రదిస్తున్న వారిలో అత్యధికులు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు వారే ఉంటున్నారన్నారు. సాధారణంగా 20 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులకు వ్యాధి ప్రాథమిక దశలోనే వస్తుండగా, 50 లేదా 60 ఏళ్లు దాటిన తర్వాత వచ్చే వారిలో సిరలు తీవ్రంగా ఉబ్బి, మెలికలు తిరిగి వ్యాధి ముదిరిన స్థితిలో ఉంటుందన్నారు. గర్భధారణ కూడా ఈ సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటన్నారు. ముఖ్యంగా మూడో త్రైమాసికంలో రక్త పరిమాణం పెరగడం, బరువు పెరగడం, హార్మోన్ల మార్పుల వల్ల రక్తనాళాలు వ్యాకోచించి కాళ్ల వాపునకు దారి తీస్తాయన్నారు. హైదరాబాద్‌లో శారీరక శ్రమ లేని జీవనశైలి, ఊబకాయం, గర్భధారణ, వంశపారంపర్య అంశాలు ఈ సమస్య పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని వివరించారు.



సిరల్లోని కవాటాలు (వాల్వ్‌లు) సరిగ్గా పని చేయనప్పుడు రక్తం వెనక్కి ప్రవహించి కాళ్లలోనే పేరుకుపోవడం వల్ల వెరికోస్ వీన్స్ సమస్య ఏర్పడుతుందన్నారు. బయటకు కనిపించే ఉబ్బిన రక్తనాళాలతో పాటు రోగులలో కాళ్లలో బరువుగా అనిపించడం, నొప్పి, వాపు, అలసట, దురద లేదా అసౌకర్యం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ముఖ్యంగా ఎక్కువసేపు నిలబడినప్పుడు, కూర్చున్నప్పుడు ఇవి మరింత ఎక్కువగా ఉంటాయన్నారు. హైదరాబాద్‌లో వృత్తిపరమైన బాధ్యతలు, జీవనశైలి కూడా ఈ సమస్యకు దారితీస్తున్నాయన్నారు. రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నిలబడే ఉపాధ్యాయులు, శస్త్రచికిత్సలు చేసే సర్జన్లు, ట్రాఫిక్ పోలీసులు, బస్సు కండక్టర్లు ఎక్కువసేపు నిల్చుని పని చేయాల్సి వస్తుందన్నారు. అదే సమయంలో డెస్క్ ఉద్యోగాల్లో గంటల తరబడి ఒకేచోట కూర్చోవడం వల్ల కూడా ఈ ముప్పు పెరుగుతుందన్నారు. ఊబకాయం ఈ ప్రమాదాన్ని మరింత ఎక్కువ చేస్తుందన్నారు. ప్రతి రోగికీ శస్త్రచికిత్స లేదా ప్రత్యేక ప్రక్రియలు అవసరం ఉండకపోవచ్చన్నారు. ప్రారంభ దశలోని వెరికోస్ వీన్స్‌ను జీవనశైలి మార్పులు, సరైన కంప్రెషన్ థెరపీ (ప్రత్యేకమైన సాక్సులు ధరించడం) ద్వారా అదుపు చేయవచ్చన్నారు. ప్రాథమిక దశలోనే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రక్తనాళాలు మరింత దెబ్బతినకుండా కాపాడుకోవచ్చన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాలలో థర్మల్ అబ్లేషన్, స్క్లెరోథెరపీ, మెడికల్ గ్లూ వంటి అడెసివ్ ఆధారిత చికిత్సలు ఉన్నాయన్నారు. రక్తనాళం పరిమాణం, రోగి ఆరోగ్య పరిస్థితి, మునుపటి మెడికల్ హిస్టరీ, ఎలర్జీలు, వారి వ్యక్తిగత ప్రాధాన్యతలను బట్టి సరైన చికిత్సా విధానాన్ని ఎంపిక చేస్తారన్నారు. చాలామంది రోగులకు ఒకటి కంటే ఎక్కువ రకాల చికిత్సలు సరిపోయే అవకాశం ఉన్నందున, వైద్యుడితో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవడం ముఖ్యమన్నారు.




## ఇది AIతోనే సాధ్యం.. హర్మన్ ప్రీత్ వైరల్ క్యాచ్!



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చాక క్రియేటివిటీ మరీ ఎక్కువైపోయింది. ఏది నిజమో.. ఏది మాయాజాలమో తెలియడం లేదు. ఇలాంటిదే నిన్నటి నుంచి ఓ వీడియో తెగ వైరల్‌గా మారిపోయింది. కానీ, అది మాత్రం పక్కా ఏఐ వీడియో అని తెలిసినా.. చాలా మంది ఫన్నీగా ఉందని షేర్ చేసేశారు. ఇంతకీ అదేంటో చూద్దాం.. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్ ప్రీత్ అద్భుతమైన క్యాచ్ పట్టిందని.. ఇలా ఎవరూ అందుకోలేరంటూ ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారిపోయింది. సాధారణంగా డైవ్ చేసి లేదా పక్కకు దూకి బంతిని అందుకోవడం చూస్తుంటాం. కానీ, హర్మన్ మాత్రం పైకి ఎగిరి.. జిమ్నాస్టిక్స్ చేసినట్లు రింగ్‌లా తిరిగి క్యాచ్ తీసుకుంది. ఇలా ఎప్పుడైనా జరిగిందా? అంటూ ఓ యూజర్ చేసిన పోస్టు వైరల్‌గా మారింది. అయితే, ఇది కేవలం ఏఐతోనే సాధ్యమని అభిమానులూ సరదాగా కామెంట్లు చేసేశారు. అసలు ఆమె హర్మన్‌లానే లేదని మరికొందరు పేర్కొన్నారు. ప్రస్తుతం భారత మహిళా జట్టు ఆసియా కప్‌లో తలపడుతోంది. ఇప్పటికే ఫైనల్‌కు చేరుకుంది. ఇక్కడ న్యూజిలాండ్ ఎదురయ్యే పరిస్థితి లేదు. కాబట్టి.. పాత మ్యాచ్‌ను తీసుకొని క్రియేట్ చేశారని ఇట్టే తెలిసిపోతుంది కదా.. ఆ వీడియోను మీరూ చూసేయండి.

# సెహ్వాగ్ కంటే గొప్పనా?: ఆయూబ్‌ను ఆడించడంపై నాజర్ హుస్సేన్ విమర్శలు




పాకిస్థాన్ క్రికెట్ టీమ్ తీసుకునే ప్రతి నిర్ణయమూ విమర్శలకు దారితీస్తోంది. పర్యటన మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపింది. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడని సైమ్ ఆయూబ్‌ను ఏకంగా తుది జట్టులోకి తీసుకుంది. తీరా, ఆ ఆటగాడు ఘోరమైన ప్రదర్శన చేశాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో సైమ్‌తోపాటు పాక్ మేనేజ్‌మెంట్ తీరును ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ నాజర్ హుస్సేన్ విమర్శించాడు. ఈ క్రమంలో టీమ్ఇండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్‌ను ఉదాహరణగా పేర్కొనడం గమనార్హం.

'సైమ్ ఆయూబ్ చివరిసారిగా 2025 అక్టోబర్‌లో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడిందే లేదు. సీపీఎల్ టీ20 క్రికెట్ బరిలో ఉన్న అతడు.. అక్కడ్నుంచి నేరుగా ఇంగ్లాండ్ గడ్డపై అడుగు పెట్టాడు. విదేశీ పిచ్‌లపై కనీసం అవగాహన లేని కుర్రాడిని ఇలా పంపించాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారో అర్థం కావడం లేదు. రాబిన్ సన్‌తో కూడిన ఇంగ్లాండ్ బౌలింగ్ ఎటాక్‌ను అతడు ఎలా ఎదుర్కొంటాడని భావించారో? ఇలాంటి నిర్ణయాలతో టెస్టు క్రికెట్‌ను అగౌరవపరిచినట్లే. మీరు ఏ క్రికెటర్‌నైనా అడగండి.. టెస్టు ఫార్మాట్ చాలా క్లిష్టమైందనే చెబుతారు. ఇక ఇంగ్లిష్ గడ్డపై టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయడమంటే అత్యంత కఠినం. కానీ, మీరు మాత్రం ఎక్కడో ఉన్న ఓ ప్లేయర్‌ను తీసుకొచ్చి 'గుడ్ లక్' అని చెప్పి ఇక్కడ వదిలేశారు. కానీ, ఆ కుర్రాడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సున్నాకే పరిమితమయ్యాడు'' అని నాజర్ విమర్శించాడు. భారత్ 2011లో ఇంగ్లాండ్ పర్యటనకు (India Tour England) వెళ్లింది. సిరీస్ మధ్యలోనే స్వదేశంలో ఉన్న వీరేంద్ర సెహ్వాగ్‌ను టీమ్ఇండియా పిలిపించింది. మూడో టెస్టుకు నేరుగా ఓపెనర్‌గా బరిలోకి దింపింది. కానీ, సెహ్వాగ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. ఇప్పుడు దానిని ఉదహరిస్తూ ఆయూబ్‌పై నాజర్ విమర్శలు చేశాడు. ''ఇదే ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో సెహ్వాగ్ కూడా రెండు ఇన్నింగ్స్‌ల్లో పరుగులేమీ చేయలేదు. అతడిని కూడా భారత్ నుంచి అర్ధంతరంగా తెప్పించారు. ఎంతో అనుభవం కలిగిన సెహ్వాగ్ కూడా ఈ పిచ్‌పై ఇబ్బంది పడ్డాడు. అతడి కంటే ఆయూబ్ ఏమైనా గొప్పవాడా?'' అని హుస్సేన్ వ్యాఖ్యానించాడు.

## సచిన్ రికార్డ్‌కు దగ్గరగా జో రూట్.. వివ్ రిచర్డ్స్ ఆసక్తికర కామెంట్స్



ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజ ఆటగాడు సచిన్ తెందుల్కర్ సృష్టించిన రికార్డులు కోకొల్లలు. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సచిన్ ఇప్పటికీ కొనసాగుతున్నాడు. ఈ రికార్డుకు ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ చేరువగా వచ్చాడు. సచిన్ ఖాతాలో 15,921 పరుగులు ఉండగా.. రూట్ ఇప్పటి వరకు 14,208 రన్స్ సాధించాడు. ప్రస్తుతం మంచి ఫామ్‌లోనే ఉన్న అతడు కనీసం రెండేళ్లు ఆడితే చాలు సచిన్‌ను అధిగమించడం పెద్ద కష్టమేం కాదు. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జెఫ్రీ బాయ్‌కాట్ కంటే రూట్ బెటర్ బ్యాటర్‌గా నిరూపించుకున్నట్లేనని సరదాగా కామెంట్ చేశాడు. ''ఇప్పుడు జో రూట్ కెప్టెన్. తప్పకుండా తుది జట్టులో ఉంటాడు. సచిన్ రికార్డును అధిగమించడానికి అనుకూలమైన పరిస్థితుల్లోనే ఉన్నాడు. క్రికెట్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది. అంతేకాకుండా ఇంగ్లాండ్ దిగ్గజం జెఫ్రీ బాయ్‌కాట్‌కూ ఓ సందేశం పంపినట్లు అవుతుంది. యార్క్‌షైర్ నుంచి వచ్చిన అత్యుత్తమ బ్యాటర్ ఇక నుంచి రూట్ అని బాయ్‌కాట్‌కు చెప్పినట్లు అవుతుంది'' అని రిచర్డ్స్ వెల్లడించాడు. రూట్ తండ్రి మ్యాట్ రూట్ ఈ రికార్డుపై తన అభిప్రాయం వెల్లడించాడు. ''గతంలో కెప్టెన్‌గా ఉన్నప్పుడు రూట్ ఒక్క ఏడాదిలోనే 1,700 పరుగులు రాబట్టాడు. కెప్టెన్సీ భారం కాదని నిరూపించాడు. ఫిట్‌గా, ఏకాగ్రతతో ఉండి.. ఆడాలనే కోరిక ఉన్నంతకాలం సచిన్ రికార్డును అందుకోవడం పెద్ద కష్టమేం కాదు'' అని మ్యాట్ తెలిపారు.

## మా సత్తా చూపిస్తాం: భారత్‌తో మ్యాచ్‌పై జపాన్ కెప్టెన్

సెప్టెంబర్ 22.. జపాన్ క్రికెట్ అభిమానులకు గుర్తుండిపోయే రోజు. టీమ్ఇండియాతో జపాన్ తొలిసారి టీ20 మ్యాచ్‌ను ఆడనుంది. బేస్‌బాల్‌ను ఎక్కువగా ఇష్టపడే జపాన్‌లో క్రికెట్ విస్తరణతో పాటు.. భారత్–




జపాన్ ద్వైపాక్షిక సంబంధాల 75వ వార్షికోత్సవాలకు సూచికగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే టికెట్లన్నీ సేల్ అయిపోయినట్లు జపాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఇక ఆసియా గేమ్స్ కూడా జపాన్‌లోనే జరగనున్న సంగతి తెలిసిందే. తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకి ఫ్లెమింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

'ఈ మ్యాచ్ కోసం మేం చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం. జపాన్‌లో పెద్ద ఎత్తున క్రికెట్ వృద్ధికి ఉపయోగపడుతుందని భావిస్తున్నా. అఫ్గానిస్థాన్, నేపాల్ వంటి జట్లు ఇక్కడికి వస్తున్నాయి. రెండేళ్ల క్రితం వరకూ ఈ జట్లతో మ్యాచులను నిర్వహించడమూ కష్టమని భావించేవాళ్లం. కానీ, ఇప్పుడు భారత్ వంటి పెద్ద టీమ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతున్నాం. కేవలం ఆ సందర్భాన్ని ఆస్వాదించడానికి మాత్రమే కాదు.. ఓ జట్టుగా మేం ఏం చేయగలమో నిరూపించుకోవడమే మా ముందున్న లక్ష్యం. అన్ని విభాగాల్లోనూ భారత్ అత్యుత్తమైన టీమ్. ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో ప్రత్యక్షంగా ఆడటం గొప్ప అనుభూతిని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఐసీసీ పూర్తి సభ్య దేశాలతో పోటీపడటమనేది సుదీర్ఘ చరిత్రలో మొదటి అడుగు అవుతుందని ఆశిస్తున్నా'' అని కెండెల్ తెలిపాడు.

# ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్' ప్రారంభం

భారత సాఫ్ట్‌బాల్ క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి చేర్చే లక్ష్యంతో 'ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ లీగ్' రెండో సీజన్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి సీజన్‌తో పోలిస్తే దాదాపు మూడు రెట్ల విస్తృతితో దేశవ్యాప్తంగా 32 జట్లు, 127 మ్యాచ్‌ల భారీ షెడ్యూల్‌ను లీగ్ నిర్వాహకులు ప్రకటించారు. ప్రముఖ క్రికెట్ దిగ్గజాలు హర్భజన్ సింగ్, సురేష్ రైనా బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వీక్షకులకు చేర్చేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్, స్క్రీనాక్స్, మైఆసియా వంటి సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రికెట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ రాజు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం సాఫ్ట్‌బాల్ మైన నేపథ్యం ఉందన్నారు. ఎందుకంటే, ఇది అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన ఆటగాళ్లకు పెద్ద వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. సీజన్ 2 ఇంత భారీ స్థాయిలో విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రయాణంలో భాగస్వాములు కావడం, ఈ క్రీడను మరింత విస్తృతమైన ప్రేక్షకులకు చేర్చడంలో సహాయపడటం మాకెంతో ఉత్సాహాన్నిస్తోందని తెలిపారు. మా అనుబంధం ఆటగాళ్లకు, జట్లకు క్రీడకు మరింత గుర్తింపును తెస్తుందని, దేశవ్యాప్తంగా మరింత మంది యువ క్రికెటర్లు ఈ క్రీడలో తమకూ ఒక స్థానం ఉందనే నమ్మకాన్ని కలిగించేలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైఆసియా ప్రతినిధి నూరుల్ అమీన్ మాట్లాడుతూ ఇది కేవలం ఒక్క సీజన్‌కు మాత్రమే పరిమిత



క్రికెట్‌ను ప్రజలు గుర్తించేలా చేయడానికి ప్రయత్నించేవాళ్లమన్నారు. ఇప్పుడు మా వద్ద 32 జట్లు ఉన్నాయన్నారు. చాలా జట్లలో చిన్న చిన్న పట్టణాల నుంచి ఆటగాళ్లు వచ్చారన్నారు. సీజన్ 2 ప్రత్యేకత ఇదేనన్నారు. ఈ సందర్భంగా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ మాట్లాడుతూ లీగ్ ఎంత పెద్దదైతే అంత ఎక్కువ మంది యువ ఆటగాళ్లకు గుర్తింపు దక్కే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సోనీ స్పోర్ట్స్ ఏవీపీ కౌశిక్ కల్లూరి మాట్లాడుతూ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో కేవలం ఒక ఆటను టెలివిజన్‌లో ప్రసారం చేయడమే కాదన్నారు. ఈ ఆటకు ఒక ప్రత్యేకమైన స్పాన్సర్‌షిప్ కాదన్నారు. భారతదేశంలో సాఫ్ట్‌బాల్ క్రికెట్ వృద్ధిపై పెట్టిన దీర్ఘకాలిక పెట్టుబడి అని స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ టెలివిజన్ ప్రేక్షకులకు అందించేందుకు సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ అధికారిక ప్రసార భాగస్వామిగా ఉంది. దేశవ్యాప్తంగా 1500 పైగా స్క్రీన్లలో ఈ మ్యాచ్‌లను ప్రదర్శించడానికి స్క్రీనాక్స్ అధికారిక స్క్రీనింగ్ భాగస్వామిగా వ్యవహరించనుంది. ఇక అంతర్జాతీయ లీగ్‌గా విస్తరించడంతో పాటు వాణిజ్యపరంగా క్రీడా ప్రాపర్టీగా తీర్చిదిద్దే బాధ్యతతో మైఆసియా వ్యూహాత్మక భాగస్వామిగా జతకట్టింది.

# 'వృషకర్మ' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్



**వుదయం సినిమా:** యువ సామ్రాట్ నాగ చైతన్య, విజనరీ ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండు మోస్ట్ ఎవైటెడ్ మైథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతోంది. బాపినీడు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లర్ అంశాలను ఎవరూ టచ్ చేయని ఒక సరికొత్త నేపథ్యం లో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. తాజాగా 'వృషకర్మ' సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా డిసెంబర్ 4, 2026న థియేటర్లలో విడుదల కానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇది పర్ఫెక్ట్ రిలీజ్ టైమ్. సినిమాను ప్రమోట్ చేసేందుకు మేకర్స్‌కు తగినంత సమయం ఉంటుంది. ఈ సందర్భం గా మేకర్స్ విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరి పోయింది. కార్తిక్ దండు డిఫరెంట్ విజన్‌తో పాటు ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ క్రియేటివ్ ఫోర్సెస్ 'వృషకర్మ' కోసం కలిసి పనిచేస్తున్నాయి. ఇప్పటికే సినిమా స్ట్రైకింగ్ గ్లింప్స్, బిహైండ్ ది సీన్స్ వీడియోలు విడుదలై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని పెంచాయి. ఈ వీడియోలు సినిమా యూనిక్ వరల్డ్, స్కేల్, విజువల్ గ్రాండియర్‌కు సంబంధించిన ఓ అద్భుతమైన లుక్ ను అందించాయి. వైవిధ్యమైన, ఛాలెంజింగ్ సబ్జెక్టుల తో వస్తున్న నాగచైతన్య 'వృషకర్మ'లో డిఫరెంట్ రోల్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆయన మ్యాసీవ్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. ఇప్పటికే తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేశారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనున్నారు. ఇప్పటికే గ్లింప్స్‌లో స్పర్శ్ శ్రీవాస్తవ తన స్ట్రైకింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. దీంతో ఆయన పాత్రపై మరింత ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. రిలీజ్ డేట్ అధికారికంగా లాక్ కావడంతో మేకర్స్ భారీ ప్రమోషనల్ క్యాంపెయిన్‌కు సిద్ధమవుతున్నారు. దేశవ్యాప్తంగా సినిమాను ప్రమోట్ చేయడంతో పాటు ఓవర్సీస్ మార్కెట్లలోనూ అగ్రెసివ్ ప్రమోషన్స్ నిర్వహించేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. 'వృషకర్మ' కోసం స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. రాగుల్ డి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తూ సినిమా కోసం ప్రత్యేకమైన ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటింగ్.

## వుదయం సినిమా MOVIE TIME!

# ప్యారడైజ్ నా కెరీర్‌లోనే ఎక్కువ కష్టపడి చేసిన సినిమా



న్యాచురల్ స్టార్ నాని

**వుదయం సినిమా:** న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. మీ అందరినీ కలిసి చాలా రోజులవుతుంది. ఎప్పుడూ నా కెరీర్‌లో ఒక సినిమాకి మరో సినిమాకి ఇంత గ్యాప్ రాలేదు. ఈ ప్రెస్ మీట్‌కి వస్తూ ఉంటే నా ఫస్ట్ సినిమాకి ఎంత నెర్వస్‌గా ఉన్నానో అంతే నెర్వస్‌గా ఉన్నానని అనిపించింది. మైక్‌లో మాట్లాడడం అలవాటు తప్పింది. ఫైనల్‌గా సెప్టెంబర్ 24న వస్తున్నాం. మొదటి సినిమాకి చాలా గొప్ప సపోర్ట్ ఉంది. ఇదే సపోర్ట్ కొనసాగుతుందని నమ్ముతున్నాను. ఆయా షేర్, ఏష నాగుల కట్ట, గ్లింప్స్, టీజర్.. సినిమా నుంచి ఏ కంటెంట్ ఇచ్చినా సరే అన్నిటికి ఆడియన్స్ బ్రహ్మరథం పట్టారు. సెప్టెంబర్ 24న ఆడియన్స్‌కి ఒక అద్భుతమైన అనుభూతిని అందించడానికి నిద్రాహారాలు లేకుండా పనిచేస్తున్నాం. మా టార్గెట్ ఒకటే. మీరందరూ చాలా అంచనాలతో థియేటర్‌కి వస్తారని తెలుసు. మీకు ఫస్ట్ నుంచి చివరి వరకు ఒక అడ్రినలిన్ పంపింగ్, హై ఇచ్చి ఇంటికి పంపించాలనేది మా తపన. మేమందరం దానికోసం కష్టపడుతున్నాం.డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సినిమా మొదలైనప్పటి నుంచి మీడియా వారు చాలా సపోర్ట్ చేస్తున్నారు. సినిమా రిలీజ్ అయ్యే వరకు ఈ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. సినిమా నుంచి ఏది వచ్చినా సరే ఆడియన్స్‌లో బ్లాస్ట్ అవుతుంది.

# విజయవంతమైన 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'

**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ 'బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య



జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న యువ దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయమయ్యారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. 'బేబీ' జోడీ, '90s' దర్శకుడి కలయికలో సితార నిర్మించిన సినిమా కావడంతో విడుదలకు ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా యువతలో తారాస్థాయి అంచనాలను ఏర్పరచుకున్న 'ఎపిక్' చిత్రం.. సెప్టెంబర్ 11 విడుదల తేదీ కాగా, సెప్టెంబర్ 10 రాత్రి ప్రీమియర్స్‌తోనే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకుంది. సహజమైన హాస్యం, సున్నితమైన భావోద్వేగాలతో ప్రతి ఒక్కరినీ కట్టిపడేస్తోంది. సినిమాకి అద్భుతమైన స్పందన లభిస్తుండటంతో బృందం ప్రెస్ మీట్ నిర్వహించి.. తమ సంతోషాన్ని పంచుకోవడంతో పాటు, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేసింది.కథానాయకుడు ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ.. "ప్రీమియర్స్ నుంచే సినిమాకి మంచి స్పందన లభించింది. ఇందులో ఉన్న కంటెంట్ చూసి, ఇది ఐదేళ్ల తర్వాత రావాల్సిన సినిమా అంటున్నారు. ప్రేమ కథ, కుటుంబ భావోద్వేగాలు ప్రతి ఒక్కరికీ నచ్చుతున్నాయి. ఇది నిజాయితీగా చేసిన సినిమా. నేను విదేశాల్లో చదువుకున్నాను. అందుకే ఈ కథకు బాగా కనెక్ట్ అయ్యాను. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన యువకుడి ప్రయాణం, ఆ భావోద్వేగాలు, తండ్రితో జరిగే సంభాషణలు ఇవన్నీ నా మనసుకు దగ్గరయ్యాయి. 90s సిరీస్ చూసినప్పుడే ఆదిత్య హాసన్ గొప్ప రచయిత అనుకున్నాను. ఇప్పుడు 'ఎపిక్' చూసిన తర్వాత కూడా అందరూ డైలాగ్స్ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. సినిమాలో ఆదిత్య పాత్రకు, ఆ రచనకు, ఆ ప్రేమ కథకు నేను కనెక్ట్ అయ్యాను. అందుకే ఎంతో నమ్మి ఈ సినిమా చేశాను. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన వస్తుండటం సంతోషంగా ఉంది. ఫస్ట్ హాఫ్ లో కామెడీ, సెకండ్ హాఫ్ లో ఎమోషన్స్ అందరికీ నచ్చుతున్నాయి." అన్నారు.

# నాకు రెస్పెక్ట్ తెచ్చి పెట్టిన ఇరుముడి

**వుదయం సినిమా:** మాస్ మహా రాజా రవితేజ 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫుల్ రన్ కొనసాగిస్తోంది. అన్ని వర్గాల ఆడియన్స్ ఈ సినిమాకు బ్రహ్మ రథం పడుతున్నారు. భారీ వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా నేటికీ స్ట్రాంగ్ కలెక్షన్స్ నమోదు చేస్తుండటం విశేషం. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర జోరును కొనసాగిస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ సెలెబ్రేషన్స్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భం గా హీరో రవితేజ మాట్లాడుతూ.. మా డైరెక్టర్లు, ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరికీ చాలా చాలా థాంక్స్. ఇక నేను మాట్లాడటానికి ఏమీ లేదు.. అందరూ ఈ సక్సెస్ గురించి ఎంతో చెప్పారు. ఈ సినిమా నాకు విపరీతమైన సాటిస్ఫాక్షన్ ఇచ్చింది. ఎంతో రెస్పెక్ట్ తెచ్చి పెట్టింది. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ వేల వేల కృతజ్ఞతలు. మమ్మల్ని శివ ఎన్నో నైట్స్ కష్టపెట్టి సూపర్ సక్సెస్ ఇచ్చారు. సినిమా సెట్స్ లో అందరం ఎంతో సరదాగా ఎంజాయ్ చేశాము. కోట శ్రీనివాసరావు బాబాయ్ అంత టాలెంట్ ఉన్న నటుడు అజయ్ ఘోష్. ఏ క్యారెక్టర్ అయినా చేయగలడు. సాయి అన్న, ప్రియా భవాని మీరు సూపర్ అంతే. చాలా మంది నాకు ఫోన్స్ చేస్తూ ఒక్కో సీన్ గురించి వాళ్ళ రియాక్షన్స్ చెబుతుంటే నా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ సినిమాతో నాకు ఇంత రెస్పెక్ట్ వచ్చింది అంటే ఆ క్రెడిట్ మొత్తం శివ నిర్వాణకే. యాక్టర్ గా నేను ఇప్పుడు చాలా గర్వంగా ఫీల్ అవుతున్నా. ఇరుముడి అంటే శివ, శివ అంటే శివ నిర్వాణ.



రవితేజ

# "ఐ బొమ్మ" సినిమా ట్రైలర్ లాంచ్

**వుదయం సినిమా:** బానోత్ పవన్, గౌతమ్, నర్మద, సతీష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "ఐ బొమ్మ". ఈ చిత్రాన్ని శ్రీ మల్లన్న క్రియేషన్స్ బ్యానర్ పై కురువ జమన్న నిర్మిస్తున్నారు. విజయ్ రఘునాథభట్ల దర్శ కత్వం వహిస్తున్నారు. ఈ సినిమా త్వరలో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. బుధ వారం హైదరాబాద్ లో "ఐ బొమ్మ" సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా వచ్చిన నిర్మాత రామసత్యనారాయ ణ మాట్లాడుతూ – "ఐ బొమ్మ" సినిమా ట్రైలర్ బాగుంది. ఈ రోజు సమాజంలో జరుగుతున్న దే కథగా చూపించారు. ఈ చిత్ర టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. చిన్న చిత్రాల నిర్మాతలకు క్యూబ్ యూఎఫ్ వో ఛార్జీలు భారంగా మారుతున్నాయి. నిర్మాతల మండలికి కొత్తగా ఎన్నికైన మా కార్యవర్గం తరుపున ఈ సమస్యకు పరిష్కారం చేయాలని అనుకుంటున్నాం అన్నారు.అతిథిగా వచ్చిన ప్రొడ్యూసర్ రాజా మాట్లాడుతూ – నేను వర్జిన్ బాయ్స్ సినిమా నిర్మించిన తర్వాత డైరెక్టర్ విజయ్ నా దగ్గరకు వచ్చి కలిశాడు. రెండు మూడు స్క్రిప్ట్స్ కూడా చెప్పా డు. మంచి టాలెంట్ ఉన్న యువ దర్శకుడు విజయ్. ఐ బొమ్మ సినిమా ట్రైలర్ బాగుంది. ఈ సినిమా విజయ్ తో పాటు టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలి అన్నారు. మూవీ ప్రొడ్యూసర్ కురువ జమన్న మాట్లాడుతూ – మా వృత్తి వ్యవసాయం.



# కాశీ మజిలీ ట్రైలర్ రిలీజ్

**వుదయం సినిమా:** కాశీ మజిలీ – చాలా సంవత్సరాల తర్వాత నటి రేణు దేశాయ్ నటించిన కాశీ మజిలీ వెబ్ ఎపిసోడ్ ట్రైలర్ రిలీజ్ అయింది. చాలా సంవత్సరాల తర్వాత కనిపించినా చాలా ఫ్రెష్ గా, అందంగా, మంచి నటనతో ట్రైలర్ లో రేణు దేశాయ్ నటన ఆకట్టుకుంటుంది. జె కె ఆర్ట్స్ బ్యానర్ పై జగదీష్ కుమార్ కాళ్ళూరు నిర్మించిన ఈ వెబ్ ఎపిసోడ్ ని 600 యాడ్స్ కు పైగా దర్శకత్వం వహించిన యమునా కిషోర్ దర్శకత్వం వహించారు. రేణు దేశాయ్ చాలా సంవత్సరాల తర్వాత కనిపించడం, అందంగా అద్భుతమైన నటన కనపరచడంతో ఈ ట్రైలర్ పై సర్వత్రా ఆసక్తి నెలకొని ఉంది. ఈ టీవీ విన్ లో ఈ ఆదివారం ప్రసారమయ్యే ఈ ఎపిసోడ్ కోసం రేణు దేశాయ్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# "ఎస్తర్ నోరోన్హా" కి పుట్టినరోజు శుభాకాంక్షలు...

**వుదయం సినిమా:** ప్రముఖ నటి ఎస్తర్ నోరోన్హా గారి పుట్టినరోజు సందర్భంగా దర్శక నిర్మాత అభినంద హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరెన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించాలని మరియు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అభినంద దర్శకత్వ నిర్మాణంలో రూపొందుతున్న చిత్రాన్ని బ్లూ రే సర్క్యూట్స్ బ్యానర్‌పై తెర కెక్కిస్తున్నట్లు తెలిపారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.